తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 19.04.2026 | సంపుటి : 12 సంచిక : 270 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్







## రెండోవిడత రైతుభరోసా రేపటి నుంచి..

కాటారాం సభ వేదికగా విడుదల చేయనున్న సీఎం రేవంత్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది.తెలంగాణ ముఖ్యమంత్రి మిగతా 2లో..

## ఏఐతో ఆందోళనలు అనవసరం

టెక్నాలజీ అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుంది :సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



న్యూఢిల్లీ(జనంసాక్షి):కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి శరవేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కర్ణాటక స్టేట్ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ మిగతా 2లో..

# మోదీ సర్కారు భారీ కుట్ర

## రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ పన్నాగం

- ప్రతిపక్షాలు ఓడించింది బీజేపీ దురుద్దేశాలనే...
- మహిళా రిజర్వేషన్ల బిల్లు రేపే తెచ్చినా మద్దతిస్తాం
- ప్రొరేటా పద్ధతి డీలిమిటేషన్‌తో రాష్ట్రాల మధ్య అంతరం
- బిల్లుల విషయంలో బీజేపీ, మోదీకి నిజాయితీ లేదు
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశాలు, చర్చలు జరపాలి
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం
- బీజేపీతో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- ఢిల్లీ మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఢిల్లీ(జనంసాక్షి): మూడొంతుల మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మార్చివేయాలని... అన్ని వర్గాల రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ భావిస్తోంది. అందుకే చార్ సౌ పార్ (400 సీట్లకు మించి) నినాదంతో 2024 ఎన్నికలకు వెళ్లారు.. ఆ ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగ మార్పుతో పాటు, రిజర్వేషన్లు తొలగించాలని బీజేపీ భావించింది. ప్రజలు జాగృతమై 240 సీట్లకే బీజేపీని పరిమితం చేశారు. రాజ్యాంగ మార్పు, రిజర్వేషన్ల ఎత్తివేయాలంటే బీజేపీకి 2/3 వంతుల మెజారిటీ కావాలి. ఇప్పుడు మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన, నియోజకవర్గాల పెంపు బిల్లుల ముసుగులో రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ మరోసారి చేసిన ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ, ఇతర విపక్షాలు కలిసి ఓడించాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బిల్లులు వీగిపోవడం కేవలం కేంద్రంలోని అధికార పార్టీ ఓటమే కాదు బీజేపి చిత్తశుద్ది కూడా అని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చిత్తశుద్ధి సరిగా లేనందునే రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిందన్నారు. పార్లమెంట్‌లో ఓడిపోయింది బీజేపీ ప్రభుత్వ దురుద్దేశమేనన్నారు. ఈ బిల్లులు వీగిపోవడానికి కారణమైన నేతలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో శనివారం మధ్యాహ్నం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం లోక్ సభలో ఉన్న 543 సీట్లలో 1/3 వంతు సీట్లు, మిగతా 2లో..

## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

- కేంద్రమంత్రి కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు

2లో..

## రేవంత్ దేశ ప్రజలను ఏకం చేశారు

- జీర్ణించుకోలేక పోతున్న హరీశ్: ఎంపీ చామల
- దేశాన్ని విభజించే కుట్రలను ఆపారు: సీఎం స్టాలిన్

2లో..

## నారీశక్తిని అడ్డుకున్నారట!

### విపక్షాలపై ప్రధాని మోదీ ఆరోపణలు

- స్వార్థ రాజకీయాల కోసం మహిళాబిల్లును అడ్డుకున్నారు
- కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ వంటి కుటుంబ పార్టీలు మహిళలను ఎదగనీయవు
- దేశ హితమే మాకు అత్యంత ముఖ్యం
- కానీ కొందరు మాత్రం దేశం కంటే రాజకీయాలకే అధిక ప్రాధాన్యమిస్తారు
- దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగం



న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి జాతినుద్దేశించి ప్రసంగించారు. భారత నారీశక్తి ఎదగకుండా అడ్డుకున్నారని ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. తాము దేశ, నారీ శక్తి హితం కోసం బిల్లు తెచ్చామన్న మోదీ, స్వార్థ రాజకీయాల కోసం విపక్షాలు నారీశక్తిని అడ్డుకున్నాయని అన్నారు.మహిళా బిల్లును కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ అడ్డుకున్నాయని, ఆ కుటుంబ పార్టీలు మహిళలను ఎదగనీయవని మోదీ ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు ఓడించింది బిల్లును కాదని మహిళా శక్తిని అని ప్రధాని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న పాపం వారిని వదిలిపెట్టదన్న మోదీ దేశ మహిళలు అన్ని విషయాలను గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. తమ హక్కుల కోసం మహిళలు 40 ఏళ్లుగా పోరాడుతున్నారని, ఈ రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటమంటే భ్రూణహత్య చేసినట్లే అని ధ్వజమెత్తారు. భారత అభివృద్ధిలో నారీశక్తి వాటా తక్కువేమీ కాదని, ఈ భ్రూణహత్యలో ప్రధాన పాపం కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ, డీఎంకే, మిగతా 2లో..

## భాజపా కుట్రలను అడ్డుకున్నాం

మహిళల రిజర్వేషన్ల వెనక నియోజకవర్గాల పునర్విభజన అంశం దాగిఉంది

- అందుకే మేం వారిని ఓడించాం: రాహుల్ గాంధీ
- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ
- ఎన్డీయేకు తొలి ఓటమి: ప్రియాంకా గాంధీ



చెన్నై(జనంసాక్షి):మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక మిగతా 2లో..

## హర్మూజ్ కథ మళ్లీ మొదటికి

తెరిచిన గంటల వ్యవధిలోనే జలసంధిని మూసేసిన ఇరాన్



- అమెరికా తమ ఓడరేవుల దిగ్బంధనాన్ని కొనసాగించడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- హర్మూజ్‌ని దాటేందుకు యత్నించిన భారతీయ నౌకలపై కాల్పులు
- ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్రం
- ఇరాన్ రాయబారికి భారత్ సమన్లు..
- హర్మూజ్‌లో ఉద్రిక్తతల వేళ.. భారత్‌కు ఇరాన్ చమురు నౌకలు

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా, ఇరాన్ మధ్య మరో దఫా దౌత్య చర్చల కోసం ప్రయత్నాలు జరుగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని ప్రకటించిన మరుసటి రోజే.. మళ్లీ దానిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఇందుకు అమెరికా ధోరణే కారణమని ఆరోపించింది. ఇరాన్ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగించడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ సంయుక్త మిలిటరీ కమాండ్ పేర్కొంది."హర్మూజ్ జలసంధిపై నియంత్రణ మునుపటి స్థితికి చేరుకుంది. ప్రస్తుతం మా సాయుధ దళాల నియంత్రణలో ఉంది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం అమల్లో ఉన్నంతకాలం.. జలసంధి మార్గంలో రాకపోకలను అడ్డుకుంటాం" అని ఇరాన్ సంయుక్త మిలిటరీ కమాండ్ హెచ్చరించింది. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునే వరకు హర్మూజ్‌లో దిగ్బంధనం కొనసాగుతుందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన వచ్చింది.

**గగనతలాన్ని పాక్షికంగా తెరుస్తున్నాం..**

మరోవైపు, దేశంలోని పలు ఎయిర్‌పోర్టులను తిరిగి తెరవడంతో పాటు తమ గగనతలాన్ని పాక్షికంగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. మిగతా 2లో..

## బ్లాక్‌మెయిలింగ్‌కు ప్రయత్నించొద్దు

### జలసంధిపై మాట మార్చడం సరికాదు

- బుధవారంలోగా ఒప్పందం కుదుర్చుకోండి
- లేదంటే మళ్లీ దాడులే.. ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక..
- ఆ దేశంతో సంప్రదింపులు కొనసాగిస్తూనే ఉన్నామన్నామని వెల్లడి



వాషింగ్టన్(జనంసాక్షి):హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. జలసంధిపై మాట మార్చడం ద్వారా తమను బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించొద్దని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగిస్తూనే ఉన్నామన్నారు. ఈ క్రమంలోనే జలసంధిని మళ్లీ మూసివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఏళ్లుగా ఇదే తంతు జరుగుతోందని.. కానీ, తమను బ్లాక్‌మెయిల్ చేయలేరని ట్రంప్ స్పష్టం చేశారు.

**ఆ ప్రతిపాదనలు పరిశీలిస్తున్నాం:ఇరాన్**

శాంతి చర్చలకు సంబంధించి అమెరికా పెట్టిన కొత్త ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ తెలిపింది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ఆ ప్రతిపాదనలను తమకు అందజేసినట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ మిగతా 2లో..

## జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర

- కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయి
- రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరుగుతుంది
- డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు: కేటీఆర్
- తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య
- అయినా పెదవి విప్పని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు: హరీశ్
- జగిత్యాలలో కేసీఆర్ ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన



జగిత్యాల(జనంసాక్షి): రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడిగడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్‌లో చిన్న అనుకున్న. కానీ రేవంత్‌ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న మిగతా 9లో..

## పులి బయటకు వస్తే దాని సంగతి చెబుతాం

- అది ఎన్ని మేకలను, ఆవులను తిన్నదో బయటపెడతాం
- జగిత్యాల సభపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యంగ్యాస్త్రాలు



హైదరాబాద్(జనంసాక్షి):పులి బయటకు వస్తే సంగతి చెబుతామని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. పులి ఎన్ని మేకలు తిన్నదో చెబుతామని.. పులి ఎన్ని ఆవులను మింగిందో చెబుతామని పేర్కొన్నారు. పులి ఆసరా తీసుకొని ఎన్ని పిల్లులు లాభపడ్డాయో బయటపెడుతామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాలలో పాల్గొననున్న మీటింగ్‌పై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పులి ఏం చేసిందో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన అన్ని విషయాలు బయటపెడతామని హెచ్చరించారు. శనివారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్రనే లేదని మహేశ్ గౌడ్ విమర్శలు చేశారు. బీజేపీ ఎంపీలు యాక్సిడెంటల్ మిగతా 9లో..

## భూముల మార్కెట్ విలువ పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు

### వరంగల్ ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన: పొంగులేటి



హైదరాబాద్(జనంసాక్షి): త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూముల ధరల పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ-భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా మిగతా 9లో..

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

2లో..

# కేసీఆర్ సభతో కాంగ్రెస్ వెన్నులో వణుకు

**బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేసీఆర్ సభతో కాంగ్రెస్ వెన్నులో వణుకు పుడుతోందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర అన్నారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపలేరని, ప్రజల్లో కేసీఆర్ గారికి పెరుగుతున్న ఆదరణను సభకు ప్రజలు రాకుండా రోడ్లు తవ్వి అంతరాయం కలిగించి బిఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను ఆపలేరని అన్నారు. ఈనెల 20వ తారీకు జగిత్యాలలో జరగబోయే బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు అన్న విషయాన్ని ముందే పసిగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సభను విజయవంతం కాకుండా కుట్రలు పన్నుతోందని ఉపేంద్ర అన్నారు దానికి నిదర్శనమే రెండేళ్లుగా లేని పనులు ఇప్పుడే స్థానిక ఎమ్మెల్యేకు గుర్తొచ్చాయా అని ప్రశ్నించారు. సభా ప్రాంగణానికి ప్రజలు రాకుండా రోడ్డును తవ్వి ప్రజలకు ఆటంకం కలిగించే విధంగా ప్రయత్నం జరుగుతున్నదని ఆయన మండిపడ్డారు. జగిత్యాల ఎమ్మెల్యే నీచ నికృష్ట చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే కాలంలో ఆయనకు తగిన గుణపాఠం తప్పదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఆల్టర్నేట్ రోడ్డు వేయకుండా రోడ్డును తవ్వి జగిత్యాల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని తెలిసినా సభకు ఇబ్బంది కలిగించాలని కుటిల రాజకీయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు 420 హామీలు ఆరు గ్యారెంటీలు అమలు చేయని ప్రభుత్వం కొనసాగటానికి వీల్లేదని రైతులను ప్రజలను నిరుద్యోగులను మహిళలను వృద్ధులను వికలాంగులను మోసం చేసిన ఈ ప్రభుత్వా విధానాలను కెసిఆర్ గారు బెబ్బులిపులిలా ఈ సభలో గర్జించి ఈ ప్రభుత్వం యొక్క చేతకానితనాన్ని మోసపు విధానాలను ప్రజలకు తెలియజేస్తారని ఆయన అన్నారు రాబోయే కాలంలో తెలంగాణ ప్రజలందరూ కూడా ఉద్యమాన్ని ఏరకంగా నడిపారో ఈ ప్రభుత్వము చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేసి రాబోయే కాలంలో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు అందరూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# అర్హులైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్లు

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్18 (జనంసాక్షి) :** జిల్లాలో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ), కమిటీ సభ్యులపై ఉందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కార్డులు జారీ చేయకూడదని ఆమె ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తిస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు అల్వాల హనుమంతు, కొండూరి రవీందర్, అల్లం అశోక్, ఆర్. మహేందర్, ఎం.ఏ. వసీం, రామెళ్ళ రాజేశ్వర్, సిరిపురం నాగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- చట్టం అమల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేసిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, వీ.బీ. జీరాంజీ చట్టం అంశాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రాల మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, డైరెక్టర్ దివ్యా దేవరాజన్ తదితరులు హాజరయ్యారు. ములుగు జిల్లా రాయిని గూడెం గ్రామ పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క అక్కడ నుంచే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని కీలక అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అమలవుతున్న ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆమె స్పష్టం చేశారు. వీ.బీ. జీరాంజీ చట్టంపై మరింత విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని, రాష్ట్రాల అభిప్రాయాలను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకోవాలని, అప్పటి వరకు ఆ ప్రక్రియను వాయిదా వేయాలని సూచించారు. గత రెండు నెలలుగా కేంద్రం నుండి ఉపాధీ హామీ నిధులు విడుదల కాకపోవడంతో కార్మికులకు వేతనాలు అందకపోవడం ఆందోళనకరమని మంత్రి పేర్కొన్నారు. వేసవి కాలంలో పనుల సీజన్ పీక్ స్టేజీలో ఉంటుందని..వేతనాల చెల్లింపు ఆలస్యం జరిగితే కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధీ హామీ చట్టానికి సంబంధించి రాష్ట్రానికి కేంద్రం నుండి రూ. 1110 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇటీవల తరచూ కొత్త సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను ప్రవేశపెడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఒక వ్యవస్థను పూర్తిగా అర్థం చేసుకొని అమలు చేయకముందే మరో వ్యవస్థను ప్రవేశపెట్టడం క్షేత్రస్థాయిలో సమస్యలను కలిగిస్తోందని తెలిపారు. తక్కువ సమయంలోనే వీ.బీ. జీరాంజీ చట్టం ద్వారా ఉపాధీ పనుల్లో 40 శాతం నిధులను రాష్ట్రాలు భరించాలనే నిబంధన రాష్ట్రాలకు భారంగా మారుతుందన్నారు. మంత్రి సీతక్క ప్రస్తావించిన అంశాల పట్ల కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు . తెలంగాణ కు రావాల్సిన పెండింగ్ నిధులను ఒకటి రెండు రోజుల్లో విడుదల చేస్తామన్నారు. వీ.బీ. జీరాంజీ చట్టం పట్ల రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని..విస్తృత చర్చల అనంతరమే చట్టాన్ని అమలు చేస్తామన్నారు.

# బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు తాళ్ల అజయ్ ఎంపిక



**చెన్నారావుపేట, ఏప్రిల్ 18(జనంసాక్షి) :** బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2026వ సంవత్సరానికి సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫౌండర్, స్టేట్ ప్రెసిడెంట్ చెన్నారావుపేట నంబర్ వన్ కాలనీకి చెందిన డాక్టర్ తాళ్ల అజయ్ ఎంపికయ్యారు. ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యులు ఆరెసాగు ప్రమోద్ మహరాజ్, టేరి రాజశేఖర్ లు అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్ లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందించారు. ఆదివారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

# ప్రమాద రహిత రాష్ట్రంగా మార్చుతాం

- అరైవ్ అలైవ్ ద్వారా అవగాహన కార్యక్రమాలు
- రాష్ట్ర రవాణా, బి.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**రంగారెడ్డి ప్రతినిధి (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రాన్ని రోడ్డు ప్రమాద రహిత రాష్ట్రంగా మార్చేందుకు పెద్ద ఎత్తున అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శనివారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ నందు నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో రోడ్డు రవాణా బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని రోడ్డు ప్రమాద రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున "అరైవ అలైవ్" అనే నినాదంతో రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధనల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు రహదారులపై ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని వేలాది మంది వారి విలువైన ప్రాణాలను కోల్పోతున్న విషయాన్ని మనం ప్రతిరోజు పత్రికల్లో చూస్తున్నామని అన్నారు. అందుకే ఈ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'అరైవ్ అలైవ్' అనే నినాదంతో, రోడ్డు రవాణా శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు పెద్ద ఎత్తున రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిందని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని, వారి జీవితాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రజా ప్రభుత్వం అన్ని విధాల సామ దాన ,భేద, దండ రూపాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి నడుం కట్టిందని తెలిపారు. దీనికి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు పోలీస్, రవాణా శాఖ ద్వారా పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ కార్యక్రమం విజయవంతం కాదు అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి ప్రజలలో రోడ్డు భద్రత పై విస్తృత ప్రచారం చేస్తుందని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని మొదటి 'గోల్డెన్ అవర్లో' హాస్పిటల్కు చేర్చి వారి ప్రాణాలను కాపాడాలనీ, గతంలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే కేసుల భయంతో ఎవరు పట్టించుకోకపోయేది. ఇప్పుడు ప్రమాదం జరిగిన మొదటి గంటలో హాస్పిటల్ కి చేర్పిస్తే 25 వేల పారితోషికం తో రహవీర్ అవార్డు అందిస్తుంది అని అన్నారు. ప్రమాదాలను నివారించడానికి అధికారులు యువతకు, విద్యార్థులకు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై రోడ్డు భద్రత నియమాలపై తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శాసన సభ్యులు అరికే పూడి గాంధీ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఎంతో గొప్ప కార్యక్రమం అని, దీన్ని ప్రజల సహకారంతో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. రహదారి ప్రమాదాలు ముఖ్యంగా అతివేగం,హెల్మెట్ లేమి, సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ సంభవిస్తున్నాయని అన్నారు. ట్రాఫిక్ పోలీస్ రవాణా శాఖ తరచూ వాహనాల తనిఖీలను నిర్వహించి రోడ్డు భద్రత నియమాలపై ఆవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని అన్నారు. రోడ్ ప్రమాదాలను నివారించడానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ పెద్ద ఎత్తున అరైవ్ అలైవ్ అనే నినాదంతో అవగాహన కల్పించడం, రోడ్డు నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను రోడ్డు భద్రత నిబంధనలను పాటించి వారి ప్రాణాలు కాపాడుకొని బాధ్యతగా మెలగాలని అన్నారు. అనంతరం రోడ్డు నిబంధనలు పాటిస్తామని రోడ్డు ప్రమాదాలు జరగకుండా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తామని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఉత్తమ డ్రైవర్లుగా దేశ్య, రమేష్ కేబి సింగర్ లను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, రవాణా శాఖ అధికారులు, డ్రైవర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎంజేపీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు 20 నుంచి దరఖాస్తు

**9260 సీట్లు, కోర్సు పూర్తి అయ్యాక ప్లేస్ మెంట్లు**

- ఉచిత వసతి, భోజనంతో పాటు నాణ్యమైన విద్య
- మొదటి ఏడాది నుంచే పోటీ పరీక్షలకు శిక్షణ
- ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంటర్ పాసైన విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరానికి ఎంజేపీటీ బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు సూచించారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఎంజెపి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని ఆయన అభినందించారు. ఎంజేపీ లో ఇంటర్ చదివిన విద్యార్థులు తమ సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎం జె పిలో కాకుండా ఇతర విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎంజేపీటీ బీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలలో (ఇంగ్లీష్ మీడియం) మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులో ప్రవేశం కోసం ఆన్లైన్ ద్వారా mjptbcwreis.telangana.gov.in లేదా https://mjptbcadmissions.org/MJP-Degree/ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ మార్కులను పరిగణలోకి తీసుకుని వారు కోరుకున్న కోర్సులో సీటు కేటాయించడం జరుగుతుందని ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంజేపీలో 30 డిగ్రీ కాలేజీలు అందుబాటులో ఉన్నాయని, రెగ్యులర్ కోర్సులు బీఎస్సీ, బీకాం, బీఏ, బీబీఏ, బీఎఫ్‌టీ, యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్ మొదలైనవి ఆధునిక కోర్సులు అందిస్తున్నామని సైదులు తెలిపారు. గతంలో డిగ్రీ పూర్తి చేసిన ఎందరో విద్యార్థులకు ప్లేస్ మెంట్ లు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. ఎం జె పి విద్యాసంస్థల్లో చేరిన ప్రతి విద్యార్థి తనకు ఆసక్తి ఉన్న ఏ రంగంలోనైనా రాణించేలా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు అత్యున్నత విద్య అభ్యసించేలా శిక్షణ ఇస్తున్నామని ఆయన వివరించారు. క్రీడల్లోనూ ఎం జె పి విద్యార్థులు జిల్లా , రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలు కాలేజీ లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలనుకుంటే గురుకుల విద్యాసంస్థల్లో చేర్చాలని, చదువుతో పాటు క్రమశిక్షణ నేర్చుకుంటారని ఆయన అన్నారు. ఈ ఏడాది ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 20వ తేదీ నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 040-23328266 లో సంప్రదించాలని కార్యదర్శి సూచించారు.


# ప్రపంచానికి స్ఫూర్తి భూదానోద్యమం

- రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- భూదాన్ పోచంపల్లిలో వేదిరే రామచంద్రారెడ్డి విగ్రహావిష్కరణ
- పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** భూదానోద్యమం ప్రపంచానికే స్ఫూర్తి అని, ఎంతోమంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని చౌటుప్పల్ చౌరస్తాలో వెదిరే రామచంద్రారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రథమ భూదాత వెదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాన్ని, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. స్థానిక టూరిజం పార్క్ లో ఆచార్య వినోబా భావె, వెదిరే రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. 75వ వజ్రోత్సవాల సందర్భంగా వినోబా మందిరాన్ని సందర్శించి పాదయాత్ర బృందానికి, భూదాన్ భూమి గ్రహీతలకు, నాయకులకు శాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. భూదాన దాతృత్వం దేశానికి మార్గ దర్శకంగా నిలచిం దన్నారు. భూదా నోద్యమం భూసంస్కరణలకు దేశంలో ఆర్థిక అసమానతలు తొలగడానికి దోహదపడిందన్నారు. 100 ఎకరాల భూదానంతో మొదలైన ఉద్యమం 44 లక్షల ఎకరాల భూమిని దానంగా సేకరించి, 40 లక్షల మంది పేదలకు భూమిని పంచి పెట్టారన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. వేదిరే రామచంద్రారెడ్డి 1000 ఎకరాల భూమిని పేదలకు దానం చేసిన కారణ జన్ముడన్నారు. భూమిని దానం చేయకుంటే భూదానోద్యమం ఆలోచన వచ్చేది కాదని అన్నారు. రామచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమని, భూదానోద్యమ స్ఫూర్తితో యువత సామాజిక స్పృహ పెంపొందించాలన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భూదానోద్యంతో పోచంపల్లి గ్రామం దశదిశ మార్చిందని అన్నారు. సమాజంలో సమానత్వం సేవా భావం పెంపొందించడంలో భూదానోద్యమం కీలక పాత్ర పోషించిందన్నారు. వేదిరే రామచంద్రారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. శివరాంపల్లి నుండి పోచంపల్లికి చేపట్టిన పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికి పాదయాత్ర బృందంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అఖిల భారత సర్వోదయ మండలి అధ్యక్షుడు వేదిరే రామచంద్రారెడ్డి, అఖిల భారత సేవా సంఘ ట్రస్ట్ మహాదేవ్ విద్రోహి, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు తలుపునూరి కృష్ణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజని శ్రీనివాస్ గౌడ్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, నాయకులు పాక మల్లేష్ యాదవ్, కొట్టం కరుణాకర్ రెడ్డి, తడక రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, భూదాన్ రామచంద్రారెడ్డి సేవా సమితి అధ్యక్షుడు పోతగల దానయ్య, ఉపాధ్యక్షుడు కొమ్ము లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కరగల కుమార్ పాల్గొన్నారు.

# ఫ్యాన్ల తయారీ పరిశ్రమలో అగ్నిప్రమాదం



**అమీన్‌పూర్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** ఫ్యాన్లు తయారు చేసే పరిశ్రమలు అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన శనివారం సాయంత్రం సుల్తాన్పూర్ మెడికల్ డివైస్ పార్కులో చోటుచేసుకుంది. పోలీసులు, పరిశ్రమ ప్రతినిధులు ప్రకారం మెడికల్ డివైస్ పార్క్ లో ఉన్న యాష్ ఎలక్ట్రో అప్లియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఫ్యాన్లు తయారు చేస్తారు. శనివారం సాయంత్రం ఈ పరిశ్రమలోలో హీటింగ్ మిషన్ ఫ్యాన్ లో ఉండే కాయల్ని వేడి చేసే ఒక మిషన్ ఓవెన్ లాంటిది దాంట్లో వేడి ఎక్కువ కావడం వల్ల దట్టమైన మంట, పొగలు వ్యాపించాయి. వెంటనే తేరుకున్న సిబ్బంది పొగలను అదుపులోకి తెచ్చారు. పరిశ్రమలో సుమారు 2000 మంది కార్మికులు పనిచేస్తారు. పరిశ్రమలో మంటలు చెలరేగడంతో కార్మికులంతా బయటకు పరుగులు తీశారు. పరిశ్రమలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. ఈ మేరకు అగ్నిమాపక శాఖ పోలీసు శాఖ వివరాలను సేకరిస్తున్నారు.

## పూజ చేస్తుండగా
# చీరకు నిప్పు

- రిటైర్డ్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి మృతి

**హైదరాబాద్, ఏప్రిల్18 (జనంసాక్షి) :** హైదరాబాద్ బేగంపేటలో విషాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున పూజ చేస్తూ దీపం వెలిగిస్తుండగా చీరకు నిప్పంటుకుని రిటైర్డ్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి (62) మరణించారు. వివరాల్లోకి వెళ్లే.. బేగంపేటలోని శ్యామ్‌లాల్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. ప్రస్తుతం ఇంట్లో ఒంటరిగానే ఉంటుంది. రోజువారీ పూజల్లో భాగంగా తెల్లవారుజామున దీపం వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుంది. దీంతో ఆమె భయంతో ఇంట్లో అటు ఇటు పరిగెత్తగా మంటలు మరింత వ్యాపించాయి. సోఫా, కర్టెన్లు, ఇతర ఫర్నీచర్‌కు సైతం మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. అలాగే ఇంట్లో పొగ నిండిపోవడంతో ఊపిరాడక కుప్పకూలింది. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించి స్థానికులు వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కాగా, వారు వచ్చేప్పటికే విజయలక్ష్మి మృతిచెందినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# లండన్‌లో 'జగిత్యాల కేసీఆర్ సభ' పోస్టర్‌ను ఆవిష్కరణ

**మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్ కుమార్**

**లండన్ (జనంసాక్షి) :** ఈ నెల 20న జగిత్యాలలో కేసీఆర్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంగా ప్రజలంతా భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో లండన్ పర్యటనలో ఉన్న మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్ కుమార్ 'జగిత్యాల కేసీఆర్ సభ'పోస్టర్ ని ఆవిష్కరించారు. ప్రజలంతా కేసీఆర్ సందేశం కోసం ఎదురుచూస్తున్నారని, అలాగే ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి.. బీఆర్ఎస్‌లో చేరుతున్న జీవన్ రెడ్డికి ఎన్నారైల పక్షాన ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్ కుమార్, ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాఘవ, ఉపాధ్యక్షుడు రవి రేతినేని, సత్యమూర్తి చిలుముల, ఎన్నారై బీఆర్ఎస్ యూకే సీనియర్ నాయకులు రమేష్ ఎసెంపెల్లి , గణేష్ కుప్పాల తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# ఓడినది మహిళల రిజర్వేషన్ కాదు, బిజెపి కుట్ర!



తాటిచెట్టు ఎందుకు ఎక్కావు అంటే దూడగడ్డి కోసం అని తప్పుడు సమాధానాలు చెప్పే తాగుబోతులుంటారని పెద్దలు ఎప్పుడో చెప్పారు. అటువంటి తప్పుడు సాకులు, కారణాలు, సమాధానాలు చెప్పేవారు ఇప్పుడు ఇంకా తెలివిమీరి పోయారు. తాటిచెట్టు ఎక్కకుండా నిరోధించాలని ఎవరైనా చూస్తే, తాగుబోతులే ఎదురుతిరిగి, "ఇదిగో వీళ్లు దూడకు గడ్డి లేకుండా చేస్తున్నారు. పాపం, అమాయకమైన నోరులేని ప్రాణికి గడ్డి తేవడానికి నేను చాలా సదుద్దేశంతో తాటిచెట్టు ఎక్కే కష్టం పడుతుంటే వీళ్లు అడ్డుకుంటున్నారు" అని యాగీ చేసి, వ్యతిరేకుల మీద దుమ్ము చల్లుతున్నారు. అమాయకుల కళ్లలో దుమ్ము కొడుతున్నారు. దున్నపోతు ఈనిందంటే దూడను కట్టెయ్యమని అనగలిగిన తెలివైన చాలా మంది, తాగుబోతుల మాటలకు వంత పాడుతున్నారు. "పాపం, ఎంత పుణ్యాత్ములు, దూడకు గడ్డి సంపాదించాలని ఎంతెంత కష్టపడుతున్నారు. తాటిచెట్టు ఎక్కడానికి కూడా సిద్ధపడ్డారు. వాళ్లను అడ్డుకుంటారా, ఎంత తప్పు" అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కథలో తాగుబోతులకు సంఘ్ పరివార్ పాలకులు, సమర్థించే అతి తెలివి బృందానికి గోదీ మీడియా సరిగ్గా సరిపోతారు.

తాము మహిళా వందనం చేయాలని మహిళల రిజర్వేషన్ బిల్లు పెడితే, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని భగ్నం చేయడానికి తమకు అడ్డు పడ్డారని, లోకసభలో బిల్లు ఓడించారని భారతీయ జనతా పార్టీ దొంగ ఏడ్పులు ఏడుస్తున్నది. గోదీ మీడియా, మోడియా ఆ శోకాలను అనేకరెట్లు హెచ్చవేసి ప్రకటిస్తున్నది, ప్రసారం చేస్తున్నది, ప్రచారం చేస్తున్నది. సంఘ్ పరివార్ ఐటీ సెల్స్ కిరాయి దండు తామొక్కరే మహిళల ఉద్ధారకులైనట్టు, ప్రతిపక్షాలన్నీ మహిళలను వెనక్కి నెడుతున్నట్టు, నిరాశ పరుస్తున్నట్టు పురాణాలు మొదలుపెట్టింది. రెండు మూడు రోజులుగా సాగుతున్న ఈ ప్రహసనం గుట్టు విప్పాలి. వాస్తవాలేమిటో మరిచిపోయిన, మరిచిపోయినట్టు నటిస్తున్న, మరిచిపోదలచుకున్న ప్రజలకు తెలియజెప్పాలి. శుక్రవారం నాడు లోకసభలో మూడింట రెండు వంతుల వోట్లు పడకపోవడం వల్ల వీగిపోయిన బిల్లు సంఘ్ పరివార్, గోదీ మీడియా ప్రచారం చేస్తున్నట్టుగా మహిళా రిజర్వేషన్ కు సంబంధించినది కాదు. ఓడిపోయిన బిల్లు పేరు రాజ్యాంగ (131వ) సవరణ బిల్లు. అది 2011 జనగణన ప్రకారం లోక సభ స్థానాలను పెంచడానికి ఉద్దేశించిన బిల్లు. ఆ బిల్లు ప్రవేశపెట్టడానికి ఒక కారణంగా "మహిళా రిజర్వేషన్ల అమలును త్వరితం చేసేందుకే" అని బిజెపి ప్రభుత్వం ప్రకటించిన బుకాయింపును అందరూ అమాయకంగా నమ్ముతున్నారు. అసలు ఈ రెండూ వేరు వేరు అంశాలు. వీటిని కలపడంలోనే సంఘ్ పరివార్ కుట్ర ఉంది. లోక సభ స్థానాలను 50 శాతం పెంచుతామని, ప్రతి రాష్ట్రానికీ ప్రస్తుతం ఉన్న నిష్పత్తి అలాగే ఉంచుతామని భారతీయ జనతా పార్టీ నాయకులు ఎన్నో మాటలు చెప్పారు గాని, వాస్తవంగా బిల్లులో 50 శాతం గాని, నిష్పత్తిని యథాతథంగా ఉంచడం గాని, కాకుండా 2011 జనగణన ఆధారంగా పెంచుతామన్నారు. అంతకన్న ముఖ్యంగా డీలిమిటేషన్ కమిషన్ (నియోజకవర్గాల పునర్విభజన కమిషన్) కు సకలాధికారాలు కట్టబెడుతున్నారు.

జనాభా పెరుగుదలను బట్టి మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా నియంత్రణ పథకాలు అమలు చేసిన రాష్ట్రాలు నష్టపోవడం, జనాభా నియంత్రణ జరపని రాష్ట్రాలకు ఎక్కువ స్థానాలు దక్కడం జరుగుతుంది. సాధారణంగా దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు, ఉత్తరాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు కన్నా తక్కువ. అందువల్ల మొత్తం దక్షిణాది రాష్ట్రాలకు పెరిగే లోక సభ నియోజకవర్గాల సంఖ్య దాదాపు 60 ఉండగా, ఒక్క ఉత్తరప్రదేశ్ లో పెరిగే నియోజకవర్గాల సంఖ్య 50 దాకా ఉండబోతుంది. అంటే ఇకముందు లోకసభలో దక్షిణాది రాష్ట్రాల సభ్యులందరూ పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉన్నప్పటికీ వారి మాట చెల్లని స్థితి వస్తుంది.

అలాగే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ కు ఇవ్వజూపుతున్న అధికారాలతో దేశలో ఎన్నికల ప్రక్రియే అపహాస్యమవుతుంది. ఒకవైపు ఎన్నికల కమిషన్ ను తమ జేబులో పెట్టుకుని, మరొకవైపు డీలిమిటేషన్ కమిషన్ ను ఏర్పాటు చేసి, దాన్ని మరొక జేబులో పెట్టుకుని శాశ్వత అధికారాన్ని సాధించి, తమ కల అయిన 'హిందూ రాష్ట్ర' స్థాపించడమే, రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతి ఆధారంగా పాలన నడపడమే సంఘ్ పరివార్ ఉద్దేశం. అందువల్లనే మహిళా రిజర్వేషన్లను, డీలిమిటేషన్ ను కలిపి కొత్త బిల్లు తయారుచేశారు. డీలిమిటేషన్ దుష్పరిణామాలను అడ్డుకోదలచిన వారిని మహిళా రిజర్వేషన్ వ్యతిరేకులుగా ముద్ర కొట్టి అవమానించవచ్చునని పథకం రచించారు. నిజానికి మహిళా రిజర్వేషన్ కు కొత్త బిల్లు, కొత్త చట్టం అవసరమే లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లు మూడు సంవత్సరాల కిందనే లోకసభ, రాజ్యసభల ఆమోదం పొంది చట్టంగా మారింది. దాని అమలు మాత్రమే మిగిలి ఉంది. అమలు చేయవలసిన బిజెపి ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది.

రాజ్యాంగ (106వ) సవరణ బిల్లు అనేది వాస్తవంగా మహిళా రిజర్వేషన్లకు ఉద్దేశించినది. ఆ బిల్లు 2023 సెప్టెంబర్ 19న పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రవేశపెట్టారు. ఆ బిల్లు మర్నాడు లోకసభ ఆమోదం పొందింది. అలాగే సెప్టెంబర్ 21న రాజ్యసభ ఆమోదం పొందింది. లోకసభలో ఆ రోజు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కలిసి 454 మంది అనుకూలంగా వోటు వేయగా, కేవలం ఇద్దరంటే ఇద్దరు మాత్రమే వ్యతిరేకంగా వోటు వేశారు. అంటే ఇప్పుడు "మహిళా రిజర్వేషన్ వ్యతిరేకులు" అని బిజెపి నాయకులు బట్టకాల్చి మీద వేస్తున్న ప్రతిపక్షాలన్నీ కూడా మూడు సంవత్సరాల కిందనే ఏకగ్రీవంగా ఆ బిల్లుకు అనుకూలంగా వోటు వేశాయి. రాజ్యసభలో ఉండిన 214 మంది అందరికందరూ అనుకూలంగా వోటు వేశారు. ఇంత బ్రహ్మాండమైన మద్దతుతో ఒకసారి ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు రెండోసారి ప్రవేశపెట్టడం, చర్చ, ఆమోదమూ అవసరం ఏముంది?


ఇక్కడే "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని చెప్పిన మనుస్మృతిని అక్షరాలా నమ్మే, పచ్చి భూస్వామ్య పితృస్వామ్య సంఘ్ పరివార్ అసలు రంగు బైటపడుతుంది. అప్పుడు బిజెపి ఆ బిల్లు ప్రవేశపెట్టడానికి రాజకీయ కారణాలున్నాయి. అది మూడు దశాబ్దాలుగా ఆమోదం పొందకుండా ఆగిపోయి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును తమ పాలనలోనే ఆమోదింపజేశామని బూటకపు ప్రచారంతో 2023 చివరలో జరగనున్న ఎన్నికలలో స్త్రీల వోట్లను ఆకర్షించడానికి వేసిన కుటిల ఎత్తుగడ మాత్రమే. అలా పార్లమెంటు ఉభయ సభలూ ఆమోదించి, రాష్ట్రపతి సంతకం కూడా అయిపోయి, చట్టంగా మారిన ఆ మహిళా రిజర్వేషన్ ను నిజంగా అమలు చేసే ఉద్దేశం సంఘ్ పరివార్ కు లేదు. బిల్లు మీద చర్చ సందర్భంగానే హోమ్ మంత్రి అమిత్ షా, ఎన్నికలు అయిపోగానే జనగణన నిర్వహిస్తామని, ఆ జనగణన గణాంకాలను బట్టి నియోజకవర్గాల పునర్విభజన జరిపి, మహిళా రిజర్వేషన్లను అమలు జరుపుతామని అన్నాడు. అంటే 2023లో హడావిడిగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, బిల్లు ఆమోదింపజేసుకున్నప్పటికీ, 2029 ఎన్నికల దాకా మహిళా రిజర్వేషన్ అమలును వాయిదా వేయాలని బిజెపి పథకం వేసింది. అందుకే బిల్లులోనే, తర్వాత అది చట్టంగా మారి, 2023 సెప్టెంబర్ 28న వెలువడిన భారత ప్రభుత్వ గెజెట్ లోనే, "కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి, గెజెట్ లో ప్రకటించిన తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వస్తుంది" అని రాశారు. 2023 నవంబర్ ఎన్నికలు అయిపోయాయి. జనగణన ప్రయత్నాలు ఏమీ జరగలేదు. 2024 ఎన్నికలు కూడా అయ్యాయి నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభమే కాలేదు. ఇప్పుడు తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల సందర్భంలో హఠాత్తుగా 2023 మహిళా రిజర్వేషన్ చట్టం అమలు, డీలిమిటేషన్ ప్రయత్నాలు ప్రారంభించారు. డీలిమిటేషన్ కన్నా ముందు జరగవలసిన జనగణన ఇంకొక మూడు నాలుగు నెలల్లో జరుగుతుండగానే, అటుది ఇటు, ఇటుది అటు చేశారు.

ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం వీగిపోయిన బిల్లు కడుపు నిండా విషం పెట్టుకుని తయారయినది. కడుపులో కత్తులు పెట్టుకుని మహిళలను రిజర్వేషన్ పేరుతో కావలించుకోబోయినది. అయితే మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ ను ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా హృదయపూర్వకంగా ఏమీ ఆమోదించడం లేదు. తరతమ భేదాలే తప్ప, ప్రతి పార్టీ కూడా పితృస్వామ్యంలో, పురుషాధిపత్యంలో మునిగి తేలుతున్నవే. మహిళలకు రాజకీయ ప్రాధాన్యం పెరగగూడదని ఆలోచిస్తున్నవే. ఆ పార్టీలకు చిత్తశుద్ధి లేనందువల్లనే, మహిళలకు రిజర్వేషన్ కల్పించాలనే ప్రయత్నం మూడు దశాబ్దాలకు పైగా ఎడతెగకుండా సాగుతున్నది. అందుకు సంబంధించిన బిల్లు తయారు చేసి ప్రవేశపెట్టడం కూడా ఇప్పటికీ ఐదారు సార్లు జరిగింది. మొదట 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ కాలంలో, తర్వాత 1998లో, 1999లో బిజెపి కాలంలో ప్రవేశపెట్టిన బిల్లులు లోకసభ రద్దు కావడంతో ముగిసిపోయాయి. తర్వాత 2008లో యూపీఏ కాలంలో ప్రవేశపెట్టిన బిల్లు రాజ్యసభలో ఆమోదం పొంది, లోకసభలో చర్చకు ముందే, లోకసభ రద్దయిపోవడంతో ముగిసిపోయింది. ఈ బిల్లుల్లో 1996 బిల్లును పార్లమెంటు జాయింట్ కమిటీ, 2008 బిల్లును పార్లమెంటు స్టాండింగ్ కమిటీ కూడా పరిశీలించి, సవరణలు సూచించాయి.

ఆ తర్వాత నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం 2023 ఎన్నికల సందర్భంగా ప్రవేశపెట్టిన బిల్లు సంగతి పైన చూశాం. ఆ బిల్లు చట్టంగా మారాక, జరిగే మొదటి జనగణన గణాంకాల మీద ఆధారపడి స్త్రీల స్థానాలు రిజర్వ్ చేయడం జరుగుతుందని, ఆ రిజర్వేషన్ 15 సంవత్సరాల వరకు ఉంటుందని, ఆ తర్వాత పార్లమెంట్ ఆమోదిస్తే దాన్ని పొడిగించవచ్చునని కూడా అప్పుడు అన్నారు. జనగణన లేదు, రిజర్వేషన్ లేదు,

నిజానికి ఇప్పుడున్న స్థితిలోనే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం, కనీసం తమ అభ్యర్థులలో 33 శాతం మహిళలు ఉండేట్టుగా చూసుకోవడం, అధికార పక్షమైనా, ప్రతిపక్షాలైనా చేయగల పనులే. కాని ఏడు దశాబ్దాల పార్లమెంటరీ రాజకీయ చరిత్ర తర్వాత మహిళల ప్రాతినిధ్యం అతి తక్కువగా 15 శాతంగా ఉన్న దేశం మనది. జనాభాలో సగంగా ఉన్న మహిళలకు రాజకీయ నిర్ణయాధికారంలో మనం ఇస్తున్న భాగస్వామ్యం సగం కాదు గదా, మూడో వంతు కాదు గదా, ఆరో వంతు కన్నా తక్కువగా ఉంది. అందుకు సిగ్గుపడవలసిన రాజకీయ పక్షాలన్నీ ఏ సాకులు వెతుకుదామా, ఏ స్వప్రయోజనాల, స్వార్థ ప్రయోజనాల కింద ఈ మహిళా భాగస్వామ్య అవసరాన్ని తొక్కి వేద్దామా అని చూస్తున్నాయి.

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ ఇచ్చినంత మాత్రాన, సమాజంలో స్త్రీ సమానత్వానికి మార్గం ఏర్పడుతుందా? ఇటువంటి రిజర్వేషన్లను రాజకీయ రంగంలో ఉన్న పురుషులే తమ భార్యలను, కుటుంబ సభ్యులను నింపి దుర్వినియోగం చేయరా? ఎన్నికలు విపరీతమైన డబ్బుతో జరుగుతున్నప్పుడు, ఉన్నత వర్గాల వారికి మాత్రమే అందుబాటులో ఉన్నప్పుడు, ఈ రిజర్వేషన్లలో పట్టణ, ఆధిపత్య కుల, ఆధిపత్య మత, సంపన్న వర్గాల స్త్రీలే వాటిని ఆక్రమిస్తారు గాని, ఇప్పటివరకూ అణగారిన వర్గాల స్త్రీలకు అవకాశం వస్తుందా? వంటి అనేక ప్రశ్నలు కూడా ప్రస్తుత చర్చలో తలెత్తుతున్నాయి. నిజమైనదో, ఊహాజనితమైనదో కారణం చూపి రిజర్వేషన్లను, సామాజిక న్యాయ భావనను వ్యతిరేకించడం పితృస్వామిక భావాల ఫలితమా? స్త్రీలు చట్టసభల్లో ప్రవేశిస్తే పురుషాధిపత్యానికి భంగం వాటిల్లుతుందని అనుకుంటున్నారా? వంటి ప్రశ్నలూ ఉన్నాయి. మొత్తంగా సమాజంలో పితృస్వామిక, పురుషాధిపత్య భావాల మీద జరిపే సుదీర్ఘ, సువిశాల పోరాటంలో చట్టసభల్లో సముచిత భాగస్వామ్యం కోరడం కూడా ఒక భాగమే అనే అవగాహనతో ఈ మొత్తం చర్చను చూడవలసి ఉంది.



ఎన్ వేణుగోపాల్
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలు, కూల్చివేతల

## పాలన మధ్య ఆందోళనలో ప్రజలు



తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అధికార మార్పు జరిగే ప్రతిసారి "కొత్త ప్రభుత్వం వచ్చింది, కొత్త దిశ మొదలైంది" అనే ఆశ కలుగుతుంది. కానీ కొద్ది కాలానికే ప్రజలలో మరో ప్రశ్న మొదలవుతుంది---పాలన మారిందా, లేక కేవలం పాలకులే మారారా? ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తుల వినియోగం, ప్రైవేట్ భాగస్వామ్యాలు, సంక్షేమ ప్రాధాన్యతలపై చర్చ నడుస్తుంటే, తెలంగాణలో భూసంరక్షణ, అక్రమ నిర్మాణాల తొలగింపు, కూల్చివేతల విధానంపై తీవ్ర వాదోపవాదాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు రాష్ట్రాల పరిస్థితులు వేర్వేరు అయినా, కేంద్ర ప్రశ్న మాత్రం ఒక్కటే: ప్రభుత్వ నిర్ణయాల మధ్య ప్రజల ప్రయోజనం నిజంగా కేంద్రబిందువా?

ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, ఫిషింగ్ హార్బర్లు, పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు, భూముల వినియోగం వంటి అంశాలు రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. గత ప్రభుత్వ కాలంలో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల విస్తరణకు పెద్ద ఎత్తున ప్రణాళికలు రూపొందించబడ్డాయి. రాష్ట్రంలో వైద్య విద్యా అవకాశాలు పెంచడం, జిల్లా స్థాయిలో ఆరోగ్య సేవలు విస్తరించడం అనే ఉద్దేశం స్పష్టంగా కనిపించింది. ఇటీవల పిడుగురాళ్ల మెడికల్ కళాశాలకు 520 పోస్టుల మంజూరు వంటి చర్యలు ఆ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని సూచిస్తున్నాయి.

అయితే మరోవైపు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో ప్రభుత్వం మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో ప్రైవేట్ భాగస్వామ్యానికి మొగ్గుచూపుతోంది. ఇది తప్పనిసరి ఆర్థిక వ్యూహమా, లేక ప్రజా ఆస్తులపై వెనుకడుగా అన్న ప్రశ్న సహజం. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, టూరిజం ఆస్తులు ప్రైవేట్ రంగానికి ఇవ్వడం ద్వారా వేగవంతమైన పెట్టుబడులు రావచ్చు, ఉపాధి అవకాశాలు పెరగవచ్చు. కానీ సరైన నియంత్రణ లేకపోతే ప్రజల కోసం నిర్మించిన మౌలిక వసతులు కొద్దిమందికే లాభదాయకమయ్యే ప్రమాదం ఉంది. జువ్వలదిన్నె హార్బర్ వంటి అంశాలపై వచ్చిన రాజకీయ విమర్శలు ఇదే సందేహాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

ఇక్కడ అసలు సమస్య "ప్రైవేటీకరణ" కాదు; "ప్రజా ప్రయోజన భద్రత" లేకపోవడమే. ఒక ప్రభుత్వ ఆసుపత్రి లేదా కళాశాలపై ప్రైవేట్ నిర్వహణ వస్తే ఫీజులు పెరుగుతాయా? స్థానికులకు సేవలు తగ్గుతాయా? మత్స్యకార హార్బర్‌ను వ్యాపార కేంద్రంగా మార్చితే సంప్రదాయ వృత్తులపై ప్రభావమేమిటి? ఈ ప్రశ్నలకు పారదర్శక సమాధానాలు లేకపోతే ప్రజలు అమ్మకాల ప్రభుత్వమనే భావనకు రావడం సహజం. తెలంగాణలో దృశ్యం వేరుగా ఉంది. ఇక్కడ ప్రభుత్వం నగరాభివృద్ధి, ప్రభుత్వ భూముల సంరక్షణ, చెరువులు-నాలాల పరిరక్షణ పేరిట "హైడ్రా" వంటి టి సంస్థల ద్వారా భారీ స్థాయిలో కూల్చివేతలు చేపడుతోంది. హైదరాబాద్‌లో వందల సంఖ్యలో ఆక్రమణల తొలగింపు చర్యలు జరిగాయని నివేదికలు చెబుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రహదారులు, పార్కులు, నీటి మార్గాలు తిరిగి ప్రజలకు అందుబాటులోకి రావడం సానుకూల అంశమే.

కానీ చట్టబద్ధ ప్రక్రియ, ముందస్తు నోటీసు, పునరావాసం, బాధితుల హక్కులు వంటి అంశాల్లో తీవ్ర ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. తెలంగాణ హైకోర్టు ఇటీవల "హైడ్రా" చర్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, స్పష్టమైన జూరా లేకుండా కూల్చివేతలు చేయవద్దని ఆదేశించింది. ప్రజా భూముల రక్షణ అవసరమే అయినా, అది "యుద్ధ వాతావరణం"లా ఉండకూడదని కోర్టు వ్యాఖ్యానించింది.

ఇది ప్రజాస్వామ్యంలో చాలా కీలక సందేశం. అక్రమ నిర్మాణం తొలగించాల్సిందే. కానీ అక్రమానికి అనుమతి ఇచ్చిన అధికారులు? రిజిస్ట్రేషన్ చేసిన వ్యవస్థ? రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు? వీరిపై చర్యలు లేకుండా చివరికి కేవలం ఇంటి యజమానిపైనే బుల్డోజర్ నడిస్తే, అది న్యాయం కంటే ప్రదర్శనగా కనిపించే ప్రమాదం ఉంది. ఈ రెండు రాష్ట్రాల మధ్య పోలిక ఆసక్తికరం. ఆంధ్రప్రదేశ్‌లో "ఆస్తులను ఎలా వినియోగించాలి?" అన్న చర్చ ప్రధానంగా ఉంటే, తెలంగాణలో "భూమిని ఎవరి నుండి తిరిగి తెచ్చుకోవాలి?" అన్న చర్చ ప్రధానంగా ఉంది. ఒక రాష్ట్రం పెట్టుబడుల కోసం ప్రభుత్వ ఆస్తులను తెరుస్తుంటే, మరో రాష్ట్రం భూవినియోగ క్రమశిక్షణ కోసం కఠిన చర్యలకు దిగుతోంది. రెండింటికీ సిద్ధాంతపరంగా కారణాలు ఉన్నాయి. కానీ రెండింటిలోనూ ప్రజల విశ్వాసం దెబ్బతినే అవకాశం కూడా ఉంది. సంక్షేమం మాత్రమే సరిపోదు; ఆదాయం సృష్టించే ఆర్థిక వ్యూహం కావాలి. అదే విధంగా క్రమశిక్షణ మాత్రమే సరిపోదు; మానవీయతతో కూడిన అమలు కావాలి. ఆసుపత్రి అమ్మి ఆదాయం తెచ్చినా ప్రజలకు చికిత్స దొరకకపోతే ప్రయోజనం లేదు. అక్రమ నిర్మాణం కూల్చినా నిరపరాధ కుటుంబం రోడ్డున పడితే అది పాలనా విజయం కాదు.

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అసలు లోటు నాయకుల కొరత కాదు; స్థిరమైన పాలనా తత్వం కొరత. ఒక ప్రభుత్వం వచ్చిన వెంటనే పాతదాన్ని రద్దు చేయడం, కొత్తది వచ్చిన వెంటనే ప్రతీకారాత్మక నిర్ణయాలు తీసుకోవడం, ప్రజల దీర్ఘకాల ప్రయోజనాల కంటే రాజకీయ సందేశాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఇదే సమస్య. ప్రజలకు కావలసింది అమ్మకాల ప్రభుత్వం కాదు, కూల్చివేతల ప్రభుత్వం కాదు. అవకాశాలు కల్పించే ప్రభుత్వం, చట్టాన్ని న్యాయంగా అమలు చేసే ప్రభుత్వం, ప్రజా ఆస్తిని కాపాడుతూ ప్రజల జీవితాలను కూడా గౌరవించే ప్రభుత్వం.

తెలుగు రాష్ట్రాల అదృష్టం మారాలంటే, అధికార మార్పు కంటే పాలనా నాణ్యత మారాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

### రోడ్లంతా గుంతలే ఉంటై సర్దు కోంఢ్రి..!!



బైకులు మోటార్లు
సూసి నడుపుంఢ్రీ
రోడ్లంతా గుంతలే
ఉంటై సర్దు కోంఢ్రీ
అట్లెట్లని అడ్గొద్దు
గివెట్లని గుల్గొద్దు
కంట్రాక్టర్ నేతల్
లంగోటి దోస్తుల్
పార్టులు పానాల్
పోతే పోతై లెండి
గీ రోడ్ల భద్రతలకే
ఈ ఉత్సవాలండీ
సిగ్నల్ స్పీడు క్రాసై
ఫైనులమీద పైస్లని
దాదు ఫిర్యాద్లేదని
మీలో మీరే సర్లండి
ఏలేటోల్లు గొప్పోల్లు
అధికం జేస్తే అనేరు
ఇంసూరెన్స్ దుడ్లు
దొబ్బేసే ఎత్తులివని
సావుల మీదైతేనేం
చేసేస్తర్ పరాశికాల్
కోర్టులసుట్టూ తిప్పి
ఉన్న పానాల్ దీస్తర్

-డా. ఇక్బాల్ పాషా
9440775732

### గాలి తిరిగింది!



గతం గతః
దానినేపట్టుకు
వ్రేలాడకు!
వర్ణవిభజన
వాళ్ళస్వార్థం!
నిర్వివాదాంశం!
సూద్రుల శ్రమ
దోపిడీకోసమే
పైలోకాలభ్రమ!
ఐపోయింది
గతం గతః
ఇప్పుడేంటి?
పూలే అంబేద్కర్
ఇంకా ఎందరో
సత్యం చెప్పారు!
స్పష్టాతి స్పష్టంగా
విప్పి చెప్పి
కళ్ళు తెరిపించారు!
మనం ఏంచెయ్యాలి!
ఇదీ నేటి ప్రశ్న
జవాబు 'ఐక్యత'!
సూద్రులంతా
ఒక్కటే (శ్రమకులాలన్నీ)
(ఎస్సీ ఎస్టీ బిసి మైనా..)
ఐక్యత కావాలి!
అమెరికోడు
ఎగబడితే
ముస్లిదేశాలైక్యత!
వాళ్ళకు వాళ్ళకు
ఎన్ని ఉన్నా
ఒక్కటయ్యారు!
మరిమన సంగతి!
వేలసంవత్సరాలుగా
బలిపశువులం!
ఒక్కటౌదాం!
మనకులాలన్నీ
శ్రమ(ఉత్పత్తి)కులాలే!
ఐక్యంగా కదులు
రాజ్యాధికారం
సాధించు!
సమానత్వమే
మనధ్యేయం!
అంతా ఒక్కటే!
మన సిద్ధాంతమే
మన బలం!
ఒక్కటై కదులుదాం!
మీరు విడిపోతే
మళ్ళీ పడిపోతాం!
వాడిదే రాజ్యం!
వాడి రాజ్యంలో
మూతికి ముంత
ముడ్డికి చీపురు
గుర్తుంచుకోండి
మార్క్స్ అంబేద్కర్
(లాల్ ఒనీల్ )
ఐక్యతే మనబలం!
గాలి తిరిగింది
ఆమని కోయిల
కూస్తోంది!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## దక్షిణ భారతంపై ఆధిపత్యం కోసమై డీలిమిటేషన్

భారతదేశ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రాజకీయ రిజర్వేషన్ చట్టం ప్రకారం, లోక్‌సభ మరియు రాష్ట్ర శాసన సభలలో మహిళలకు 33% సీట్లు కేటాయించబడతాయి. అయితే, ఈ రిజర్వేషన్ అమలు కావడానికి ప్రభుత్వం రెండు ప్రధాన షరతులను పెట్టింది.కొత్త జనాభా గణన (జవఅంబం) జరగాలి.ఆ జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ (పునర్విభజన) ప్రక్రియ పూర్తి కావాలి.అంటే, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు మహిళా రిజర్వేషన్ అమలులోకి రాదు. అందుకే ఈ రెండింటికీ విడదీయలేని సంబంధం ఉంది. కానీ ప్రతిపక్షాల, ప్రగతిల నాయకుల వాదన ఏంటంటే 2014 నుండి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉండి డీలిమిటేషన్ ప్రక్రియ చేయకున్నా ఉన్న పార్లమెంట్ సీట్లలో మహిళ లకి 33% రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వడానికి ఎందుకు ఆలస్యం చేశారని డిమాండ్ చేస్తున్నారు. అయినా డీలిమిటేషన్ ప్రక్రియ, మహిళా రిజర్వేషన్స్ రెండు కూడా వేర్వేరు చట్టాలు అయినప్పటికీ రెండింటిని ముడిపెట్టి బిజెపి మరియు ఎన్డిఏ కేంద్ర ప్రభుత్వం భవిష్యత్ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను పొందడానికి నేడు డీలిమిటేషన్ ప్రక్రియని, మహిళా రిజర్వేషన్స్ చట్టాన్ని ముందుకు తెస్తున్నారని ప్రతిపక్షాలు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయి.



**దక్షిణ భారత రాష్ట్రాల ఆందోళన వాస్తవాలు**

డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదనలో కొంత సాంకేతిక వాస్తవం ఉంది. దీనికి ప్రధాన కారణం జనాభా నియంత్రణ. సాధారణంగా నియోజక వర్గాల సంఖ్య జనాభా ప్రాతిపదికన పెరుగుతుంది. గత కొన్ని దశాబ్దాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి అనేక ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంది.ఒకవేళ కొత్త జనాభా లెక్కల ప్రకారం సీట్లు పెంచితే, ఉత్తరాది రాష్ట్రాలకు ఎంపీ సీట్లు భారీగా పెరుగుతాయి, దక్షిణాది రాష్ట్రాల సీట్ల శాతం తగ్గుతుంది. దీనివల్ల కేంద్ర రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల ప్రాముఖ్యత తగ్గిపోతుందనేది దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల భయం. మహిళా రాజకీయ రిజర్వేషన్స్ అడ్డుపెట్టుకొని డిలిమిటేషన్ ప్రక్రియ చేయడం వల్ల పార్లమెంటులో దాదాపు 800 నుండి 850 కి ఎంపీ సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. తద్వారా జనాభా నియంత్రణ చేయలేకపోయినా ఉత్తర భారతంలో ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉన్నది, జనాభా నియంత్రణ చేసిన దక్షిణ భారతంలో తక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. తద్వారా ఇప్పటికే దక్షిణ భారతంలో బిజెపి మరియు ఎన్డిఏ కేంద్ర ప్రభుత్వానికి తక్కువ ఓటు బ్యాంకు ఉన్నది కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అయితే దక్షిణ భారతదేశ రాష్ట్రాలలో బిజెపి, ఎన్డీఏ లోని మిత్ర పార్టీలకి ఏమాత్రం సీట్లు రాకున్నా ఒక్క ఉత్తర భారతదేశం లోని రాష్ట్రాలలో ఎక్కువ సీట్ల తెచ్చుకొని బిజెపి, ఎన్డీఏ మిత్ర పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని ఎక్కువ రోజులు పాలించడానికి అవకాశం ఉన్నది. ఎందుకంటే బిజెపి మరియు ఎన్డీఏ మిత్ర పార్టీలకి ఎక్కువ బలం ఉన్నది కూడా ఉత్తర భారత రాష్ట్రాల్లోనే కాబట్టి, ఇక్కడ క్షుణ్ణంగా అర్థం అవుతున్నది ఏంటంటే దక్షిణ భారత రాష్ట్రాలకి అన్యాయం జరిగిన పర్వాలేదు.కానీ భవిష్యత్తులో బిజెపి మరియు ఎన్డిఏ ప్రభుత్వం ఎక్కువకాలం ఉండాలని మహిళ రాజకీయ రిజర్వేషన్స్ అడ్డుపెట్టు కొని మోడీ, అమిత్ షా, జేపీ నడ్డా నాయకత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం బలమైన వ్యూహాలు రచిస్తున్నదని నిరూపణ అవుతుంది. తద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం లేకుండా, ఉత్తరాది రాష్ట్రాల బిజెపి నాయకులు సుదీర్ఘకాలం కేంద్ర ప్రభుత్వాన్ని పాలించడానికి అవకాశాలు ఉన్నాయి.

**బీసీ సబ్ కోటా.. సామాజిక న్యాయం**

మహిళా రిజర్వేషన్ బిల్లులో SC, ST మహిళలకు అంతర్గత రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, గాదీజ (బీసీ) మహిళలకు ప్రత్యేక ఉప కోటా కేటాయించలేదు. దీనిపైనే ప్రతిపక్షాలు మరియు సామాజిక రాజకీయ మేధావులు విశ్లేషకులు మండిపడుతున్నారు. బీసీ కోటా లేకపోతే, రాజకీయంగా ఇప్పటికే బలంగా ఉన్న అగ్రకుల మహిళలే ఈ 33% రిజర్వేషన్‌ను అందిపుచ్చుకుంటారనే వాదనలో బలం ఉంది. దీనివల్ల "వెనుకబడిన కులాల మహిళలకు" ప్రాతినిధ్యం దక్కకపోవచ్చు. దేశంలో కులగణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం బీసీ మహిళలకు వాటా ఇవ్వాలని ప్రతిపక్షాల, ప్రజా స్వామ్యవాదుల, వివిధ ప్రగతిశీల సంఘాల నాయకుల డిమాండ్ చేస్తున్నారు. స్వాతంత్రానంతరం బీసీ లకు రాజకీయ రిజర్వేషన్స్ లేకపోవడం మూలంగా బీసీల రాజకీయ వాటా అగ్రకుల నాయకులే అనుభవిస్తున్నట్లుగా గత రాజకీయ గణాంకాలు పరిశీలిస్తే క్షుణ్ణంగా నిరూపణ అవుతుంది. కాబట్టి ఇకనైనా కేంద్ర ప్రభుత్వం బీసీలకు రాజకీయ రిజర్వేషన్స్ ఇవ్వడానికి పార్లమెంట్ ద్వారా చట్టాలు తీసుకురావాల్సిన చారిత్రక అవసరత ఎంతైనా ఉన్నది. ఇది బీసీలకి తరతరాలుగా జరుగుతున్న అన్యాయానికి బీసీలకు ఇవ్వాల్సిన ప్రజాస్వామ్య రాజ్యాంగబద్ధ హక్కుగా చూడాలి.

**ప్రభుత్వం ముందున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు**

ఉత్తరబిదక్షిణ విభేదాలు రాకుండా, సామాజిక న్యాయం జరగాలంటే ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా, రాష్ట్రాల అభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, మరియు అక్షరాస్యత వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. లేదా, దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గకుండా ఉండేలా పార్లమెంట్ సీట్ల సంఖ్యను భారీగా పెంచి, వెయిటేజీ పద్ధతిని అనుసరించాలి.

**మహిళా రిజర్వేషన్ అమలులో మార్పులు**

సామాజిక న్యాయం జరగాలంటే బిల్లులో సవరణలు చేసి బీసీ మహిళలకు ఉప వాటా కల్పించాలి. 2026 తర్వాత కాకుండా, త్వరగా జనాభా గణన పూర్తి చేసి రిజర్వేషన్ అమలు చేయాలి. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా, రాబోయే కొత్త జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేయడం వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ధి చేకూరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. మహిళా రిజర్వేషన్ అనేది కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా, అన్ని కులాల మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే అది నిజమైన 'ప్రజాస్వామ్య విజయం' అనిపించు కుంటుంది. నిన్న(17.04.2026) జరిగినటువంటి పార్లమెంట్ సమావేశంలో 33% మహిళా రిజర్వేషన్స్ కి 2/3 వంతు మెజార్టీ లేకపోవడం వల్ల చట్టాన్ని కావలసిన 352 ఓట్లు అవసరం కాగా, అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి అందువల్ల 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు విగిపోవడం గమనార్హం. డిలిమిటేషన్ బిల్లుని, మహిళా రిజర్వేషన్లని వేరువేరుగా పెట్టి, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ఉపకోట కేటాయించడం మూలంగా సామాజిక న్యాయం జరుగుతుందని అప్పుడు మాత్రమే ప్రతిపక్ష పార్టీలుగా మద్దతిస్తామని కేంద్ర బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి విపక్షాలు సూచించాయి. అంతిమంగా బిజెపి, ఎన్డీఏ మిత్ర పార్టీలు తమ రాజకీయ స్వలాభం కోసం డిలిమిటేషన్ చేయకుండా, మహిళా రిజర్వేషన్ తెచ్చిన దేశంలోని ఏ రాష్ట్రాలకి ఏ వర్గాలకి అన్యాయం జరగకుండా ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ సామాజిక న్యాయం జరిగేలా బలమైన చట్టలు తీసుకొచ్చినప్పుడే భారతదేశ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలకి, సార్వభౌమాధికారానికి ప్రపంచ దేశాల ముందు గౌరవం దక్కుతుందని పాలక ప్రతిపక్షాలు గ్రహించి ఇకనైనా పరివర్తన చెందాలి.

పుల్లెంల గణేష్
(సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)
9553041549

# అమీన్‌పూర్ ఎస్టీపీని తరలిస్తాం

● ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటుపై ఎమ్మెల్యే



**అమీన్పూర్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా అమీన్పూర్ లో ఏర్పాటు చేయదలచిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టిపి)ను తరలించడం లేదా రద్దు చేయడం జరుగుతుందని.. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని 993 సర్వే నంబర్లో ఎస్ టి పి ఏర్పాటు చేయనున్న స్థలంలో ఆయా కాలనీల ప్రజలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ పరిధిలోని మురుగు నీటి జలాలను శు ద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా తమకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని స్థానిక కాలనీల ప్రజల నుండి పెద్ద ఎత్తున అభ్యంతరాలు తలెత్తుతున్న నేపథ్యంలో.. మెజార్టీ ప్రజలు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల అభిప్రాయానికి అనుగుణంగా ఎస్టిపిని తరలించడం లేదా రద్దు చేసేందుకు ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. అవసరమైన పక్షంలో ముఖ్యమంత్రి దృష్టికి సైతం తీసుకుని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమీన్పూర్ లో ఎస్టీపీని ఏర్పాటు చేయడం జరగదని స్పష్టం చేశారు. అత్యంత అవసరమైతే ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసి నక్కవాగులోకి తరలించడం జరుగుతుందని తెలిపారు. పనులను వెంటనే నిలిపివేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్లాంట్ ఏర్పాటుపై రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, జలమండలి సిజిఎం పద్మజ, జిఎం సుబ్బారాయుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## సూక్ష్మ, చిన్న పరిశ్రమల బలోపేతమే లక్ష్యం




**రాజేంద్రనగర్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నాయని, వాటి బలోపేతమే ప్రధాన లక్ష్యమని లఘు ఉద్యోగ భారతి అఖిల భారత అధ్యక్షుడు మధుసూదన్ దాడు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సమీపంలోని ఆరాంఘర్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎంఎస్ఎంఈల అభివృద్ధికి సంస్థ పలు కార్యక్రమాలు చేపడుతోందని, వ్యాపారవేత్తలకు సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్య సాధన, ఉపాధి అవకాశాల పెంపు, యువతను ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దడం తమ ధ్యేయమని పేర్కొన్నారు.లఘు ఉద్యోగ భారతి దేశవ్యాప్తంగా చిన్న పరిశ్రమల అభివృద్ధి, ఆధునికీకరణ, సాంకేతికత స్వీకరణకు ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. అలాగే ప్రభుత్వానికి ఎంఎస్ఎంఈల సమస్యలను చేరవేసి, అనుకూల విధానాల రూపకల్పనకు సహకరిస్తుందని చెప్పారు. సెమినార్లు, శిక్షణ కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూ వ్యాపార అవకాశాలను పెంచే వేదికగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

## సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందాలి



**మొయినాబాద్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ప్రస్తుతం కాలంలో సాంకేతికత ఆవిష్కరణలతో దేశం ఎంతో అభివృద్ధి చెందుతున్న సమయంలోవిద్యార్థులు కొత్త ధోరణిలను ఎంచుకొని అన్వేషించేందుకు లక్ష్యంగా ముందుకెళ్లాలని హైదరాబాద్ ఐఎల్ఈ సెక్షన్ వైస్ చైర్మన్ బాల ప్రసాద్ అన్నారు మొయినాబాద్‌లోని విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి అవగాహన సదస్సునువిద్యార్థులకు నిర్వహించారు విద్యార్థి కళాశాల చైర్మన్ పళ్ళ రాజేశ్వర్రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించే వేడుకలను ఏర్పాటు చేయడంలో ఆయన ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తూ సమస్త నాయకత్వ బృందం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సృజన .డీ న్ పద్మజ. అకాడమిక్ జి శ్రీలత డైరెక్టర్ ప్లేస్మెంట్ వెంకటాచలం కన్వీనర్ డాక్టర్ అరుణకుమారి జాతీయస్థాయి ఏకతాన్ 2026 నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న హైదరాబాద్ సెక్షన్ ఐఈఈ ఈ వాయిస చైర్మన్ బాల ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని కొత్తవారని ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు నూతన నైపుణ్యంతో ఉన్నత విద్యలో మంచి భవిష్యత్తును సంపాదించుకోవాలని పేర్కొన్నారు ఉన్నత విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



ముషీరాబాద్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) : చట్టసభల్లో బీసీలకు తక్షణం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు చిరంజీవులు, బీసీ మేధావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ జేఏసీ చైర్మన్ సతీష్ కుమార్ గౌడ్, బీసీ విద్యార్థి-యువజన సంఘాల జేఏసీ చైర్మన్ అనంతుల రామ్మూర్తి గౌడ్, ఎంబీసీ సంఘం అధ్యక్షుడు బడే సాహెబ్ ఆధ్వర్యంలో బీసీ మేధావుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, జాతీయ జేఏసీ చైర్మన్ ముద్దగొని సతీష్ గౌడ్ లు హాజరై మాట్లాడారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. బీసీలను కేవలం ఓట్ల కోసం మాత్రమే ఉపయోగిస్తున్నాయని విమర్శించారు. జనాభా గణనలో అన్ని కులాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ, బీసీలకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. అలాగే మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా కల్పించకపోవడాన్ని కూడా వారు తప్పుబట్టారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ వైఖరిని తీవ్రంగా విమర్శించిన మేధావులు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి బీసీలను మోసం చేసిందని తెలిపారు. దేశంలోని రెండు జాతీయ పార్టీలు బీసీలకు న్యాయం చేయడంలో విఫలమయ్యాయని పేర్కొంటూ, బీసీలకు రాజ్యాధికారం సాధించాలంటే ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పొలిటికల్ జేఏసీ నేత బైరూ శేఖర్, ఉస్మానియా జేఏసీ చైర్మన్ సాంబశివ గౌడ్, చపర్తి కుమార్, డప్పు కళామండలి కన్వీనర్ స్వామి, మదు, జీవన్, కిరణ్, రాకీ, రాజశేఖర్, రఘురాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య యూనివర్సిటీలో టెక్ అథాన్-2026 విజయవంతం




**మొయినాబాద్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 24 గంటల హ్యాకథాన్ " టెక్-అథాన్ 2026 విజయవంతంగా ముగిసింది. ఈ హ్యాకథాన్ మార్చి 30వ సోమవారం నుండి మార్చి 31 మంగళవారం మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ, ఏఐ, ఎంఎల్, ఈసీఈ, బిసీఏ మరియు బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో నమోదు చేసుకున్న 52 జట్లలో నుంచి ప్రభావవంతమైన 15 జట్లను ఎంపిక చేసి.. ఏఐ, హెల్త్ కేర్, వ్యవసాయం, విద్య, ఫోరెన్సిక్స్ మరియు ఐఓటి వంటి విభిన్న రంగాల్లో వినూత్న ప్రోటోటైప్ లను అభివృద్ధి చేసే అవకాశం కల్పించారు. ఈ హ్యాకథాన్ లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన మూడు జట్లను విజేతలుగా ఎంపిక చేశారు. శనివారం నాడు చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్. సీ.హెచ్.వీ.పురుషోత్తం రెడ్డి నగదు మరియు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్.వీ.పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. ఈ హ్యాకథాన్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, బృంద సహకారం మరియు ప్రయోగిక సమస్యల పరిష్కార నైపుణ్యాలు సామర్థవంతంగా అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్. సీహెచ్.సాత్విక రెడ్డి, వైస్ ఛాన్సలర్ జీ.శంకర్ లింగం, రిజిస్టర్ యం.రవీందర్, ఎం.జగదీశ్వర్, ఈ.అరవింద్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సరళిని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**మక్తల్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ సరలిని శనివారం రోజున అడిషనల్ కలెక్టర్ శ్రీ ఫణిందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యతో ఎన్నికల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ నాగ శివ, మేనేజర్ ఖాదర్ ఖాన్, శానిటరీ ఇన్స్పెక్టర్ చెన్నకేశవ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

● జిల్లా విద్యాధికారి విజయ




**మెదక్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం కూచన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం "బడిబాట" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారిణి విజయ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ బడుల్లో లభిస్తుందని, గ్రామీణ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని సూచించారు. మండల విద్యాధికారి నాచారం మధుమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలు, సైన్స్ ల్యాబులు, యోగా, కరాటే వంటి సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు వీటిని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి బడిబాట కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహనీయుల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



**చేవెళ్ల, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** మహనీయుల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఈనెల 30వ తేదిన చేవెళ్లలో నిర్వహించ తలపెట్టిన మహనీయుల జాతర కార్యక్రమం ప్రచారం రథంను శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మహనీయులు బసవేశ్వర, మహాత్మా జ్యోతిరావుపూలే, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ చరిత్రను భావితరాలకు తెలిసేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహనీయుల జాతర కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్, వైస్ చైర్మన్లు రామస్వామి, మొకరం రాజు, బండి బాలకృష్ణ, నల్లోళ్ల శ్రీకాంత్, శివరాజ్, జానీ, ప్రభాకర్, ఆం జనేయులు, చేవెళ్ల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్, మహనీయుల కమిటీ కోశాధికారి ఏర్పుల మల్లేష్, సభ్యులు బ్యాగరి ప్రభాకర్, మల్లెపల్లి శ్రీనివాస్, నరేందర్ తదితరులు ఉన్నారు.

## ఫార్మాసిటీ భూముల్లో ఎలాంటి పంటలు వేయొద్దు

● ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి



**యాచారం, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నానక్నగర్ తాడిపర్తి, కుర్మిద్ద, గ్రామాల్లో ఫార్మసిటీకి భూములు ఇచ్చి నష్టపరిహారం తీసుకున్న రైతులు ఆ భూముల్లో ఎలాంటి పంటలు వేయవద్దని ఇబ్రహీంపట్నం ఆర్ డి ఓ అనంతరెడ్డి తెలిపారు. శనివారం ఫార్మసిటీ కేటాయించిన భూముల్లో ఆయన పర్యటించారు. ఎవ్వరు భూముల్లో పంటలు వేసిన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతంలో కొంతమంది పంటలు వేసుకున్నారు కానీ ఎవ్వరు వేయవద్దని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు అర్థం చేసుకుని అధికారులకు సహకరించాలని కోరారు. ఇలాంటి సమస్యలు ఉన్న క్రమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. రోడ్డు పనులు కూడా ముమ్మరంగా నడుస్తున్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అయ్యప్ప, ఆర్ ఐ మురళి, టీఎస్ ఐఐసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి అనుగుణంగా మౌలిక వసతులను కల్పిస్తాం



**నిజాంపేట్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి లోని నందనవనం కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా శివారు ప్రాంతాలలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా వెలుస్తున్న కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నామని, రానున్న రోజుల్లో కాలనీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. అంతకముందు స్థానిక శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవాలయం (మరకత) అభయాంజనేయ స్వామి దేవాలయం లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందనవనం కాలనీ వాసులు మోహన్, సురేష్, రాజశేఖర్, మహేష్, కిషోర్, నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, సుజాత, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సతీష్, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలి




**గద్వాల నడిగడ్డ,ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి 26 వరకు నిర్వహించే సంక్షేమ వారోత్సవాలను సంబంధిత అధికారులు విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు అన్నారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే సంక్షేమ వారోత్సవాలపై శనివారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ వారం పాటు నిర్వహించే ఆయా కార్యక్రమాల షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించినందున దాని ప్రకారం నిర్వహించాలన్నారు. వసతి గృహాల విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసం, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయాలన్నారు. ఆయా వసతి గృహాల్లో మైనర్ రిపైర్స్ గుర్తించి ప్రతిపాదనలు చేసి పంపాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలపై, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కలిగించడమే కాక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీసీ అనంతరం అదనపు కలెక్టర్లు జిల్లా అధికారులతో మాట్లాడుతూ మండలాల ప్రత్యేక అధికారులు వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులకు సహకరించాలన్నారు. ఆయా వసతి గృహాల్లో ఉండే సమస్యలపై ఫోటోలు తీసి, పరిష్కరించాక కూడా ఫోటోలు తీసుకొని బిఫోర్, ఆఫ్టర్ ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల బ్యానర్లను తప్పకుండా ప్రదర్శిస్తూ షెడ్యూల్ ప్రకారం ప్రోగ్రామ్స్ నిర్వహించాలన్నారు. పేరెంట్స్ మీటింగ్ ల సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, డిడబ్ల్యుఓ సునంద, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప,వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
19 ఏప్రిల్ 2026

# సంక్షేమ వసతి గృహాలలో మౌలిక వసతి సదుపాయాలు కల్పించాలి

- వసతి గృహాలలో వందశా తం మెనూ అమలు చేయాలి
- వార్డెన్ల సమీక్షలో కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** వసతి గృహాలను వార్డెన్లు తమ ఇంటిలా భావించాలనీ అక్కడ ఉండే విద్యార్థినీ విద్యార్థులను సొంత పిల్లల లా చూసుకోవాలి.. వంద శాతం కచ్చితమైన మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందించాలి జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలలో మౌలిక వసతి సదుపాయాల కల్పన కు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో జిల్లాలోని ఎస్సీ ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్ల (హెచ్‌డబ్ల్యుఓ)తో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని, ప్రభుత్వ పరంగా వచ్చే ప్రతిదీ వారికి అందించడం మన బాధ్యత, వృత్తి ధర్మం అని కలెక్టర్ తెలిపారు. ప్రతీ వసతి గృహంలో విద్యార్థులకు సరిపడా నీళ్ళు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, వెలుతురు ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాలలో మరుగుదొడ్లు, స్నానపు గదులు తగినన్ని ఉండాలని తెలిపారు. వసతి గృహాలలో మెనూ అమలు కావడం లేదనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, ఇకపై అలాంటి ఫిర్యాదులు రాకుండా లేకుండా వంద శాతం మెనూ అమలు చేయాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. ఇతర జిల్లాల్లో (వికారాబాద్, మరి కొన్ని జిల్లాలు) మెనూ అమలు చేస్తున్నారని, మరి మన జిల్లాలో




ఎందుకు అమలు చేయడం లేదని వార్డెన్ల ను ఆయన ప్రశ్నించారు. వర్కర్లు లేరని, సరుకులు సరిపోవడం లేదని, అవసరమైన సామాగ్రి లేదనే కారణాలు చెప్పకుండా మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం భోజనం స్నాక్స్ ఇవ్వాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల మెనూ విషయంలో తాను కాంప్రమైజ్ కానని సూటిగా చెప్పారు. తాను వికారాబాద్ జిల్లాలోని ప్రతీ వసతి గృహాన్ని సందర్శించానని, ఆయా వసతి గృహాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించానని సమావేశంలో కలెక్టర్ గుర్తు చేశారు. వసతి గృహాలలో అవసరమైన మౌలిక వసతి సదుపాయాల కల్పనకు మూడు రోజులలో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని వార్డెన్లకు సూచించారు. మన ఇంటిని ఎలా చూసుకుంటామో వసతి గృహాలను కూడా అలాగే చూసుకోవాలన్నారు. ఈ వేసవి సెలవులలో జిల్లాలోని అన్ని వసతి గృహాలలో మరమ్మతు పనులను పూర్తి చేయించాలని, తన వంతు నిధులు కేటాయిస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. అయితే వసతి గృహాల లోపలికి ఎమ్మెల్యే, ఎంపీ, ఎం ఎల్ సీ లకు తప్ప వేరే ఎవరిని అనుమతించ వద్దని, ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు అస్సలు అనుమతించవద్దని ఎవరైనా అడిగితే కలెక్టర్ ఆదేశం అని చెప్పాలని, ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ వార్డెన్ల ను ఆదేశించారు. తాను వికారాబాద్ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో కల్పించిన వసతి సదుపాయాల బిఫోర్ / ఆఫ్టర్ చిత్ర మాలికలను సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వార్డెన్లకు చూపించారు. అనంతరం జిల్లాలో సొంత భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాలు, అద్దె భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాల వివరాలు, విద్యార్థినీ విద్యార్థులు సంఖ్య, ప్రస్తుతం ఉన్న గదులు,మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంట సామాగ్రి, వర్కర్లు, ప్రస్తుతం ఉన్న వసతులు, అవసరమైన సదుపాయాల గురించి వసతి గృహాల వారీగా వార్డెన్ల ను అడిగి తెలుసుకున్నారు.ముందుగా సొంత భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాలలో చేయాల్సిన మరమ్మతు పనుల కోసం స్థానికంగా ఉండే తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లను పిలిపించి ఎంత వ్యయం అవుతుందో ప్రతిపాదనలు తయారు చేసి నెక్స్ట్‌మావేశం నాటికి తీసుకు రావాలని ఆదేశించారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాల మరమ్మతు పనుల విషయంలో ఆయాభవనాల యజమానులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకుందామని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, ఏఎస్ డబ్లుఓ పరమేశ్, జిల్లాలోని ఆయా వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



**నారాయణపేట, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని నారాయణ పేట మార్కెట్ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి అన్నారు.శనివారం నారాయణపేట మండలంలోని లింగంపల్లి, కొల్లంపల్లి, బోయిన్ పల్లి గ్రామాలలో ఐ కే పి వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి లబ్ది పొందాలని కోరారు. యాసంగి రబి సీజన్ కు సంబంధించి ప్రభుత్వ మద్దతు ధర 2389, అదేవిధంగా సాధారణ రకం 2369 రూపాయలు ఇస్తున్నట్టు తెలిపారు, సన్న రకాలకు అదనంగా 500 రూపాయలు బోనస్ కూడా ప్రభుత్వం ఇస్తుందన్నారు, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా మహిళల ద్వారా నిర్వహించే ఐకెపి కేంద్రాలలో వరి ధాన్యాన్ని అమ్మాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు మాధవ రెడ్డి, డైరెక్టర్ శరణప్ప, లింగంపల్లి సర్పంచ్ భాగ్య, కొల్లంపల్లి సర్పంచ్ ముక్కిడి మన్నెమ్మ, బోయిన్ పల్లి సర్పంచ్ వెంకటేష్, లక్ష్మీపూర్ సర్పంచ్ మమత, ఎ పి ఎం నారాయణ,సి సి లక్ష్మి,ఆయా గ్రామాల ఏ ఈ ఓలు అంజమ్మ, సుధాకర్, వి ఓ ఏలు సరిత, రేణుక,రమాదేవి,నాయకులు భీమ్ ప్రకాష్, కృష్ణా నాయక్, సురేష్ చారి, జగన్ గౌడ్, గౌసుద్దీన్, జనార్దన్ గౌడ్, రామ్ రెడ్డి, సుదర్శన్ గౌడ్ శేసి వెంకటయ్య, సాయి రెడ్డి, సాలె వెంకటయ్య, కుమ్మరి రాజు, మల్లేష్, ఆ ఆయా గ్రామైక్య సంఘాల ప్రతినిధులు కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

## రూ.135 కోట్లతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**సదాశివపేట, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** పట్టణ ప్రజలకు మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు వేగవంతం చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ తెలిపారు. రూ.135 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన వాటర్ స్కీం పైప్ లైన్ పనులపై శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు పవర్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వాటర్ స్క్రీన్ ప్రతిపాదనలు వివరించారు..2028-2078... 50 సంవత్సరాల జనాభా ఆధారంగా నీళ్లు అందించే విధంగా ప్రణాళిక రూపొందించామని, సింగూర్ డ్యాం నుంచి నేరుగా మంజీరా నీటిని సదాశివపేట పట్టణంలో ఇంటింటికి చేరే విధంగా సింగూర్ డ్యాం వద్ద ఇంటెక్ వెల్ ఏర్పాటు చేసి,21.07 కిలోమీటర్ల విస్తరణలో సదాశివపేట బైపాస్ రోడ్డు వద్ద 30 మీటర్ల పొడవులో ఫిల్టర్ బెడ్ నిర్మించి, పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో 6 ట్యాంకులు ఏర్పాటు చేసి, 20 కిలోమీటర్ల మేర పైప్ లైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికి నీరు సప్లై చేసే ప్రతిపాదనలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, మున్సిపల్ కౌన్సిలర్ లు,మున్సిపల్ ఇంజనీర్ రాజేష్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక లభ్యత గల ప్రాంతాల నుంచి రవాణాకు అనుమతులు ఇవ్వాలి

- జిల్లాలో మరో పది ఇసుక రీచ్‌ల ఏర్పాటు
- డీఎల్ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్ లతో పాటు అదనంగా ఇసుక లభ్యత గల మరో పది రీచ్ లను ఏర్పాటు చేసి మన ఇసుక మన వాహనం ద్వారా రవాణాకు ఆన్ లైన్ అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు.శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన డి.ఎల్.ఎస్.సి( డిస్టిక్ లెవెల్ స్యాశీడ్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మన ఇసుక మన వాహనం ద్వారా ప్రస్తుతం జిల్లాలోని వర్కూరు పరిధిలోని నాలుగు రీచ్ లతో పాటు ఉట్కూర్ మండలంలోనీ నాగిరెడ్డి పల్లి రీచ్ ల నుంచి ఇసుకను తరలించేందుకు ఆన్ లైన్ అనుమతులు జారీ చేస్తున్నామని, ఇకపై జిల్లాలో గుర్తించిన మరో పది ఇసుక రీచ్ ల నుంచి కూడా రవాణాను ఆన్ లైన్ అనుమతులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆయా రీచ్ లకు కే ఏం



ఎల్ మ్యాపింగ్ చేసి రెవెన్యూ, మైనింగ్,భూగర్భ జల వనరుల శాఖ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.అలాగే అమ్మి కుంట, నేరేడు గాం, సంగం బండ, మిత్రిఫా,రాకొండ( చెక్ డ్యాం) పరిధిలోనూ ఇసుక లభ్యత, రవాణా పై అధికారులు క్షేత్ర సాయి పరిశీలన చేయాల న్నారు. గతంలో 21 రీచ్ లు ఉండగా, ఇప్పుడు నాలుగైదు రీచ్‌లనే గుర్తించడం ఏమిటని, కనీసం 18 రీచ్ ల నుంచి మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుక రవాణా కు అనుమతులు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు గుర్తించిన పది రీచ్ లకు సంబంధించి ఆయా శాఖల అధికారుల నివేదికలు క్లియర్ గా ఉన్నా యా లేదా అని కలెక్టర్ ప్రశ్నించారు. మరోసారి ఆయా రీచ్ లను అధికా రులు జాయింట్ ఇన్స్ పెక్షన్ చేసి పూర్తి స్థాయి నివేదికను పది రోజులలో ఇవ్వాలన్నా రు. కాగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో మన రాష్ట్ర పరిధి ముగింపు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచిం చారు. ఇదే నెలలో మరోసారి నిర్వహించే డీ ఎల్ ఎస్ సీ సమావేశంలో పది రీచ్ ల నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, మైనింగ్ ఏ డీ గోవింద రాజు, భూగర్భ జల వనరుల శాఖ ఏ డీ రవి, నీటి పారుదల శాఖ ఈ.ఈ. బ్రహ్మానందరెడ్డి, ధన్వాడ, మరికల్, ఉట్కూర్, మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేస్తున్న మోడీ

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేస్తున్న .. మోదీ, బీజేపీ ప్రభుత్వం ఇంట్లో కూర్చొని, దేవుడి పేరుతో ఓట్ల రాజకీయం చేస్తూ, అధికారం దక్కించుకుంటోంది అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. డీలిమిటేషన్ బిల్, మహిళా బిల్ లలో లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఐబీ నుంచి పాత బస్ స్టాండ్ వద్ద వున్న అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. జగ్గారెడ్డి డీలిమిటేషన్ బిల్లు పత్రాలను దహనం చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ సందర్భంగా టిపిసిసి వరకే ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీ ఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేస్తున్న మోడీని ఈ దేశ ప్రజలు మూడో సారి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టారు. దేశ ప్రజల భవిష్యత్తు బాగుండాలని జనాల మధ్య తిరుగుతున్న రాహుల్ గాంధీని ప్రధానిని ఎందుకు చేయడం లేదు అని అన్నారు. గ్రామాల నుంచి రాజధాని వరకు ఈ దేశ ప్రజలందరూ స్వేచ్ఛగా జీవించేలా అంబేద్కర్ హక్కులు కల్పించారు. కేంద్రంలో ప్రధాని మోదీ బీజేపీ ప్రభుత్వం.. ఈ దేశ ప్రజల హక్కులను కాల రాయాలని కుట్రలు చేస్తోంది అని అన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత బంగారం, పెట్రోలు, డీజీలు, ఎరువులు



ఇలా అన్నింటి ధరలు పెరిగాయి. రైతులకు మేలు చేసే పథకాలు ఏవి అమలు కావడం లేదు దేశ ప్రజలు ఈ విషయాలను గమనించాలి. దేశ ప్రజల హక్కులను కాపాడేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మనమందరం అండగా నిలవాలి ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి తో పాజి అనంత కిషన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జార్జ్, కూన సంతోష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- సెన్సస్ సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**మల్దకల్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** సెన్సస్ ప్రక్రియ ఎన్నికలతో సమానమైన ప్రాముఖ్యత కలిగి ఉందని,ఇది కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్యక్రమమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం మల్దకల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ లో గణనకు సంబంధించి సూపర్వైజర్లు, ఎన్నుమరేటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెన్సస్ విధులు నిర్వహించే వారందరూ బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.సెన్సస్‌లో సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచాలని,ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు.ఇండ్ల గణనకు సంబంధించి తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ ఏడాది ఇండ్ల గణన పూర్తయితే వచ్చే ఏడాది జనాభా గణన చేయడంజరుగుతుందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన బ్లాక్‌పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, మ్యాప్ తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సరైన మ్యాప్ ఉంటే సగంపని పూర్తయినట్లేనని తెలిపారు. ఇళ్ల లెక్కింపు హౌస్ లిస్టింగ్ అత్యంత జాగ్రత్తగా చేయాలని,ఒక్క తప్పు కూడా ఉండకూడదన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియను ఎక్కువగా ప్రోత్సహించాలని,ఈ విషయాన్ని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆశ,అంగన్వాడి కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. ఏప్రిల్



26 నుంచి మే 10 వరకు జరిగే ఇండ్ల గణన ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు.సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్ల పనిని చార్జ్ అధికారులు సమీక్షిస్తూ, మార్గనిర్దేశం చేయాలని, ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనేపరిష్కరించాలన్నారు. సెన్సస్ హ్యాండ్‌బుక్, గైడ్‌లైన్స్ ప్రకారం పనులు నిర్వహించాలని ఆదేశించారు. గణనకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే శిక్షకులను అడిగి ఇప్పుడే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలనతో, పారదర్శకంగా,నిబద్ధతతో పనిచేస్తే సెన్సస్ విజయవంతంగా పూర్తి చేయవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మల్దకల్ తహసిల్దార్ ఝాన్సీ, ఎంపీడీవో ఆంజనేయులు, ఎంఈఓ సురేష్,శిక్షకులు నరేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తులు కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
- లైవ్లీ హుడ్ ఇంక్లూజివ్ ప్రోగ్రాంకు గట్టు మండలం ఎంపిక
- ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. గట్టు మండలం చమన్ ఖాన్ దొడ్డి గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న పలువురు లబ్ధిదారుల నూతన గృహాలను రిబ్బన్ కట్ చేసి ముఖ్య అతిథులు ప్రారంభించారు. గృహప్రవేశాలు చేసుకున్న ఇండ్ల యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వేదిక వద్ద పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఒకేసారి పెద్ద ఎత్తున గృహప్రవేశాలు చేసుకోవడం సంతోషంగా ఉందని, మరో విడతలో ఇండ్లు లేని వారికి కూడా ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఎంతో




ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి ముందు మరుగుదొడ్లను నిర్మించుకొని, వినియోగించుకుంటున్నందుకు అభినందనలు తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. తెలంగాణ లైవ్లీ హుడ్ ఇంక్లూజివ్ ప్రోగ్రాంకు గట్టు మండలం ఎంపికవడంతో అత్యంత వెనుకబడ్డ 15 గ్రామాలను ఎంపిక చేసి, ఒక్కో గ్రామంలో 25 కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు సమన్వయకర్తల సహకారంతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. షుగర్, బీపీ వ్యాధులు పెరుగుతున్నాయని ప్రజలు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్తులు తమ పిల్లలను చక్కగా చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తోడ్పడాలని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాల సేవలను చిన్నారులు, గర్భిణీ, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న వారు సొంతింటి కలను సాకారం చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. వెనకబడ్డ ఈ గ్రామంలో ఒకప్పుడు తాటాకు గుడిసెలు ఎక్కువగా ఉండేవని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లతో పక్కా గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. బ్రతుకుతెరువు కోసం వలస పోయే పరిస్థితులను రూపుమాపి ప్రజలు సొంతంగా తమ కాళ్లపై నిలబడేలా ప్రభుత్వం అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్తులు ఐక్యమత్యంగా ఉంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అభిలషించారు. అంతకు ముందు సిఎస్ఆర్సి కార్యక్రమంలో భాగంగా ఎల్టీఎం, భవిష్య భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన డిజిటల్ సేవల భవనాన్ని ముఖ్య అతిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, గ్రామ సర్పంచ్ భీమయ్య, ఉప సర్పంచ్ రేణుక, హౌసింగ్ డిఈ కాశీనాథ్, తహసిల్దారు విజయ్ కుమార్, ఎంపీడీవో చెన్నయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా సామ్రాజ్యవాదంతో మానవ మనుగడకు ముప్పు

**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** అమెరికా సామ్రాజ్యవాదంతో ప్రపంచ మానవ మనుగడకే ముప్పని శాంతికాముకులు ఐక్యంగా ప్రతిఘటించి పోరాడాలని ఐప్సో, పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. వనపర్తి లో శనివారం అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపిఎస్ఓ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ నుంచి రాజీవ్ చౌక్ వరకు శాంతి ర్యాలీ




నిర్వహించారు. యుద్ధం వద్దు- శాంతి ముద్దు, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి అంటూ నేతలు ప్రజలు విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జిల్లా ఐప్సో ప్రధాన సమన్వయ కార్యదర్శి యత్తం శివ అధ్యక్షతన సభ నిర్వహించారు.ఎత్తం శివ, రమేష్, జలజ్వాల రాధాకృష్ణ,వనగంటి నాగేశ్వర్, భరత్, సీఎన్ శెట్టి పలుస శంకర్ గౌడ్,గంధం నాగరాజు, గణేష్, ఖాదర్ బాషా తదితరులు మాట్లాడుతూ.. అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతో పొరుగు దేశాలను ఆక్రమించి, దేశ నాయకత్వాన్ని అంతం చేసి భూగర్భ సంపదను నిక్షేపాలను స్వాధీనం చేసుకుంటుందన్నారు. వెనుజుల అధ్యక్షుడు మధురో దంపతుల అక్రమ నిర్బంధం, ఇరాన్ అయతుల్లా ఖుమేని హతం ఇందులో భాగవేనన్నారు. అమెరికాతో సాంగత్యం ఉన్న అన్ని దేశాలు అమెరికా ఇజ్రాయిల్- ఇరాన్ యుద్ధం వల్ల నాశనమయ్యాయి అన్నారు. వేలాదిమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని లక్షలాదిమంది క్షతగాత్రులు అయ్యారన్నారు. చాలా దేశాలతో పాటు భారతదేశంలో విపరీతంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతకానితనం కూడా దీనికి కారణం అన్నారు. యుద్ధాలను ఆపితేనే మానవ మనుగడ అభివృద్ధి సాధ్యమని ఆ దిశగా ప్రపంచ దేశాలు సంఘటితమై అమెరికా ఆట కట్టించాలన్నారు. రక్త పిపాసి అమెరికా సామ్రాజ్యవాదాన్ని పొదుముట్టించేందుకు శాంతికాముక దేశాలన్నీ ఏకం కావాలని కోరారు. అందుకు భారతదేశం ముందు వరుసలో నిలవాలన్నారు. నేతలు కళావతమ్మ, గట్టు యాదవ్,గోపాలకృష్ణ, జయమ్మ, లింగన్న, మధు,ఖాదర్పాష, వెంకటమ్మ, పరంజ్యోతి, వంశీ, అరవిందు, శిరీష, అరుణ జ్యోతి కాలేజ్ డి.ఎం.ఎల్.టి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సెల్ఫ్ ఎన్యూమరేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనంసాక్షి):** భారత ప్రభుత్వం ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ జనగణన కార్యక్రమం (సెన్సస్ 2027) ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ప్రజలు ఈసారి అందుబాటులోకి వచ్చిన (డిజిటల్ సెల్ఫ్ ఏనుమేరేషన్ ) ఆన్లైన్ లో స్వయంగా నమోదు చేసుకునే విధానాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రూపొందించిన ఈ సౌకర్యం ద్వారా, ప్రజలు తమ ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం వంటి అంశాలను ఆన్‌లైన్‌లోనే సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ పోర్టల్ https://se.census.gov.in/ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ మేరకు స్వయంగా నమోదు చేసుకునే ప్రక్రియలో ప్రజలు ముందుగా పోర్టల్‌లోకి వెళ్లి, తమకు నచ్చిన భాషను ఎంచుకొని, మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీ (ఓటీపీ) సహాయంతో లాగిన్ అవ్వాలన్నారు. అనంతరం జిల్లా, పిన్ కోడ్, గ్రామం వంటి వివరాలను ఎంపిక చేసి, మ్యాప్‌లో తమ నివాసాన్ని గుర్తించాలని, తదుపరి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేసి, వివరాలను సమర్పించాలన్నారు. చివరగా మొబైల్‌కు వచ్చే ఎస్ఈ ఐడీ (సెల్ఫ్ ఏనుమేరేషన్ ఐడీ) ని భద్రపరచుకోవాలని కలెక్టర్ తెలిపారు. జనగణనలో భాగంగా ఇంటి నిర్మాణం, వసతి సౌకర్యాలు, కుటుంబ సభ్యుల సంఖ్య, విద్యుత్, నీటి వనరులు, మరుగుదొడ్డి సదుపాయం, వంట ఇంధనం, ఇంటర్నెట్ వినియోగం, వాహనాల వివరాలు వంటి ముఖ్యమైన సమాచారం నమోదు చేయవలసి ఉంటుందని చెప్పారు. అయితే, ప్రజలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ, ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి, నమోదు చేసిన వివరాలను ధృవీకరిస్తారని లికలెక్టర్‌లి స్పష్టం చేశారు. ఆ సమయంలో ప్రజలు తమ ఎస్ఈ ఐడీని చూపించి సహకరించాలని కోరారు. జనగణన ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఈ ప్రక్రియలో పాల్గొని, సరైన వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీకి వచ్చి ఏం చేస్తాడో చెప్పాలి

- మూడేళ్ల నుంచి తెలంగాణ రైతులను గోస పెట్టిన ముఖ్యమంత్రి
- మేడిగడ్డ సందర్శనలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**మహదేవపూర్:ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బయటకు వస్తుండంటేనే సీఎం రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందని ఆనాడు నల్గొండ ఈనాడు జగిత్యాల సభలను ఫెయిల్ చేయాలని రేవంత్ రెడ్డి చూస్తుండని మేడిగడ్డ బ్యారేజీకి వచ్చి ఏం చేస్తాడో ప్రజలకు సమాధానం చెప్పాలని మేడిగడ్డ బ్యారేజీ గేట్లను ఎత్తి మూడేళ్ల నుంచి తెలంగాణ రైతులను గోసపెడుతున్నాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం రోజున కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజ్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అధ్యక్షతన మాజీ మంత్రి డా, రాజయ్య, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎంపీ మలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, అరూరి రమేష్, దాసరి మనోహర్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ వాసుదేవ రెడ్డిలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ లో మాజీ మంత్రి ఎర్రవెల్లి దయాకర్ రావు. మాజీ ఎంపీ మాలోత్ కవిత.మాట్లాడుతూ ఆనాడు నల్లొండలో ఈనాడు జగిత్యాలలో మీటింగ్ పెడితే రేవంత్‌రెడ్డి బయటకు వస్తున్నాడు.కేసీఆర్ సభకు పోటీగా మీటింగ్‌లు పెట్టడంకాదని విమర్శించారు.దమ్ముంటే ప్రజలు వాలంటీర్‌గా వచ్చే సభలను పెట్టాలని, అప్పుడే రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబులకు తెలుస్తదన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌కు మరమ్మత్తుల చేస్తమని ఎల్‌ఎన్‌టి కంపెనీ వాళు హామీ ఇచ్చారని, అయినా ప్రభుత్వాన్ని బదనాం చేసి మూడేళ్ల నుంచి తెలంగాణ రైతులను గోసపెట్టిండ్లన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నిర్మించారని, 140టీఎంసీల స్టోరేజ్ ప్రపంచడంలో ఎక్కడా లేదన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా కేసీఆర్ కాళేశ్వరం నిర్మించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టక ముందు తెలంగాణ ఎట్టుండే ప్రజలు గమనించాలన్నారు. రెండు పిల్లర్లకు ఇబ్బంది అయితే ప్రాజెక్టు పూర్తిగా కూలిపోయిందని ప్రచారం చేసిగత ఎన్నికల్లో లబ్ది పొందారని, కానీ ఈనాడు ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం అర్థం అయిందని, ఎక్కడ ఏ ఎన్నికలు పెట్టినా ప్రజలు దుమ్ము రేపుతారని ఆయన అన్నారు. కేవలం జగిత్యాలలో కేసీఆర్ సభను ఫెయిల్ చేయాలనే కుట్రతోనే ముఖ్యమంత్రి మేడిగడ్డకు వచ్చి ఇక్కడ అధికారులతో రివ్యూ పెడుతున్నాడని, రేవంత్‌రెడ్డి డ్రామాను ఇటు ప్రజలు, అటు అధికారులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఎన్నో నీతులు చెప్తున్నాడని, మూడేళ్లుగా ఇక్కడ ఇసుక మాఫియా నడుస్తుంటే ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యం మూలంగా పొలాలు ఎండిపోతున్నాయని, సకాలంలో ఎరువులు అందడం లేదని, రైతులకు బోనస్ , రైతుబంధు ఇవ్వడంలేదన్నారు. అయితే ఎస్సారెస్పీ, శ్రీరాంసాగర్‌లను కాంగ్రెస్ కట్టింది నిజమే కావచ్చు కానీ, ఆనాడు మహరాష్ట్రలో అక్రమంగా ప్రాజెక్టులు కట్టి శ్రీరాంసాగర్‌కు చుక్క నీళ్లు రాకుండా చేసిన సమయంలో తనతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ధర్నా చేసింది వాస్తవం కాదా అని అన్నారు. ఆనాడు తెలంగాణా రాష్ట్రంలోని కాలువల్లో చుక్క నీరు లేక పిచ్చిమొక్కలు మొలిచాయని, కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాతనే తెలంగాణ బాగుపడిందని, సస్యశ్యామలం అయిందన్నారు. కేవలం జగిత్యాల కేసీఆర్ సభను ఫెయిల్ చేయాలనే రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడని, ఇక్కడకు వచ్చి ఏం చేస్తాడో ముందు సమాధానం చెప్పాలన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని సభలు పెట్టిన ముత్యాల మీటింగు ఎక్కువగా ప్రజలు వాలంటరీగా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కావాలనే కక్ష్యకట్టి మేడిగడ్డ బ్యారేజ్‌ను దోషిగా చూపించిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగపడలేదని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్. భూపాల్ పల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి. జిల్లా అధ్యక్షురాలుగండ్ర జ్యోతి. పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కక్ష్యకట్టి మేడిగడ్డ బ్యారెజ్‌ను దోషిగా చూపించి యావత్ తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేస్తుందని, ఈ విషయం ఇప్పుడిప్పుడే సమాజానికి అర్థం అవుతోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు

### ప్రేమించి పెళ్లి చేసుకున్నాం...
## మాకు రక్షణ కల్పించండి...!

- నర్సంపేట ఏసీపీని ఆశ్రయించిన ప్రేమ జంట...



**చెన్నారావుపేట, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** ప్రేమించి పెళ్లి చేసుకున్నామని మాకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డిని శనివారం ఆశ్రయించింది. చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన గందె అభిలాష్, నవ్యలు ఇటీవల కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. మేజర్లమైన తాము ఇష్టపూర్వకం గానే పెళ్లి చేసుకున్నామని కాని తమ వివాహం నచ్చని అమ్మాయి కుటుంబీకుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డిని ఆశ్రయించారు. ఇప్పటికే తన సోదరుడి ఇంటిపై అమ్మాయి కుటుంబ సభ్యులు దాడి చేసి ద్విచక్ర వాహనాన్ని, ఇంట్లోని వస్తు సామాగ్రిని ధ్వంసం చేశారని అభిలాష్ ఆవేదన వ్యక్తం చేశాడు.మరోవైపు నవ్య మిస్సింగ్ అయిందంటూ ఆమె తరపు కుటుంబీకులు చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టినట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు ప్రాణ భయం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. దీంతో నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి వెంటనే తగు చర్యలను తీసుకోవాలని చెన్నారావుపేట పోలీస్ సిబ్బందిని ఆదేశిం చారు. అంతేకాక ఇరువురి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిందిగా సూచించినట్లు తెలిపారు.

## నగరాల్లో మిద్దె తోటలు.. పచ్చదనానికి, ఆరోగ్యానికి దారి



**వరంగల్ ఎంజీఎం, ఏప్రిల్ 18(జనంసాక్షి):** నగరంలో మిద్దె తోటల (టెర్రస్ గార్డెనింగ్) పెంపకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో, సి.డి.ఎం.ఏ ఆదేశాల మేరకు పట్టణ ప్రాంతాల్లో మిద్దె తోటల పెంపకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పట్టణీకరణ విస్తరణతో వాతావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో దాన్ని తగ్గించేందుకు టెర్రస్ గార్డెనింగ్‌ను విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మిద్దె తోటల పెంపకం వల్ల ఆక్సిజన్ స్థాయిలు పెరగడంతో పాటు కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికర వాయువులు నియంత్రణలోకి వస్తాయని తెలిపారు.ఇంటి మిద్దెపై సహజ పద్ధతుల్లో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని, శుద్ధమైన గాలి లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సి.డి.ఎం.ఏ ప్రత్యేకంగా హార్టికల్చర్ అధికారులను నియమించినట్లు తెలిపారు.మిద్దె తోటల నిర్వహణలో పాటించాల్సిన విధానాలు, వాటి ప్రయోజనాలపై వరంగల్ టెర్రస్ గార్డెన్ గ్రూప్ (సిటిజీ) సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు ఔత్సాహికులకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. పట్టణాల్లో మైక్రో క్లైమేట్ మెరుగుపడి చల్లదనం పెరగడానికి కూడా ఇవి దోహదపడతాయని తెలిపారు.ఇంట్లో ఉత్పత్తి అయ్యే తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చి మిద్దె తోటలలో ఎరువుగా వినియోగించవచ్చని, దీనివల్ల డంప్ యార్డ్‌పై భారం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు.పొడి చెత్తను వారంలో రెండు సార్లు మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు.అనంతరం సి.డి.ఎం.ఏ నుంచి వచ్చిన హార్టికల్చర్ అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బాలసముద్రం ప్రాంతంలో సిటిజీ సభ్యురాలి ఇంటి వద్ద నిర్వహిస్తున్న మిద్దె తోటను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టెర్రస్ గార్డెన్ నోడల్ అధికారి హేమలత, రాష్ట్ర అర్బన్ ఫార్మింగ్ హార్టికల్చర్ అధికారి మంగ, సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, సిహెచ్ఓ రమేష్, ఎంహెచ్ఓ డా. రాజేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి, రిటైర్డ్ ఎఫ్ఆర్ఓ పురుషోత్తం, సానిటరీ సూపర్వైజర్లు భాస్కర్, గోల్కొండ శ్రీనివాస్, నరేందర్, టెర్రస్ గార్డెన్ నిర్వాహకులు, ఔత్సాహికులు తదితరులు పాల్గొన్నారు.



### మానవత్వం చాటుకున్న జనగామ వాసులు

**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** జనగామ కు చెందిన మహమ్మద్ అబ్దుల్ ముక్తాదీర్ తన కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్ నుండి జనగామకు స్కూటీ పై వస్తుండగా మార్గమధ్యలో నెహ్రూ పార్క్ వద్ద బట్టల బ్యాగ్, సెల్ ఫోన్, లాప్టాప్ లు స్కూటీ పై నుండి జారీ కింద రోడ్ పై పక్కన పడిపోయి ఉండడం గమనించిన జనగామ కు చెందిన బిర్రు సాంబశివారావు, పరాంకుషం కృష్ణ, మరియు బీరెల్లి తిరుపతి రెడ్డి లు వాటిని తీసుకొని వచ్చి జనగామ జఐ సత్యనారాయణ రెడ్డికి అప్పగించగా వెంటనే తన సిబ్బంది తో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి మహ్మద్ అబ్దుల్ ముక్తాదీర్ గారిని పోలీస్ స్టేషన్ కు పిలిపించి అప్పగించనైనది.

### ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ



**శాయంపేట ,ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** శాయం పేట మండ లంలోని మాందారి పేట గ్రామానికి సమీపాన ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన సంఘటన జరిగింది. శాయంపేట ఎస్సై పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం పరకాల నుండి హనుమకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ కు, కండక్టర్కు కొంతమంది ప్రయాణికులకు గాయాలైనట్లు తెలిపారు. వీరిని అంబులెన్స్ సహాయంతో ఎంజిఎం హాస్పిటల్కు తరలించినట్లు తెలిపారు. ఎంజీఎం హాస్పిటల్ గాయాలైన బాధితుల దగ్గరకు కు వెళ్లి బస్సు డ్రైవర్ కుమారస్వామి దగ్గర నుండి ఫిర్యాదు తీసుకొని లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనంసాక్షి):** పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమం ముగింపు సందర్భంగా గావిచర్ల క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని, వేగ నియంత్రణ పాటించాలని తెలిపారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, యువత రోడ్డు భద్రతపై బాధ్యతతో వ్యవహరించాలని, అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో శోభన్, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ లో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

**తాండూర్, ఏప్రిల్ 18( జనం సాక్షి) :** తాండూర్ మండలం లో ఎండలు మండిపోతున్నాయి. మూడు రోజులుగా 45 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం తో ఎండవేడికి తట్టుకోలేక ఇండ్లకు పరిమితం అవుతున్నారు. రోహిణి కార్తె లో రోకడ్లు పగిలే ఎండలు అంటే ఇలాగే ఉంటాయని పలువురు చర్చించుకుంటున్నారు. నిజానికి రోహిణి ప్రవేశించడంతో ఎండ ప్రచండమై తీవ్ర మైనాయని చెప్పుకోవచ్చు. భానుడి భగభగ మంటలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కోల్ బెల్ట్ ఏరియాలో ఎండ ప్రభావం మరింత ఎక్కువగా ఉండటంతో గత రెండు, మూడు రోజులుగా రోడ్లపైకి తిరిగే ప్రజల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. ప్రతియేటా వేసవి లో కనిపించే చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, కూల్ డ్రింక్ ఐస్ క్రీమ్ షాపులు కూడా తెరుచుకోకపోవడం ఎండ వేడిమిని తట్టుకోలేకుండా చేస్తున్నాయి. దీనికి తోడు తప్పనిసరి మాస్కులు, ఇలాంటి పరిస్థితుల్లో వీలైనంత వరకు ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రోడ్డుపైకి రాకుండా ఉండాలని,బయటికి వెళ్ళవలసి వస్తేతప్పనిసరిగా గొడుగులు ఉపయోగించాలని, మజ్జిగ ఎక్కువగా త్రాగాలని, చిన్న పిల్లలు బయటకు రాకుండా ఉండటం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## పెట్రోల్ బంక్ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అగ్ని మాపక సిబ్బంది శనివారం పోలీస్ పెట్రోల్ బంక్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ,భద్రత చర్యలపై ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదాలు సంభవించే పరిస్థితులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదం సంభవించి నప్పుడు తక్షణ చర్యలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగం వంటి అంశాలపై సిబ్బందికి ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. పెట్రోల్ బంక్‌లలో అత్యంత జాగ్రత్త అవసరమని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని అధికారులు సూచించారు. అత్యవసర సమయాల్లో ధైర్యంగా, సమర్థంగా స్పందించడం ద్వారా ప్రాణాలు మరియు ఆస్తులను కాపాడవచ్చని వివరించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఫైర్ సేఫ్టీ పరికరాల వినియోగంపై డెమో చూపించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు రామ్ నిరంజన్ రావ్, శేఖర్, ఆర్.ఎస్.ఐ లు, అగ్ని మాపక సిబ్బంది, పెట్రోల్ పంపు సిబ్బంది ఉన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన వెంకటేశ్వర్లు



**వరంగల్ ఎంజీఎం, ఏప్రిల్ 18(జనంసాక్షి):** తెలంగాణ కొటి రత్నాల వీణ అన్న మాటను నిజం చేస్తూ ఓరుగల్లు గడ్డపై మన వరంగల్ వాసి అలుపెరగని దీక్ష, అంకితభావం తోడైతే అసాధ్యం సుసాధ్యమని నిరూపిస్తూ, బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. వి. వెంకటేశ్వర్లు గిన్నిస్ వరల్డ్ రికార్డును కైవసం చేసుకున్నారు. "లాంగెస్ట్ కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లెసన్" విభాగంలో ఆయన సృష్టించిన ఈ ప్రభంజనం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నైజీరియా దేశం రికార్డు బద్దలు కొట్టి .. భారత దేశ చరిత్రలోనే సరికొత్త చరిత్ర సృష్టించిన మహా ఘనుడు! గతంలో ఈ విభాగంలో భారత్ పేరిట ఉన్న 48 గంటల రికార్డును, ఆ తదనంతరం నైజీరియా నెలకొల్పిన 62 గంటల రికార్డును అధిగమిస్తూ.. డా. వెంకటేశ్వర్లు ఏకంగా 64 గంటల 12 నిమిషాల పాటు నిరవధికంగా బోధించి గిన్నిస్ బుక్లో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. ఏప్రిల్ 12న ప్రారంభమైన ఈవిద్యా యజ్ఞం ఏప్రిల్ 15న విజయ వంతంగా ముగిసింది. విద్యావేత్తగా అద్భుత ప్రస్థానంకాకతీయ విశ్వవిద్యాలయం నుండి పీహెచ్ పొంది, యునైటెడ్ కింగ్డమ్లో పోస్ట్ డాక్టరల్ పరిశోధనలు చేసిన డా. వెంకటేశ్వర్లు, కేవలం ఒక ప్రొఫెసర్ మాత్రమే కాదు.. వేలాది మంది విద్యార్థులకు దిక్సూచి. ఈ ఘనత సాధించిన వ్యక్తి పిన్న మల్లేశం అల్లుడు కావడం విశేషం అన్నారు. వెంకటేశ్వర్లును సన్మంచినవాళ్లు పిన్న మల్లేశం ,భారత లక్ష్మి,పిన్న వినయ్ కుమార్-శ్రావణి,గాండ్ల పూర్ణ చందర్-రోజా రానీ పాల్గొన్నారు.


## శాఖాపరమైన అవసరాలకు వినియోగించాలి

- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్ ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ప్రభుత్వం అంగన్వాడి టీచర్లకు అందజేస్తున్న మొబైల్ ను శాఖాపరమైన అవసరాలకు మాత్రమే వినియోగించాలని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐసిడిఎస్ ఖానాపూర్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలోని కడెం, ఖానాపూర్, దస్తురాబాద్, పెంబి మండలాలకు సంబంధించి 237 అంగన్వాడీ కేంద్రాలకు 4-జి మొబైల్ లు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే 72 నూతన భవనాలకు నిర్మాణాలు చేపట్టామన్నారు. నిర్మాణాలలో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా చూడాలని అన్నారు. అవసరమైన అంగన్వాడీ కేంద్రాలకు ప్రహరీ కూడా నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అంగన్వాడీల సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో చేరేందుకు అందరు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో వర్తిస్తున్నప్పటికీ అవి ఆశించిన స్థాయిలో ప్రచారం జరగడం లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మంత్రి సీతక్క పై బి, బిజెపి పార్టీలు ఆరోపిస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఇలాంటి చర్యలు సరైనవి కావని బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు ఆయన చురకలు వేశారు. అంగన్వాడి కార్యకర్తలు ప్రభుత్వం సూచించిన సూచనలు పాటిస్తూ సమయపాలన తప్పకుండా పాటించాలని అన్నారు. ఎవరైనా అంగన్వాడీలను బ్లాక్ మెయిల్ కు గురి చేసినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఎవరిని ఉపేక్షించమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న ఖాళీలను త్వరితగతిన భర్తీ చేస్తామని, అర్హులైన వారికి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగల భూషణ్, వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, డి డబ్ల్యు ఓ వినూత్న, ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీలత, తహసిల్దార్ సుజాత రెడ్డి, ఎంపీడీవో రాధా రాథోడ్, కమిషనర్ సుందర్ సింగ్ లతోపాటు ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ట్రైబ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా రాథోడ్ రామారావు



**సారంగాపూర్, ఏప్రిల్ 18(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎస్టీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా ఎస్టీ యూనియన్ కార్యవర్గ ఏర్పాటు శుక్రవారం జరిగాయి. నిర్మల్ జిల్లా ఎస్టీ యూనియన్ అధ్యక్షులుగా రాథోడ్ రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైకోర్ట్ అడ్వకేట్ నునావత్ దేవిదాస్ నాయక్ నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికల్లో, సారంగాపూర్ మండలం సోనాపూర్ తాండకు చెందిన రాథోడ్ రామారావు అధ్యక్షులుగా బోరింగ్ తండాకు చెందిన చవాన్ ప్రకాష్ ఉపాధ్యక్షులు ఎన్నికయ్యారు.ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ, షెడ్యూల్ ట్రైబ్ సమాజ అభివృద్ధికి, బంజారా సంస్కృతి పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. సమాజ పురోగతికి తమ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆర్డీఓ



**దేవరకొండ, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** రైతు సోదరులు వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎస్ రమణ రెడ్డి తెలిపారు. మండలంలోని ముదిగొండ గ్రామపంచాయతీలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం వల్ల స్థానిక రైతులు తమ తమ వడ్లను సమీపంలోనే గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం సాధ్యమవుతుందఅన్నారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వ,సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు అగ్రికల్చర్ ఆఫీసర్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**దేవరకొండ, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణంలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో 2026-27 సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనవని కళాశాల ప్రిన్సిపాల్ డా.హరిప్రియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో బి.ఎ,బీకాం,బీఎస్సీ గ్రూపులో అడ్మిషన్స్ కోసం ఆసక్తి గలవారు తమ టెన్త్, ఇంటర్ మార్క్స్ మెమోలు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోస్ తో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. విశాలమైన భవనం, క్రీడా మైదానం, క్రీడా పరికరాలు, జిమ్ రూమ్, సెమినార్ హాల్, గ్రంథాలయం ,అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, కంప్యూటర్ ల్యాబ్స్,వైఫై సదుపాయం ,ఎన్ ఎస్ ఎస్ -శ్రీ ఒ శ్రీశ్రీ యూనిట్స్ ,ఎన్ సి సి , పీజీ కోచింగ్ క్లాసెస్ ,ప్రతి సంవత్సరం దాదాపు 100 మంది విద్యార్థినులు డిగ్రీ పట్టతో బయటకు వెళ్తున్నారని, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బి ౦౦ గ్రేడ్ తో కళాశాల నడుస్తున్నదని తెలిపారు. ఇట్టి అవకాశం నీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 9908330585 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## క్రమశిక్షణ, సమయపాలన ప్రతి పోలీసుకు తప్పనిసరి




**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** క్రమశిక్షణ, సమయపాలన ప్రతి పోలీసు కు తప్పనిసరి... శారీరకద్రుడత్వం , ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఏ ఆర్ డి ఎస్ పి రంగనాథ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో ఈ రోజు నిర్వహించిన పరేడ్ కార్యక్రమానికి ఏఆర్ డీఎస్పీ రంగా నాథ్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ సిబ్బందికి క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దృఢత్వం మరియు ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు. ప్రతి పోలీసు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం, చట్టాలపై అవగాహన కూడా అవసరమని పేర్కొన్నారు. చట్టం అందరికీ సమానంగా అమలులో ఉండేలా కృషి చేయాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవని హెచ్చరించారు. విధులను నిర్వర్తించే సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ జర్జ్, ఆర్ఐ లు శైలందర్, రామకృష్ణ, ఎసై లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో గల సాంఘీక సంక్షేమ బాలురు గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని కళాశాల ప్రిన్సిపాల్ బాలరాజు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల సీఓఈ,రెగ్యులర్ కళాశాల వృత్తి విద్యా కోర్సులు ఎంపిసి,బైపిసి, సిఈసి,యంఈసి కోర్సుల్లో అడ్మిషన్లు కోసం 2026 సంవత్సరం పదవతరగతి పరీక్ష రాసిన విద్యార్థులు టీజీఎస్ డబ్ల్యూ,ఆర్ జెసి,సెట్ - 2026 ఈ నెల 6వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని అన్నారు.దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మే 15వ తేదీన జరిగే పరీక్షకు హాజరు కావాలని అన్నారు.మరిన్ని వివరాల కోసం దగ్గరలో ఉన్న సాంఘీక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాల,కళాశాలను సంప్రదించాలని కోరారు.

## బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు

- **అప్రమత్తమైన డాక్యుమెంట్ రైటర్లు**
- **కీలక డాక్యుమెంట్లు, రికార్డుల పరిశీలించిన విజిలెన్స్ అధికారులు**



**బీబీనగర్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్? ఎన్‌ఫోర్స్?మెంట్ అధికారులు శనివారం ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. విజిలెన్స్? సీఐ దశరథ బృందం చేపట్టిన ఈ తనిఖీలలో కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులు, డాక్యుమెంట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయంలోని ఆస్తుల అమ్మకం, కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రికార్డుల నిర్వహణ విధానం, నిబంధనల అమలుపై సమగ్రంగా తనిఖీలు కొనసాగించారు. గతంలో ఏసిబి అధికారుల దాడులు, ప్రస్తుతం విజిలెన్స్? అధికారుల సోదాల నేపథ్యంలో కార్యాలయం పరిసరాల్లో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు అప్రమత్తమై తమ దుకాణాలను తాత్కాలికంగా మూసివేసారు. బీబీనగర్ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు తీవ్ర ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కార్యాలయం పై వరుస సోదాలు కొనసాగుతున్నాయి. గతంలో స్థానికులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారులపై ఎలాంటి చర్యలు లేకపోవడంపై ఆ సహనం వ్యక్తం చేస్తున్నారు. సోదాల్లో విజిలెన్స్? సీఐ దశరథతో పాటు ఎఫ్ఆర్ఓ మనోహర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- **జనగణన 2027 న్యూమరేటర్స్ సూపర్వైజర్స్ శిక్షణ పరిశీలన**
- **నూతనకల్ పిఎసిఎస్ కొనుగోలు కేంద్రం ప్రారంభం**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**నూతనకల్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** నూతనకల్ తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు శనివారం 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నూతనకల్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించినారు సాదా బైనమా దరఖాస్తులు క్రమబద్ధీకరణ ఫైల్స్ అన్నింటిని పారదర్శకంగా పూర్తి చేయుటకు ప్రతి లబ్ధిదారుని ఫైలు సమగ్రంగా విచారణ చేసి భూభారతి చట్టం- 2025 మరియు తదుపరి వచ్చిన జీవోల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సర్వే మరియు సరిహద్దుల చట్టం,1923 ప్రకారం రీ సర్వే మండలంలోని తొమ్మిది గ్రామాలలో నిర్వహిస్తున్నందున సీలింగ్ భూమిలో దీర్ఘకాలంగా అనుభవదారుగా ఉండి కొనుగోలు చేసిన రైతులందరికీ పట్టాలు మంజూరీ చేయుటకు ప్రభుత్వ ఆదేశముల ప్రకారం వెంటనే రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. శ్రీరామ ఎల్లమ్మ, భర్త నర్సయ్య ఎర్రపహాడ్ గ్రామ వాసి 2009 లో సర్వే నెంబరు 92 లో ఎకరం భూమిని కొనుగోలు చేసి సాదా బైనమా దస్తావేజు క్రమబద్ధీకరణ కొరకు 2020లో దరఖాస్తు చేసుకున్నారు క్రమబద్ధీకరణ ఫైలు పెండింగ్‌లో ఉన్నందువలన తహసిల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ని కలవగా వెంటనే ఆమె ఫైలు ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేయుటకు సిబ్బందిని ఆదేశించారు జనగణన 2027 శిక్షణా కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతనకల్ నందు జరుగుతున్నందున అక్కడికి హాజరై జనగణన నిర్వహించే న్యూమరేటర్స్ మరియు సూపర్వైజర్స్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మొదటగా హౌస్ లిస్టింగ్ చేయవలసి ఉన్నందున ఏ ఒక్క గృహము వదిలిపెట్టకుండా సిఎంఎంస్ పోర్టల్ నందు మొబైల్ అప్లికేషన్ ద్వారా పూర్తి చేయాలని ఆదేశించారు పిఎసిఎస్ సెంటర్ నూతనకల్ ప్రారంభించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తాలు లేకుండా ధాన్యమును తీసుకురావాలని కొనుగోలు పూర్తి చేసి వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాలలో నగదు జమ అయ్యేటట్లుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఏఎంసీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో సునీత సర్పంచులు జటంగి సరితా కృష్ణ, మహేశ్వరం మల్లికార్జున్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి,రెవెన్యూ సిబ్బంది, పిఎసిఎస్ సీఈఓ సంపేట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జనగణన నిర్వహణపై శిక్షణ



**బీబీనగర్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఎంపీడిఓ కార్యాలయంలో జన గణన మొదటి దశ శిక్షణ తరగతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ భాస్కర్ రావు శిక్షణ ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 50 మంది ఎనుమరేటర్లు, సూపర్వైజర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అందరూ జనగణన పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ సురేష్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పోచంపల్లిలో ఘనంగా భూదాన్ జయంతి వజ్రోత్సవాలు



**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** భూదాన్ ఉద్యమ చరిత్రలో అపూర్వ స్థానాన్ని సంపాదించిన ప్రథమ భూదాత వేదిరే రామచంద్రారెడ్డి స్మరణలో పోచంపల్లిలో భూదాన్ జయంతి వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వినోబా భావే సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదిరే రామచంద్రారెడ్డి సేవలను ప్రత్యేకంగా స్మరించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హాజరై, వేదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచంపల్లిలోనే వేదిరే రామచంద్రారెడ్డి తన భూమిని స్వచ్ఛందంగా పేదలకు దానం చేయడం ద్వారా భూదాన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆయన చేసిన ఆ ఒక్క నిర్ణయం దేశవ్యాప్తంగా ఒక మహత్తర సామాజిక ఉద్యమానికి దారితీసిందని పేర్కొన్నారు. ఆయన చూపిన దారిలోనే ఆచార్య వినోబా భావే భూదాన్ ఉద్యమాన్ని దేశమంతా విస్తరింపజేశారని అన్నారు. రామచంద్రారెడ్డి చేసిన భూదానం కేవలం ఒక దానం మాత్రమే కాకుండా, సామాజిక సమానత్వానికి నాంది పలికిన చారిత్రాత్మక ఘటనగా నిలిచిందని కొనియాడారు. గ్రామీణ పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన చేసిన త్యాగం నేటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణంలో వేదిరే రామచంద్రారెడ్డి పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కమిటీ చైర్మన్ ఎమ్. కోదండ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్, వినోబా భావే ఆశ్రమం అధ్యక్షులు రమేష్ బాయ్, భూదాన్ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజనీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు భారత లవ కుమార్, పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్ రెడ్డి, తడక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**చేవెళ్ల, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** అన్ని వర్గాల ప్రజల సక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం లక్షమని, అన్ని వర్గాలకు చేయూతనిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాబాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే యాదయ్య అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నారని అన్నారు. పేద కుటుంబల్లో కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ పథకం వరం లాంటిందన్నారు. ప్రజలందరు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.కృష్ణయ్య, మ ఎన్సిపల్ చైర్పర్సన్ దేవర సమతావెంకటే రెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు బండారు శైలజాఆగి రెడ్డి, తాళ్ళ పల్లి నర్సింహులు, శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, సర్పంచులు మాధవిరామ్ రెడ్డి, మల్లా రెడ్డి, మడల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, గుండాల రాములు, టేకులపల్లి శ్రీనివాస్, లియాగత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు, మహిళలు తదితరులు ఉన్నారు.

## మెదక్‌లో రోడ్డు భద్రతా చైతన్య రథం ప్రారంభం



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణకు మెదక్ జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభించిన చైతన్య రథం జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించనుందని, ముఖ్యంగా జనసంచారం అధికంగా ఉండే జంక్షన్‌లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు దాటడం, వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించడం, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం వంటి అంశాలపై ప్రజలకు వివరణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎఆర్ డియస్పి రంగా నాథ్, సీఐ లు మహేష్, జర్జ్, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఆర్ఐ లు శైలందర్, రామకృష్ణ, ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

- **బాలికల విద్యను ప్రోత్సహించాలి**
- **జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు**

**సూర్యాపేట, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** బాల్య వివాహాలను నిర్మూలించి బాలికల విద్యను ప్రోత్సహించాలని సూర్యాపేట జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ రావు అన్నారుశనివారం కలెక్టరేట్‌లో ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సహకారంతో రూపొందించిన బాల్య వివాహాల నిర్మూలన గోడ పత్రికను సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ రమణారావు, డీసీపీవో బి.రవికుమార్, సిడబ్ల్యూసి మెంబర్స్ తో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.ఆడుకోవాల్సిన వయసులో అత్తారింటి బాధ్యతలు మోపడం వల్ల బాలికలు తమ వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారని అన్నారు.బాల్య వివాహాల వల్ల కలిగే శారీరక నష్టాలను శాస్త్రీయంగా వివరించారు. 18 ఏళ్లు నిండని బాలికల గర్భాశయం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందదని,ఈ స్థితిలో గర్భం దాల్చడం వల్ల ప్రసవ సమయంలో తల్లి లేదా బిడ్డప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. సరైన శారీరక పరిపక్వత లేని తల్లులకు పుట్టే పిల్లలు తక్కువ బరువు, శారీరక లోపాలతో పుట్టే అవకాశం ఉంది.చిన్న వయసులో లైంగిక వేధింపులు, గృహహింస ఎదుర్కోవడం వల్ల వారు తీవ్రమైన కుంగుబాటుకు లోనవుతారని అన్నారు. కేవలం పెళ్లిళ్లను అపడమే కాకుండా, ఆడపిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆడపిల్లల పట్ల వివక్షను వీడాలని, వారిని చదివించి సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టాలని ఆకాంక్షించారు.ఎక్కడైనా చిన్నపిల్లలకు పెళ్లి చేస్తున్నట్లు తెలిస్తే



వెంటనే చైల్డ్ లైన్ 1098కి లేదా పోలీస్ 100 కి సమాచారం అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి సభ్యులు టీ.నాగరాజు, రాంరెడ్డి, ధనమ్మ, డిసిపియు సభ్యులు మీరా, ఎయిడ్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ , సోషల్ వర్కర్ శ్రీలక్ష్మి, వగ్గు సోమన్న, సఖి సెంటర్ సభ్యులు అశ్విని, ఎలిశమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**కొండమల్లేపల్లి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నల్లగొండ జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం వారు కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఔట్ పేషెంట్ రికార్డులు, ల్యాబ్, ఫార్మసీ, పలు విభాగాలను వైద్య సేవలు అందించే అన్ని వార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని గాజీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్తగా టీబి పరీక్షలు చేయడానికి వచ్చిన ఏఐ టిబి ఎక్సరే మిషన్ ద్వారా టీబి లక్షణాలు వారికి పరీక్షలు చేసే విధానాన్ని స్థానిక వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రాహుల్, మండల వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, సిహెచ్ఓ సుగుణభాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోర్టును తనిఖీ చేసిన జిల్లా పోక్సో కోర్ట్ ప్రత్యేక న్యాయమూర్తి



**దేవరకొండ, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా పోక్సో కోర్ట్ ప్రత్యేక న్యాయమూర్తి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్ రావు శనివారం దేవరకొండ న్యాయస్థానంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టును తనికి చేశారు. ఈ సందర్భంగా వారు న్యాయస్థానం ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అనంతరం చెట్లను నాటారు. అసోసియేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నల్లగొండ జిల్లా పోక్సో కోర్ట్ ప్రత్యేక న్యాయమూర్తి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్ రావు మాట్లాడుతూ న్యాయవాదులు ఈ ప్రాంత పరిధిలోనీ కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని,కక్షిదారులకు న్యాయం జరిగేలా ప్రతి ఒక న్యాయవాదులు పనిచేసి పెండెన్సి తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కె.వి.ఎస్ హరీష్ బాబు , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్నేహ , డి ఎస్ పి శ్రీనివాసరావు, సిఐ వెంకట్ రెడ్డి , బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సన్నాయిల ఉమామహేశ్వర్, వనం జగదీశ్వర్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, నెమ్మికంటి గౌరీ శంకర్, ఏ జి పీ నెమ్మికంటి రమాశంకర్, ఎండి శోకత్ అలీ, ఇంద్రవరప్రసాద్, ఈ . రవి, సి హెచ్ అశోక్, ఎస్ శ్రీకాంత్, జె ఇద్దయ్య, గణేష్, ఆంజనేయులు, ఏ కృష్ణ, కే సురేష్, బి సాయి, ఎన్ చంద్రశేఖర్, రాజకుమార్, రమేష్, శివ, సూపర్టెండెంట్లు అజార్ అలీ, సరిత, గిరిధర్ కోర్టు సిబ్బంది, కోర్టు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.




# పసిడి దిగుమతులు పైపైకి..

## 2025-26లో రూ.6.65 లక్షల కోట్లకు

### ఇది ఆల్‌టైం గరిష్ఠ స్థాయి

**న్యూఢిల్లీ:**అంతర్జాతీయంగా ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, దేశంలో బంగారం దిగుమతులు సరికొత్త రికార్డులు సృష్టించాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో పసిడి దిగుమతులు 24 శాతం మేరకు పెరిగి జీవన కాల గరిష్ఠ స్థాయి అయిన రూ.6,65,815 కోట్లకు (71.98 బి.డాలర్లు) చేరుకున్నాయి. పసిడి ధరలు విపరీతంగా పెరగడమే ఈ స్థాయిలో దిగుమతుల విలువకు ప్రధాన కారణం.

4.76 శాతం క్షీణతతో

విలువ పరంగా పసిడి దిగుమతులు పెరిగినప్పటికీ, పరిమాణ పరంగా చూస్తే దిగుమతులు క్షీణించడం గమనార్హం. 2024-25లో 759.09 టన్నులుగా ఉన్న బంగారం దిగుమతులు 2025-26 నాటికి 4.76 శాతం క్షీణించి 721.03 టన్నులకు పడిపోయాయి. కానీ, బంగారం ధర కిలోకు సుమారు రూ.70.87 లక్షల నుంచి ఏకంగా రూ.92.33 లక్షలకు పెరగడం వల్లే దిగుమతుల విలువ భారీగా పెరిగిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరాల్లో పసిడి దిగుమతుల విలువను పరిశీలిస్తే.. 2024-25లో రూ.5.36 లక్షల కోట్లు, 2023-24లో రూ.4.21 లక్షల కోట్లు, 2022-23లో రూ.3.23 లక్షల కోట్లుగా నమోదైంది. దేశ మొత్తం దిగుమతులలో పసిడి వాటా ఏకంగా 5 శాతానికి పైగా ఉండటం విశేషం.



### వెండి దిగుమతులూ..

పసిడితోపాటే వెండి దిగుమతులూ భారీగా పెరిగాయి. అధిక ధరల కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో వెండి దిగుమతులు 150% పెరిగి, రూ.1.11 లక్షల కోట్లకు చేరాయి. పరిమాణం పరంగా చూస్తే, ఇది 42 శాతం పెరిగి 7,334.96 టన్నులుగా నమోదైంది. ఈ విలువైన లోహాల దిగుమతులు పెరగడంతో 2025-26లో దేశ వాణిజ్య లోటు ఏకంగా రూ.30.82 లక్షల కోట్లకు (333.2 బి.డాలర్లు) పెరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి.

**స్విట్జర్లాండ్ నుంచే అత్యధికం..**

చైనా తర్వాత ప్రపంచంలో రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా భారత్ నిలుస్తోంది. దేశీయ ఆభరణాల పరిశ్రమ గిరాకీని తీర్చేందుకు దిగుమతులు అవసరం అవుతున్నాయి. మన దేశానికి దిగుమతి అవుతున్న బంగారంలో అత్యధికంగా 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే వస్తోంది. ఆ తర్వాతి స్థానాల్లో యూఏఈ, దక్షిణాఫ్రికా ఉన్నాయి. 2025-26లో స్విట్జర్లాండ్ నుంచి జరిగిన మొత్తం దిగుమతులు 11.36 శాతం పెరిగి రూ.2.24 లక్షల కోట్ల (24.27 బి.డాలర్లు)కు చేరుకున్నాయి.

## రూ.2.03 లక్షల కోట్లకు భారత డిజిటల్ ప్రకటనల మార్కెట్

### 2030పై రెడ్‌సీర్ నివేదిక అంచనా

దిల్లీ: భారత డిజిటల్ ప్రకటనల మార్కెట్ రాబోయే అయిదేళ్ల కాలంలో రూ.2.03 లక్షల కోట్లకు (22 బి.డాలర్లు) చేరుకుంటుందని మార్కెట్ పరిశోధన సంస్థ రెడ్‌సీర్ అంచనా వేసింది. 2025 నాటికి సుమారు రూ.1.01 లక్షల కోట్లుగా ఉన్న భారత డిజిటల్ యాడ్ మార్కెట్, ఏటా 10-15 శాతం వృద్ధితో చెందుతోందని పేర్కొంది. సాధారణ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కంటే డిజిటల్ ప్రకటనల వ్యయం అత్యంత వేగంగా పెరుగుతోందని నివేదిక వెల్లడించింది. 2025లో మొత్తం అంతర్జాతీయ ప్రకటనల వ్యయంలో డిజిటల్ రంగం వాటా 70-75% ఉందని తెలిపింది. ఇది ప్రపంచ జీడీపీ వృద్ధి రేటుకంటే 3-5 రెట్లు అధిక వేగంతో వృద్ధి చెందుతోందని పేర్కొంది.ఇది ప్రపంచ జీడీపీ వృద్ధి రేటుకంటే 3-5 రెట్లు అధిక వేగంతో వృద్ధి చెందుతోందని పేర్కొంది.2025లో ప్రపంచ డిజిటల్ ప్రకటనల వ్యయంలో 46% వాటాతో అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతోంది. 24 శాతంతో చైనా రెండో స్థానంలో ఉంది. ఇందులో భారత వాటా ప్రస్తుతం సుమారు 1 శాతంగా మాత్రమే ఉందని నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచ డిజిటల్ ప్రకటనల మార్కెట్ 2030 నాటికి 1.2 ట్రిలియన్ డాలర్లను (సుమారు రూ.111 లక్షల కోట్లు) దాటనుందని అంచనా వేసింది.

## 18 శాతం పెరిగిన కాగ్నిజెంట్ సీఈఓ వేతనం



**న్యూఢిల్లీ:**ప్రముఖ ఐటీ సేవల కంపెనీ కాగ్నిజెంట్ సీఈఓ రవికు మార్ 2025 ఆర్థిక సంవత్సరంలో 10.7 మిలియన్ డాలర్ల వేతనాన్ని అందుకున్నారు. అమెరికాకు చెందిన స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ విషయాన్ని కంపెనీ వెల్లడించింది. 2024తో పోలిస్తే ఆయన వేతనం 18 శాతం పెరగడం గమనార్హం. వాస్తవానికి సీఈఓ రవికుమార్‌కు ఇవ్వాల్సిన వేతనం 19 మిలియన్ డాలర్లు మాత్రమే. కానీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఆయన వేతనాన్ని 21.5 మిలియన్ డాలర్లుగా కాగ్నిజెంట్ పేర్కొంది. స్టాక్ యూనిట్ల రూపంలోనే అధిక వేతనాన్ని ప్రకటించింది. భవిష్యత్తులో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నదాని ఆధారంగా ఈ మొత్తం సర్దుబాటు అవుతుంది. కాగా, 2024తో పోలిస్తే ఆయన మూల వేతనం 8% పెరిగి 1.3 మిలియన్ డాలర్లకు చేరింది. పరిమిత స్టాక్ అవార్డు కింద 4.99 మిలియన్ డాలర్లు, వార్షిక నగదు ప్రోత్సాహం ద్వారా 4.99 మిలియన్ డాలర్ల వేతనాన్ని కంపెనీ అందించింది. ప్రముఖ టెక్ సంస్థ ఇన్ఫోసిస్‌లో సుదీర్ఘకాలం పనిచేసిన తర్వాత 2023లో రవికుమార్ కాగ్నిజెంట్‌లో చేరారు. గతేడాది కాగ్నిజెంట్ ఆదాయం 19.7 బిలియన్ డాలర్ల నుంచి 21.1 బిలియన్ డాలర్లుకు చేరింది. ఈ ఏడాదిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామిగా ఎదగాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

## 8వేల మంది ఉద్యోగుల తొలగింపు..!

**మెటాలో భారీ లేఆఫ్‌లు..**

ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ఈ ఏడాదిలో భారీ లేఆఫ్‌లకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దాదాపు 8 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు కంపెనీ వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థ సిబ్బందిలోని దాదాపు 20 శాతం మందిని తొలగించాలని మెటా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తొలి దశలో భాగంగా మే 20న ఉద్యోగుల తొలగింపులు ఉండనున్నట్లు కంపెనీ వర్గాలు పేర్కొన్నాయని సదరు కథనాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల్లో దాదాపు 10 శాతం అంటే.. 8వేల మందికి లేఆఫ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపాయి. ఈ ఏడాది చివర్లో మరింతమంది ఉద్యోగులను తొలగించేందుకు కంపెనీ ప్రణాళిక రచిస్తుందని పేర్కొన్నాయి. అయితే, అది ఎప్పుడు, అందులో ఎంతమందిని తొలగిస్తారనే విషయాలు ఇంకా ఖరారు కాలేదని పేర్కొన్నాయి. దీనిపై మెటా నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇదే నిజమైతే.. 2022-2023 తర్వాత కంపెనీ చేపట్టబోయే అతిపెద్ద తొలగింపులు ఇవే కానున్నాయి. 2022 చివర్లో 11 వేల మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. ఆ తర్వాతి ఏడాదే 10వేల మందిని విధుల్లో నుంచి తీసేసింది. మెటా ప్రస్తుతం ఏఐ రంగంలో విస్తృతంగా పెట్టుబడులు పెడుతోంది. ఇందులోభాగంగా 2028 నాటికి డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 600 బిలియన్ డాలర్లు వెచ్చించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కంపెనీ ఇటీవల వెల్లడించింది.

## అక్షయ తృతీయ స్పెషల్..

### రూ.50 వేల వరకు ఆఫర్లతో ఓలా సోనా వీకెండ్


అక్షయ తృతీయ సందర్భంగా ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ 'ఓలా సోనా వీకెండ్' (రాశ్రీజీ రానీనిజీ లివవనివనిట)ను ప్రకటించింది. తమ పోర్ట్‌ఫోలియోలోని అన్ని వాహనాలపై రూ.50 వేల వరకు డిస్కౌంట్‌ను అందిస్తోంది. కొత్త వాహనాల కొనుగోలుపై రూ.40 వేల వరకు ప్రయోజనాలతో పాటు బ్యాంకు ఆఫ్ బరోడా, స్కాపియా ఫెడరల్, యస్ బ్యాంకు, ఐబీఎఫ్‌సీ, హెచ్‌ఎస్‌బీసీ క్రెడిట్ కార్డు వినియోగదారులకు రూ.10 వేల అదనపు డిస్కౌంట్ అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఆఫర్లు ఈ శని, ఆదివారం మాత్రమే అందుబాటులో ఉంటాయి.



## రద్దు చేసిన నోట్ల మార్పిడికి ఆర్‌బీఐ కొత్త రూల్స్ తెచ్చిందా?

**న్యూఢిల్లీ:**రద్దయిన పాత కరెన్సీ నోట్లు మార్చుకోవడానికి అనుమతిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్గదర్శకాలు ఇచ్చిందంటూ కొన్ని కథనాలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న వార్తలు తప్పని స్పష్టంచేసింది. దీనికి సంబంధించి ఆర్‌బీఐ ఎలాంటి నిబంధనలూ జారీ చేయలేదని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పేర్కొంది. కచ్చితమైన, ధ్రువీకరించిన సమాచారం కోసం ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించింది. ఏవైనా అనుమానాస్పద మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు ప్రజల దృష్టికి వస్తే పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగానికి పంపాలని విజ్ఞప్తి చేసింది. వాట్సప్ నంబర్ +91 8799711259, లేదా ఈ-మెయిల్ చేయొచ్చని సూచించింది.




# ముకేశ్ అంబానీని వెనక్కినెట్టి అదానీ అగ్రస్థానానికి

## ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్థానం పదిలం



**న్యూఢిల్లీ:**ఆసియాలో సంపన్న వ్యక్తిగా అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ నిలిచారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం దక్కించుకున్నారు. అదానీ గ్రూప్‌నకు పోర్టుల నుంచి ఇంధనం వరకు ఉన్న కంపెనీల షేర్లు దూసుకెళ్లడంతో ఆయన సంపద భారీగా పెరిగింది. తాజా బిలియనీర్ల ర్యాంకింగ్స్ ప్రకారం.. గౌతమ్ అదానీ నికర సంపద విలువ 92.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.4 లక్షల కోట్లు). ముకేశ్ అంబానీ సంపద విలువ 90.8 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.2 లక్షల కోట్లు)గా ఉంది. దీంతో భారత్, ఆసియాలో అత్యంత సంపన్నుడిగా గౌతమ్ అదానీ నిలిచారు. ప్రపంచంలో టాప్-500 కుబేరులను వెల్లడించే బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీలో అదానీ ప్రస్తుతం 19వ స్థానంలో ఉన్నారు.అదానీ సామ్రాజ్యం ఇలా:దేశంలో అతిపెద్ద ప్రైవేట్ ఓడరేవుల నెట్‌వర్క్, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిదారు, ప్రైవేట్ విమానాశ్రయాల ఆపరేటర్‌గా అదానీ గ్రూప్ సంస్థలు ఉన్నాయి. వీటిని గౌతమ్ అదానీ ముందుండి నడిపిస్తున్నారు. ప్రపంచంలో అతిపెద్ద బొగ్గు వ్యాపారుల్లో ఆయన ఒకరు. అదానీ గ్రూప్‌నకు చెందిన 10 నమోదిత కంపెనీల్లో ఆయనకు ఉన్న వాటాల ద్వారానే ఈ సంపద వచ్చింది.

అగ్రస్థానంలో రెండోసారి:ఇంధనం, టెలికాం, రిటెయిల్ రంగాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ విస్తరించింది. ఈ గ్రూప్ కంపెనీల సంపద వృద్ధి మోస్తరుగా ఉండటంతో తాజా ర్యాంకింగ్స్‌లో మార్పులు జరిగాయి. 2022 ఫిబ్రవరిలో మొదటిసారి అంబానీని అదానీ వెనక్కి నెట్టారు. అంతక్రితం దశాబ్దానికి పైగా దేశంలోనే అత్యంత ధనవంతుడిగా అంబానీయే ఉన్నారు. అయితే అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత అదానీ గ్రూప్ షేర్లు పతనమవ్వడంతో అంబానీ మళ్లీ అగ్రస్థానానికి వచ్చారు. మౌలిక సదుపాయాల విస్తరణ, ఇంధన రంగంలో వృద్ధి కారణంగా అదానీ షేర్లు మళ్లీ పుంజుకున్నాయి. దీంతో తాజాగా అదానీ మళ్లీ అగ్రస్థానం దక్కించుకున్నారు.

**భారత్ నుంచి ఇద్దరే:**

ప్రపంచంలో టాప్-50 సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకున్న భారతీయులు అదానీ(19వ ర్యాంకు), అంబానీ(20) మాత్రమే. మన దేశం నుంచి 200 బిలియన్ డాలర్లకు పైగా మార్కెట్ విలువ కలిగిన తొలి తరం వ్యాపారవేత్తగా గౌతమ్ అదానీ రికార్డు సృష్టించారు.

**ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్:** ప్రపంచంలో అత్యంత ధనవంతుడుగా టెస్లా, స్పేస్‌ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ నిలిచారు. ఆయన సంపద 656 బిలియన్ డాలర్లు. రెండో స్థానంలో ఆల్ఫాబెట్/గూగుల్ వ్యవస్థాపకుడు లారీ పేజ్ (286 బి.డాలర్లు), మూడో స్థానంలో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ (269 బి.డాలర్లు) ఉన్నారు.

## జగిత్యాల నుంచి బీఆర్‌ఎస్ జైత్రయాత్ర

ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ - పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాను పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్‌ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్‌ఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు.

**డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు**

నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్‌లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్‌ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తంచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24? స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

## భూముల మార్కెట్ విలువ పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు

త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమ్మర్ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదు లను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యా దులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

**వరంగల్ ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన: పొంగులేటి**

వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలో ప్రతిపాదిత భూమి అనువుగా లేదని విమానయాన శాఖ తెలిపింది. అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.

## పులి బయటకు వస్తే దాని సంగతి చెబుతాం


లీడర్స్ అని ఆక్షేపించారు. మతాల మధ్య చిచ్చు, కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు ఏం తెలియదని సెటైర్లు గుప్పించారు. కర్ణాటక ఎంపీ తెలంగాణను కించపరిస్తే రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిద్రపోయారా..? అని ధ్వజమెత్తారు. నలభై ఏళ్లలో కిషన్‌రెడ్డి ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా..? అని ప్రశ్నించారు.మహిళా సాధికారతపై కాంగ్రెస్, బీజేపీకి చాలా తేడా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తొలి మహిళా ప్రధాని, రాష్ట్రపతిని చేసింది కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. సోమవారం మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని.. కానీ ఈ బిల్లు ముసుగులో మోదీ ప్రభుత్వం డీ లిమిటేషన్ చేయాలనే ప్రయత్నం చేసిందని ఆగ్రహించారు. అక్రమంగా బిల్లును పాస్ చేయాలని కుట్ర చేశారని ఆరోపించారు. ఈ బిల్లు వీగిపోవడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చెంపపెట్టు లాంటిదని విమర్శించారు. అహంకారంతో ఉంటామంటే నిన్నటిలా జరుగుతుందని అన్నారు. ఉత్తర భారతదేశానికి ఎక్కువ సీట్లు ఇచ్చే ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని చెప్పుకొచ్చారు. బీజేపీ నియంతృత్వ పోకడకు చెక్ పడిందన్నారు. ఈ బిల్లు వీగిపోవాలనే డీ లిమిటేషన్‌తో ముడిపెట్టారని తెలిపారు. తెలంగాణలో రెడ్డి ముఖ్యమంత్రి బీసీ కుల గణన చేశారని పేర్కొన్నారు. కిషన్‌రెడ్డికి మహేశ్ కుమార్ గౌడ్ సవాలు విసిరారు. జై శ్రీరామ్ అనకుండా కిషన్‌రెడ్డి గెలవగలరా..? అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తే మిషన్ రెడ్డికి శ్రీరాముడు కావాలని విమర్శించారు. జై శ్రీరామ్ అనకుండా తాను చేసిన అభివృద్ధిపై ప్రచారం చేసి కిషన్‌రెడ్డి గెలవగలరా..? అని నిలదీశారు. జై శ్రీరామ్ అనకుంటే బీజేపీకి మనుగడ లేదని అన్నారు. దేవుడి పేరు చెబితే ఓట్లు రాలే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తేజస్వీ చిన్న పిల్లోడని మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. తేజస్వీ దేవుడి పేరు చెప్పుకొని గెలిచిన వారని విమర్శించారు. ఆయన యాక్సిడెంటల్‌గా ఎంపీ అయ్యారని ఎద్దేవా చేశారు. కర్ణాటక గురించే తేజస్వికి ఏమాత్రం తెలియదని అన్నారు. తెలంగాణ గురించి తేజస్వికి ఏం తెలుసని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లను బీసీలకు ఇచ్చామని స్పష్టం చేశారు.

## అమెరికా యుద్ధ విమానాన్ని నడిపిన ఐఏఎఫ్ చీఫ్

**వాషింగ్టన్:**అమెరికా పర్యటన సందర్భంగా భారత వైమానిక దళం చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ ఎఫ్-15 ఈఎక్స్ ఈగల్-ఎఎ యుద్ధ విమానాన్ని నడిపారు. నెవడా వైమానిక స్థావరంలో యూఎస్ వైమానిక దళ మేజర్ మాథ్యూ బెన్సన్‌తో కలిసి అమర్ ప్రీత్ సింగ్ యుద్ధ విమానాన్ని నడుపుతున్న ఫొటోలు తాజాగా బయటకు వచ్చాయి. ఎఫ్-15ను నడపడం ద్వారా ఆ విమాన సామర్థ్యాలను, ఆధునిక యుద్ధాల్లో దాని పాత్రను అమర్ ప్రీత్ సింగ్ మరింత అర్థం చేసుకోగలిగారని అమెరికా సైనిక అధికారులు వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా ఐఏఎఫ్ చీఫ్.. అమెరికా వైమానిక దళ యుద్ధ కేంద్రం కమాండర్ బ్రిగేడియర్ జనరల్ డేవిడ్ సి ఎప్పర్సన్‌తో సహా ఆ దేశ వైమానిక దళంలోని సీనియర్ అధికారులతో చర్చలు జరిపారు. ఏప్రిల్ 10న జరిగిన ఈ భేటీలో ఇరుదేశాల వైమానిక దళాల మధ్య సంయుక్త విన్యాసాలను విస్తరించడం, అధునాతన సాంకేతికతలు, యుద్ధ వ్యవస్థలపై



పరస్పర అవగాహనను పెంచుకోవడం వంటి వాటిపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. భారత వైమానిక దళం మరిన్ని ఆధునిక ఆయుధాలను పొందే ప్రయత్నాలకు తమ వైమానిక దళం మద్దతుగా ఉంటుందని యూఎస్ జనరల్ విల్స్‌బాచ్ పేర్కొన్నారు. అమెరికా వద్ద ఉన్న అత్యాధునిక యుద్ధ విమానాల్లో ఎఫ్-15 ఈఎక్స్ ఈగల్-ఎఎ ఒకటి. దీనిని బోయింగ్ సంస్థ తయారుచేసింది. ఇరాన్‌పై దాడులు చేయడానికి అగ్రరాజ్యం ఈ విమానాలనే వినియోగించింది. ఈ విమానం మాక్ 2.5 గరిష్ట వేగంతో ప్రయాణిస్తుంది. 13,381 కిలోగ్రాముల వరకు పేలోడ్‌ను మోయగలదు.



# మేలో... మరో పోరు

## జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు రంగం సిద్ధం

- రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు..
- ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఉత్తర్వులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** రాష్ట్రంలో జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలు (జడ్పీటీసీ), మండల ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల (ఎంపీటీసీ) ఎన్నికలకు రంగం సిద్ధమవుతుంది. ఓటర్ల జాబితా లను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిస్థితులన్నీ అనుకూలిస్తే మే నెలలో ఎన్నికలు జరిగే అవకాశముంది.

10.7.2025 నుండి 05.2.2026 వరకు కేంద్ర ఎన్నికల సంఘం నవీకరించిన జాబితాలో నియోజక వర్గాల్లోని అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి, వాటిని సంబంధిత పంచాయతీ, పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న జాబితా లకు జత చేయాలని హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి మినహా అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.వీటి ఆధారంగా ఎంపీటీసీ,జడ్పీటీసీల పరిధిలోని గ్రామపంచా యతీలు, పోలింగ్ స్టేషన్ల వారీగా కొత్త జాబి తాలు రూపొందించాలని తాజాగా ఉత్తర్వులు జారిచేసింది. ఈ జాబితాలను జిల్లా పంచాయతీ అధికారి ధ్రువీకరణ తర్వాత,సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) యూజర్ మాన్యువల్ సూచనల ప్రకారం పోలింగ్ కేంద్రాలకు అనుసంధానించాల న్నారు.ఆ డేటాలో ఏవైనా వ్యత్యాసా లున్నట్లు గమనిస్తే వాటిని ఈ నెల 23 లోపు ఎన్నికల సంఘానికి నివేదించాలని సూచించింది. వాటిని ఆమోదించిన తర్వాత ముసాయిదా జాబితాలను గ్రామాల వారీగా విడుదల చేస్తారు. అభ్యంతరాలు, సలహాలు,సూచనలు పరి గణనలోకి తీసుకొని తుది జాబితా విడుదల చేయనున్నారు.అనంతరం పోలింగ్ కేంద్రాలు,బ్యాలెట్ బాక్స్ లు,ఇతర ఏర్పాట్లు చేయనున్నారు.

**566 జడ్పీటీసీలు, 5,773 ఎంపీటీసీలు..**

తాజాగా మళ్లీ వచ్చే ఎన్నికల కోసం ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల జాబితాను రూపొందించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించింది. మొత్తం 566 జడ్పీటీసీ స్థానాలు, ఆ మేరకు మండల ప్రజాపరిషత్ చైర్పర్సన్లు (ఎంపీపీ), 5,778 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. మేడ్చల్–మల్కా జిగిరిని అర్బన్ జిల్లాగా మార్చడంతో జిల్లా పరిషత్ల జాబితా నుంచి దానిని తొలగించగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 31 జిల్లా పరిషత్ లున్నాయి.

2019 తర్వాత పురపాలికలు, నగరపాలికల్లో చాలా గ్రామ పంచాయతీలు విలీన మయ్యాయి.దీంతో గ్రామాల సంఖ్య తగ్గుదల కారణంగా 44 ఎంపీటీసీలు, నాలుగు జడ్పీటీసీ, నాలుగు ఎంపీపీ స్థానాలు తగ్గాయి. మే నెలలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు రానున్న క్రమంలో గ్రామాల్లో మళ్లీ ఎన్నికల కోలాహలం కనబడనుంది.

### గత సెప్టెంబరులో ప్రక్రియ చేపట్టినా...

ఎంపీటీసీ,జడ్పీటీసీలకు చివరిసారిగా 2019 మే 6,10, 14 మూడు విడుతలలో ఎన్నికలు జరిగిన వెంటనే ఫలితాలు ప్రకటించారు. జూన్‌లో ఎంపీపీ,జడ్పీ చైర్పర్సన్లను ఎన్నుకున్నారు. గత ఏడాది జూన్‌తో వారి పదవీకాలం ముగిసింది.నాటి నుండి ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. వాస్తవానికి రెండు దశల్లో జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు గత సెప్టెంబరు 29 న ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా నామినేషన్ల స్వీకరణ మొదలైంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన పిటిషన్ విచారణ సందర్భంగా గత అక్టోబరు 9న రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత హైకోర్టు అనుమతితో గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వ హించారు. రిజర్వేషన్ల విధానాన్ని ప్రకటించిన తర్వాత దానికి అనుగుణంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సైతం హైకోర్టు అనుమతితో మే నెలలో నిర్వహించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

## రోడ్ సేఫ్టీ పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ ప్రశంసలు

- సర్టిఫికెట్లు అందించి అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** జాతీయ రహదారి భద్రతా (రోడ్ సేఫ్టీ) మాసోత్సవాల సందర్భం లో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు.జాతీయ రహదారి భద్రతా (రోడ్ సేఫ్టీ) మాసోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆద్వర్యంలో ఈ ఏడాది జనవరి 1 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు చేయించారు.

అలాగే జిల్లాలోని పలు విద్యాసంస్థల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై వ్యాస రచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా, పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు.ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా



సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం జిల్లా కలెక్టర్ అభినందించారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై కుటుంబ సభ్యులకు, సమీప ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, వివిధ పాఠశాలల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా పథకం.. రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం

- రైతు భరోసా విడుదల, బహిరంగ సభను విజయవంతం చేయాలి
- సమీక్ష సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :** రైతు భరోసా పథకం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. ఈనెల 20వ తేదీ సోమవారం రోజున కాటారంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రైతు భరోసా విడుదల కార్యక్రమం, బహిరంగ సభ విజయ వంతం చేయాలని శనివారం మంథని లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావే శంలో మంథని బ్లాక్ అధ్యక్షులు, మంథని, రామగిరి, కమాన్ పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల అధ్యక్షులు, ప్రజా ప్రతిని ధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నా రు. ఈ బహిరంగ సభకు పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏనమల రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో మంత్రివర్గ సహచరులు,రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. అలాగే కార్య క్రమం సజావుగా జరిగేలా బాధ్యతలు కేటాయించి, ప్రతి ఒక్కరు తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.




పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చిత్రపటా నికి గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకాన్ని నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్ పాల్గొని సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్, పాలకవర్గ సభ్యులు, ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఫ్రీజర్ బాక్స్ తో కూడిన వైకుంఠ రథానికి 20 లక్షలు, కమాన్ పూర్ బస్టాండ్ నిర్మాణం కోసం 10 లక్షలు, చిల్డ్రన్ పార్క్ నిర్మాణం కోసం 13 లక్షలు మంజూరు చేసిన వాటిలో ఉన్నాయి. ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రామగుండం పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**- కార్పొరేషన్ ప్రజలకు మేయర్ మహంకాళి స్వామి పిలుపు**



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం కార్పొరేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఈరోజు 41వ డివిజన్లో కార్పొరేటర్ మార్కపురి సూర్య నేతృత్వంలో మేయర్ డిప్యూటీ మేయర్ మున్సిపల్ అధికారులంతా పర్యటన చేయడం జరిగింది రామగుండం పరిశుభ్రంగా ఉంచాల ని ఏకైక ధ్యేయంతో గౌరవ మేయర్ ప్రతిరోజు ఉదయం డివిజన్ల బాటపడుతూ ప్రధాన నాళాలతో పాటు డివిజన్లో ఉన్న శానిటేషన్ సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తున్నారు. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి గారు మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ లోని 41వ డివిజన్ ప్రజలకు నాళాలు చెత్త వేయకూడదని వేసిన వారికి 500 రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని విజ్ఞప్తి చేశారు గత పది సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా శానిటేషన్ వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి సారించి రామగుండంలో నాలాల శుద్ధి కార్యక్రమాన్ని చేస్తున్నామని దీనికి కార్పొరేషన్ ప్రజలందరూ సహకరించాలని కోరారు రామగుండం పునర్నిర్మాణంలో రామగుండం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి నాలాలో చెత్త వేయకుండా ఇతరులు కూడా వేయకుండా బాధ్యత తీసుకోవాలని రామగుండం కార్పొరేషన్ ఒక అందమైన నగరంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. డివిజన్ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి కార్పొరేటర్లు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇండియా కూటమి దిష్టిబొమ్మ దగ్ధం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్ సభలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లుకు వ్యతిరేకంగా స్పందించిన ఇండియా కూటమిపై నిరసన వ్యక్తం చేస్తూ శనివారము వేములవాడ అర్బన్ మండల భాజపా నాయకులు నంది కమాన్ వద్ద ఇండియా కూటమి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్ సభలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లుకు వ్యతిరేకంగా స్పందించిన ఇండియా కూటమిపై నిరసనగా వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశామన్నారు. మహిళ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడంతో మహిళలపై మమకారం లేని ఇండియా కూటమి ఆ బిల్లును జీర్ణించుకోలేక దానికి వ్యతిరేకిస్తునారన్నారు. రానున్న రోజుల్లో దేశంలోని మహిళలంతా మహిళా మహిళా బిల్లును వ్యతిరేకించిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్తారన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇండో-యూఎస్ ట్రేడ్ డీల్ దేశ ప్రయోజనాలకు విరుద్ధం

- వెంటనే డీల్‌ను రద్దు చేయాలి
- పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ముషీరాబాద్, ఏప్రిల్ 18 (జనం సాక్షి):** ఇండో–యూఎస్ ట్రేడ్ డీల్ దేశ ప్రయోజనాలకు విరుద్ధమని, ఈ డీల్ రైతులకు నష్టం కలిగించేలా ఉందని పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద "మోడీ జీ కో హటావో – కిసానోంకో బచావో" నినాదాలతో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, ఇండో–యూఎస్ ట్రేడ్ డీల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ మహా ధర్నా జరిగింది. ఈ మహా ధర్నాకు మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, భారత జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు."మోడీ తలవంచితే దేశం తలవంచదు" అంటూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ దూరదృష్టితో దేశానికి దిశానిర్దేశం చేసిన నాయకుడని, ఆయన పాలనలో పరిశ్రమలతో పాటు






వ్యవసాయం కూడా అభివృద్ధి చెందిందన్నారు. భారతదేశం వ్యవసాయాధారిత దేశం కావడంతో వ్యవసాయానికి నష్టం లేకుండా పారిశ్రామిక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లిన నాయకత్వం నెహ్రూదేనని పేర్కొన్నారు. గుండు సూది కూడా తయారు కాని స్థితి నుంచి నేడు రాకెట్లు తయారు చేసే స్థాయికి దేశం చేరుకుందని, ఈ విజయానికి జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ ల కృషే కారణమని తెలిపారు. ఇది ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గొప్పతనం కాదని విమర్శించారు.

ప్రధాని మోదీ కేవలం ఫోటోలకు పోజులు ఇస్తున్నారని, రైతులు కష్టపడి సంపాదించిన ఫలితాలను విదేశీ సంస్థలు దోచుకునే ప్రమాదం ఉందని ఆరోపించారు. దేశ సంపదను కొద్దిమంది పారిశ్రామిక వేత్తలకు మళ్లిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు ఇండో–యూఎస్ ట్రేడ్ డీల్‌కు సంబంధించిన చట్టాలను వెనక్కి తీసుకోవాలని నిరంతరం ప్రశ్నిస్తున్నారని తెలిపారు. వెంటనే ఈ చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలకే భవిష్యత్తులో నాయకత్వ అవకాశాలు ఉంటాయని తెలిపారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండిస్తూ, దక్షిణాది రాష్ట్రాలను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే మహిళా బిల్లు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కు రాష్ట్రంలోని వివిధ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇండో––యూఎస్ ట్రేడ్ డీల్ రద్దు చేయాలని నినాదాలు చేశారు.

## కోర్టు ధిక్కరణ కేసులో రాజేంద్రనగర్ ఆర్డీవోకు జైలు శిక్ష, జరిమానా

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ మండల పరిధిలోని అత్తాపూర్ ఆర్డీవోపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పెద్ద షాపూర్‌లో ఉన్న 74 ఎకరాల భూమి వివాదానికి సంబంధించి కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం నిర్ణీత గడువులో ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో, దిక్కరణ కేసులో ఆర్డీవోకు ఒక నెల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరి మానా విధించింది.ఈ కేసులో యూసుఫుద్దీన్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా, విచారణ లో అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. జరి మానా చెల్లించని పక్షంలో శిక్షను మరో రెండు వారాలు పెంచాలని కోర్టు స్పష్టం చేసిం ది. అయితే, అప్పీల్ దాఖలు చేసుకునే అవకా శం కల్పిస్తూ, ఈ తీర్పు అమలును రెండు వారాల పాటు నిలిపివేస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది.

## ఏప్రిల్ 25న కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం

- మునీరాబాద్‌లో అద్వయ కన్వెన్షన్‌లో భారీ సభ
- కవిత అధ్యక్షతన సామాజిక తెలంగాణ ధ్యేయంతో పోరాటం
- ప్రశ్నించు.. పోరాడు.. పరిష్కరించు.. నినాదంతో ప్రజలు రండి

**గంభీరావుపేట, ఏప్రిల్ 18 (జనంసాక్షి):** ఈ నెల 25వ తేదీన మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం జరగనుందని తెలంగాణ జాగృతి నాయకులు ప్రకటించారు.

శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాగృతి జిల్లా ఉపాధ్యక్షులు వర్ధ సతీష్, జాగృతి నాయకులు కూర సురేష్ పటేల్ ముఖ్య అతిథులుగా పాల్గొని కొత్త పార్టీ ఆవిర్భావ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ పటేల్ మాట్లాడుతూ, సామాజిక తెలంగాణ ధ్యేయంతో మహిళలు, విద్యార్థులు, యువకులకు ప్రాధాన్యత ఇస్తూ నీళ్లు, నిధులు, నియామకాలు సక్రమంగా అమలు చేసే దిశగా కొత్త పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. "ప్రశ్నించు.. పోరాడు.. పరిష్కరించు" అనే నినాదంతో పోరాటం చేసే దిశగా కవిత అక్క కొత్త పార్టీని ప్రారంభిస్తున్నారని, పార్టీ ఏర్పాటు ముందే బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కండువా కప్పుకుని జాగృతిలో చేరుతున్నారని వివరించారు.

జిల్లా ఉపాధ్యక్షులు వర్ధ సతీష్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కవిత అక్క జాగృతి ద్వారా అనేక పోరాటాలు చేసి మలిదశలో ముద్ర వేసినట్లు



గుర్తు చేశారు. గత పాలకులు నీళ్లు, నిధులు, నియామకాల్లో నిర్లక్ష్యం చేయడంతో కవిత అక్క మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నారని, ఏప్రిల్ 25న మునీరాబాద్‌లో జరిగే ఆవిర్భావ సభకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి మహిళలు, యువకులు, రైతులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వర్ధ సతీష్, జాగృతి నాయకులు కూర సురేష్ పటేల్, ఎల్లారెడ్డిపేట మండల ఇన్‌చార్జ్ కదిరే భాస్కర్ గౌడ్, ముస్తాబాద్ ఇన్‌చార్జ్ ఎడ్ల రమేష్, మండల నాయకులు ఓరుసు అశోక్, ఎర్ర నరసయ్య, రంగారావు, నాయకపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

**జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**

ఎడపల్లి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతా భావం పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం 6వ రోజు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళ్ పహాడ్ చౌరస్తా వద్ద ప్రజలతో మరియు డ్రైవర్లతో అవగాహన కార్యక్రమంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు ప్రతి ఒక్కరి ద్వారా రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం "అరైవ్ అలైవ్ " కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి , తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని తెలియజేసారు. కోవిడ్ సమయంలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది మృతిచెందగా 2025 లో జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల




వలన 302 మంది తమ ప్రాణాలను కోల్పోయారని తెలియజేశారు. కావున రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగి మరణాలు జరుగుతున్న కారణంగా ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కృషి చేయాలని ఇట్టి కృషి అనేది ప్రతి ఒక్కరీ,నుండి మొదలవ్వాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్ లో అట్టి ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని హాస్పిటల్ తరలిస్తారో , అతనికి ప్రభుత్వం నుంచి ప్రోత్సహించుట కోసం సహార్విర్ పథకం కింద ఉండేటటువంటి 25 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు తెలియజేసే టటువంటి పాంప్లెంట్లు మరియు పోస్టర్లను విడుదల చేసారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏ.సి.పి శ్రీనివాస్, బోధన్ రూరల్ సీ.ఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై రమ, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, యువకులు పాల్గొన్నారు.

## రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి రూ. 2.5 కోట్లు

**ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్**

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి యాజమాన్యం స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సమన్వయంతో శనివారం రామగుండం ఏరియా–1 పరిధిలోని జవహర్ నగర్ ఏరియా నుండి పరశురాం నగర్, 5 ఇంక్లైన్ వరకు మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఆర్జీ.1 జియం డి. లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రామగుండం శాసనసభ్యు లు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రూ. 2.5 కోట్ల సింగరేణి నిధులతో చేపట్టనున్న పలు ప్రధాన రోడ్ల విస్తరణ పనులను ఈరోజు అధికారికంగా ప్రారంభించడము జరిగినది. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ చేసిన విజ్ఞప్తి మేరకు, సింగరేణి యాజమాన్యం ఈ పనుల కోసం రూ. 2.5 కోట్ల నిధులను కేటాయించింది. జవహర్ నగర్, పరశురాం నగర్ 5 ఇంక్లైన్ కాలనీలలో పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్ల విస్తరణ పనులకు భూమి పూజ నిర్వహించడం జరిగినదని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ ఈ రోడ్ల విస్తరణ



పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, రాబోయే మూడు నుంచి నాలుగు నెలల కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావలని తెలిపారు. "ప్రజల సౌకర్యార్థం సింగరేణి సంస్థ ద్వారా నిధులు రాబట్టి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఈ రోడ్ల విస్తరణ ద్వారా స్థానిక కాలనీల రూపురేఖలు మారనున్నాయి. పనులలో నాణ్యత పాటించాలని, గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రామగుండం మున్సిఫల్ కార్పోరేషన్ మేయర్ మహంకాళి స్వామీ, ఆర్.జి. 1 జనరల్ మేనేజర్ (జిఎం) డి. లలిత కుమార్, డిజియం సివిల్ వరప్రసాద్, సింగరేణి శ్రీనివాస్, డిప్యూటి మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, కాంట్రాక్టర్ మొండయ్య (ఎమ్మెస్ సూర్యచంద్ర కాంట్రాక్ట్), కార్పోరేటర్స్, దూలికట్ట సతీష్, బెంద్రం రాజిరెడ్డి, ముస్తాపా, దాసరి విజయ్ఇతర సింగరేణి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే చొరవ పట్ల మరియు సింగరేణి యాజమాన్యం సహకారం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# స్పెషల్ డ్రైవ్ ద్వారా భూ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్**



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 18 ( జనం సాక్షి) :** భూభారతి స్పెషల్ డ్రైవ్ ద్వారా ధరణి 2020 వలన వచ్చిన భూ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. శనివారం రోజు కరీంనగర్ లోని ఫిలిం భవన్ లో ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆనాటి ధరణి 2020 నుండి ఈనాటి భూభారతి 2025 వరకు ప్రజల భూ సమస్యలు పరిష్కారం అయినాయా? అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ... భూభారతి స్పెషల్ డ్రైవ్ పెట్టి మూడు నెలల్లో భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కరీంనగర్ శివారు రేకుర్తిలో 4,500 ఇండ్లు నిషేధిత జాబితాలో ఉన్న వాటిని తొలగించాలన్నారు. అయితే వీరు గత 20 సంవత్సరాల నుండి మొదలుకొని దాదాపు 50 సంవత్సరాల వరకు ఇంటి పన్నులు కడుతూనే ఉన్నారన్నారని అలాంటి వారి ఇండ్లను కొత్తగా నిషేధిత జాబితాలోకి పొరపాటున పంపడం జరిగిందన్నారు. ధరణి, భూభారతి ఏర్పాటు చేసిన తర్వాత ఎన్ని ఫిర్యాదులు వచ్చినాయి, ఎన్ని పరిష్కారం అయినాయి అనేది ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ధరణి మూలంగా కరీంనగర్ జిల్లాలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయని, అవి మళ్లీ పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

భూభారతి సమస్యలపై త్వరలో రాష్ట్ర మంత్రు లు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను, అవసరమైతే సిఎం రేవంత్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. కరీంనగర్ భూ బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. భూ బాధితులు మాట్లాడుతూ... ప్రభుత్వం భూభారతి ద్వారా వెంటనే భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే నిషేధిత జాబితాలో ఉన్న భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. అనేక అంశాలపై సమావేశంలో చర్చించడం జరిగిందని భవిష్యత్తు కార్య చరణకు త్వరలోనే ముఖ్యులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రేకుర్తి భూ సమస్యల బాధితుల సంఘం అధ్యక్షులు మోహన్ రెడ్డి, తిమ్మాపూర్ మండలానికి చెందిన అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏదుల్ల రాజశేఖర్, మాజీ జెడ్పి కో ఆప్షన్ మెంబర్ జమీల్ అహ్మద్, దళిత నాయకులు నల్లాల కనకరాజు, బోయినపల్లి చంద్రయ్య, పెద్దెల్లి శేఖర్, మేడి అంజయ్య, అడ్వకేట్ శాయిని మల్లేశం, అడ్వకేట్ ముజీబ్, భూ బాధితులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష

- కూలీల సంఖ్య పెంచి అర్హులందరికీ ఉపాధి కల్పించాలి
- వేతనాలు సమయానికి చెల్లించి పారదర్శకత పాటించాలి
- మహిళలు, యువతకు ప్రాధాన్యం.. వేసవి ఏర్పాట్లు పూర్తి చేయాలి



**మల్లాపూర్, ఏప్రిల్ 18 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి మరిన్ని కూలీలను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో పనుల అందుబాటును పెంచి అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, మస్టర్ రోల్స్‌లో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కూలీల హాజరు నమోదు సక్రమంగా నిర్వహించి, వేతనాలు సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో మహిళలను ఎక్కువగా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి పనిని ఫోటో క్యాప్చరింగ్ ద్వారా ఎన్ఎమ్ఎస్ యాప్‌లో నమోదు చేయాలని, జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తెలిపారు.

వేసవి కాలం కావడంతో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు తగిన ఏర్పాట్లు చేయాలని, షేడ్ నెట్లు, తగిన నీడ, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందని, ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెట్‌పల్లి ఆర్‌డీఓ నరసింహ రావు, డీఆర్‌డీఓ రఘువరన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జగదీష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ మ్యాథ్స్

# ఒలింపియాడ్‌లో పతకాలు సాధించారు

- గణిత శాస్త్రంపై పట్టు సాధించి ఉపాధి అవకాశాలు పెంచుకోవాలి
- నాలుగు విద్యార్థులు ప్రశంసా పత్రాలు, పతకాలు గెలిచారు
- విజేతలను అభినందించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి):** విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే గణిత శాస్త్రం పట్ల అవగాహన కల్పించి, దానిపై పట్టు సాధించేలా ప్రోత్సాహం అందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. అందువల్ల వారికి ఉపాధి అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని స్పష్టం చేశారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన డా. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గణిత శాస్త్రం అన్ని పోటీ పరీక్షల్లో చాలా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గణితం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో నిపుణులైన ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామని, వివిధ స్థాయిలలో నిర్వహించే పోటీ పరీక్షలకు విద్యార్థులను ఎంపిక చేసి సన్నద్ధం చేస్తున్నామని వివరించారు. ఇటీవల యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన అంతర్జాతీయ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు జతిన్ సిద్ధార్థ (4వ తరగతి), డి. సిన్ధశ్రీ (6వ తరగతి), క్రిషిక్ ప్రీన్స్ (7వ తరగతి), నడిపెల్లి సహర్ష్ (9వ తరగతి), శివ స్మరణ్ రెడ్డి (9వ తరగతి) ప్రశంసా పత్రాలు, పతకాలు సాధించినట్లు హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎం.పి. తేజస్వి సూర్య దిష్టిబొమ్మ

# దహనం చేసిన కాంగ్రెస్ నేతలు

- ఎం.పి. తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలి.
- కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** కరీంనగర్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను, తెలంగాణ సాధించిన సాధకులందరినీ అవమానపరిచే విధంగా తెలంగాణ విభజనను పాకిస్థాన్‌తో పోల్చుతూ, తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా నిండు పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మండిపడ్డారు. కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఇందిరా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని నాలుగున్నర కోట్ల పౌరులను పాకిస్థాన్ వాదులతో పోల్చడం తీవ్రమైన అభ్యంతరకర వ్యాఖ్యలుగా పరిగణిస్తున్నామని తెలిపారు. తేజస్వి సూర్య వెంటనే క్షమాపణలు చెప్పకపోతే ఆయన పై దేశద్రోహం కేసు పెట్టాలని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచకొండ ప్రభాకర్, పర్వత మల్లేశం, ఇమ్రాన్, వీర దేవేందర్, హైమద్ అలీ, హాజీ,నిహాల్, వంగల విద్యాసాగర్, రూపు రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కుంభాల రాజకుమార్, గడప శ్రీనివాస్, అమీర్, ములకల కవిత, హస్త పురం తిరుమల పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యుడు ప్రకాష్ గౌడ్ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో ముందుంటూ మరోసారి తన మనసున్న నాయకత్వాన్ని చాటుకున్నారని మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మణికొండ డివిజన్‌కు చెందిన వి. నాగలక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నార్సింగ్ సర్కిల్ నెక్నంపూర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఎన్. ప్రభావతి, ఏ-బ్లాక్ డివిజన్ ప్రెసిడెంట్ ఇందిరా, మణికొండ డివిజన్ ప్రెసిడెంట్ సావిత్రి, మహదేవ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు

# పార్టీల పోరు కాదు... పసిబిడ్డల బతుకు పోరు

- శివన్నగూడెం రిజర్వాయర్‌పై రగులుతున్న పోరు
- ఫ్లోరైడ్ శాపానికి 440 మీటర్లే విరుగుడు
- 436.40 - 440 - 3.6 మీటర్ల తేడా మునుగోడు తలరాతను మారుస్తుంది





**మర్రిగూడ, ఏప్రిల్ 17 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు శివన్నగూడెం రిజర్వాయర్ ఒక ఆశాదీపం. కానీ ఆ దీపం పూర్తిగా వెలగాలంటే దాని నీటిమట్టం 440 మీటర్లకు పెంచాలని 'ఈఎల్వీ ఫౌండేషన్' అధినేత ఇ.ఎల్.వి. భాస్కర్ సూటిగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మర్రిగూడ మండలం శివన్నగూడ పైలాన్ వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, "20 ఏళ్ల నిరీక్షణ చాలదా? మా బిడ్డల ఎముకలు వంకర తిరగడం ఇంకెంత కాలం చూడాలి?" అని ఉద్వేగంగా అన్నారు. 436.40 మీటర్ల వద్దే ఆపేస్తే డెడ్ స్టోరేజ్ పెరిగి లైవ్ స్టోరేజ్ తగ్గుతుందని, డిండి ఎత్తిపోతల పథకానికి నీళ్లు అందవని వివరించారు. 440 మీటర్లు ఉంటే సుమారు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, 436.40 మీటర్లకే పరిమితమైతే ఆ ఆయకట్టు 40 వేల ఎకరాలకు పడిపోతుందని హెచ్చరించారు. "3.6 మీటర్ల తేడా అంటే మీకు చిన్నగా కనిపించవచ్చు. కానీ అది మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో లక్షల మంది తలరాతను మార్చే తేడా" అని భాస్కర్ ఉద్వేగంగా అన్నారు. కృష్ణా జలాలు పుష్కలంగా వస్తేనే భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం తగ్గుతుందని, సగం నీటిమట్టంతో ఆ లక్ష్యం నెరవేరదని స్పష్టం చేశారు. లెంకలపల్లిలో క్రికెట్ సందడి.. ఈఎల్వీ భాస్కర్ చేతుల మీదుగా జిల్లా స్థాయి టోర్నీ ప్రారంభంచారు.

**గ్రామీణ యువత జాతీయ స్థాయికి ఎదగాలి**

మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామంలో క్రీడా ఉత్సాహం ఉప్పొంగింది. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ఈఎల్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈఎల్వీ ఫౌండేషన్ చైర్మన్ ఇ.ఎల్.వి. భాస్కర్ అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భాస్కర్ స్థానిక యువత డీజే హోరుతో ఘన స్వాగతం పలికారు. రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభించిన అనంతరం, ఆయన స్వయంగా బ్యాట్ పట్టి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. "గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నదే నా ఆకాంక్ష. యువతను సన్మార్గంలో నడిపించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి" అని భాస్కర్ పేర్కొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి క్రీడాకారుడు తగినంత నీటిని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.50,016, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25,016 నగదు బహుమతిని అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. మర్రిగూడ ఈఎల్వీ ఫౌండేషన్ ఇంచార్జ్ ఐ. నరసింహ గౌడ్ పర్యవేక్షణలో టోర్నమెంట్ నిర్వహణ సాగుతోంది. ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఎం. సతీష్, అశోక్, వెంకటేష్, శ్రీకాంత్, కిరణ్, కృష్ణ, ఎ. సతీష్, నరసింహ తదితరులు క్రీడల విజయవంతానికి కృషి చేస్తున్నారు.

# రైతులకు మరో 15రోజులు సాగునీరు విడుదల చేయాలి

- పాలకంకి దశలో వంద ఎకరాల వరి పొలాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రేకొండ రైతుల విజ్ఞప్తి



**చిగురుమామిడి ఏప్రిల్18(జనంసాక్షి):** మండలంలోని రేకొండ గ్రామ శివారులో కెనాల్ నుండి వచ్చే సాగునీరుపై ఆధారపడి దాదాపు 100ఎకరాల్లో రైతులు వరి పంటలు సాగు చేశారని రైతులు తెలిపారు.రబి సీజన్ ఆరంభంలో కెనాల్ కట్టలు తెగిపోవడం,తదితర సమస్యల వల్ల రెండు నెలలకు పైగా సాగునీరును ఆలస్యంగా విడుదల చేశారని,దీంతో పంటలు తాము లేటుగా వేశామని రైతులు దొడ్ల తిరుపతిరెడ్డి,గంద్రతి రామయ్య, నక్క లింగయ్య,గంద్రతి తిరుపతి,అప్పాల శ్రీను,బండోజు సదయ్య,పేరాల వేణులు తెలిపారు.వరి పంటలు పాలు పోసుకునేదశలో ఉన్నాయని,కెనాల్ బంద్ చేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు స్పందించి కెనాల్ నీళ్లు బంద్ చేయకుండా,మరో 15రోజులు నీటిని విడుదల చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను,సంబంధిత శాఖ అధికారులను రైతులు వేడుకుంటున్నారు.కెనాల్ నీళ్లు బంద్ చేస్తే వందల ఎకరాల పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని వారు దీనంగా చెబుతున్నారు.





### శాతవాహన యూనివర్సిటీ

# ఈసీ మెంబర్ రవీందర్ రెడ్డికి సన్మానం

**కరీంనగర్ బ్యూరో ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** శాతవాహన విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ వి.రవీందర్ రెడ్డి ఎన్నిక అయిన సందర్భంగా ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, శాతవాహన యూనివర్సిటీ పరిధి లోని వివిధ కళాశాలల యాజమాన్యం, అల్ఫోర్స్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, సూర్య నగర్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై వి. రవీందర్ రెడ్డి ని అభినంది సన్మానించారు. వారి సేవలు, విద్యా రంగానికి చేసిన విశిష్ట కృషి, నాయకత్వ లక్షణాల గురించి అందరూ ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... వి. రవీందర్ రెడ్డి ఎన్నిక ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలకి గర్వకారణమని, ఆయన అనుభవం, దూరదృష్టి విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ వి.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, శాతవాహన విశ్వవిద్యాలయానికి ఎన్ఎఎసి గుర్తింపు సాధించేందుకు తాను పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తానని, ఆ దిశగా అవసరమైన చర్యలకు మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, విశ్వవిద్యాలయం సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి, సహకరించిన ట్రాన్స్పోర్టేషన్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్‌కి, ఇతర పుర ప్రముఖులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

**ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్**

**రామగిరి, (జనంసాక్షి ) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా రామగిరి మండలంలోని ఆదివారంపేట, రాజాపూర్ గ్రామంలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ఆదివారంపేట, రాజాపూర్ గ్రామంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతల గురించి,చదువు మానేసిన, ఉన్నత చదువులు, వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో, ఎన్ని గంటలు పని చేశారో, ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలను కూడా నమోదు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఇల్లందుల సంజీవ్, పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య, పంచాయతీ సెక్రటరీలు మెండే వేణుగోపాల్, దాసరపు కిరణ్, ఆశా వర్కర్లు, కాదాసి స్వప్న, సంధ్యా, అంగన్వాడి టీచర్లు ఇల్లందుల లలిత, కారోబార్ పరశురాములు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లివర్ సమస్యలకు ఆల్కహాల్ ఒక్కటే కారణం కాదు

- లివర్ డే సందర్భంగా మెడికవర్‌లో అవగాహన సదస్సు
- మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో డాక్టర్ల అవగాహన సదస్సు





**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** లివర్ సమస్యలు కేవలం ఆల్కహాల్‌తోనే వస్తాయనే అపోహ ప్రజల్లో ఉందని ఆల్కహాల్ ఒక్కటే కారణం కాదని అనేక కారణాలతో లివర్ డ్యామేజ్ అవుతుందని మెడివకర్ వైద్యులు అన్నారు. వరల్డ్ లివర్ డేను పురస్కరించుకొని శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో వైద్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... రెగ్యులర్‌గా ఆల్కహాల్ సేవించడం వల్ల స్లోగా లివర్ డ్యామేజ్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. కల్తీ ఆహారం, కల్తీ నూనెల కారణంగా లివర్ డ్యామేజ్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కోవిడ్ తర్వాత శరీరంలో ఏ చిన్న సమస్య వచ్చినా, చాలా మంది వెంటనే పారాసిటమాల్ మాత్రలను ఆశ్రయిస్తున్నారని తాత్కాలిక ఉపశమనం ఇచ్చే ఈ మందులు, చాలా మందికి రోజువారీ అలవాటుగా మారిపోతున్నాయన్నారు. పారాసిటామల్ డోస్ ఎక్కువైనా లివర్‌పై ప్రభావం చూపుతుందన్నారు. అయితే, వైద్యుల పర్యవేక్షణ లేకుండా దీర్ఘకాలంగా ఏ మందులు వాడినా ఆరోగ్యానికి హానికరమేనని సూచించారు. నిరంతర అలసట, కండరాల క్రాంప్స్, తల తిరగడం, గుండె దడ, చేతులు లేదా కాళ్లలో మొద్దుబారటం, జుట్టు రాలడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కడుపు ఆరోగ్యాన్ని కాపాడితే లివర్ ఆరోగ్యాన్ని కాపాడినట్లే అన్నారు. కొన్ని క్యాన్సర్ల వల్ల లివర్ డ్యామేజి అయ్యే ప్రమాదం ఉందని, చెట్ల మందులు, పసర్లను నమ్ముకొని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పిలుపునిచ్చారు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒబెసిటీ కారణంగా ఫ్యాటిలివర్ సమస్యలు ఎక్కువగా పెరుగుతున్నాయని, ఫ్యాటి లివర్‌కు చికిత్స సాధ్యమేనని వెల్లడించారు. శరీరంలో అత్యంత కీలకమైన అవయవముగా లివర్ పనిచేస్తుందని లివర్‌ను కాపాడుకుంటేనే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చన్నారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో ఆసుపత్రి మెడికల్ గ్యాస్ట్రో డాక్టర్ ప్రణీత్, సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ దిలీప్ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ తాహా, అనెస్తీషియా డాక్టర్ వినయ్, క్రిటికల్ కేర్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష

- కూలీల సంఖ్య పెంచి అర్హులందరికీ ఉపాధి కల్పించాలి
- వేతనాలు సమయానికి చెల్లించి పారదర్శకత పాటించాలి
- మహిళలు, యువతకు ప్రాధాన్యం.. వేసవి ఏర్పాట్లు పూర్తి చేయాలి



**మల్లాపూర్, ఏప్రిల్ 18 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి మరిన్ని కూలీలను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో పనుల అందుబాటును పెంచి అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, మస్టర్ రోల్స్‌లో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కూలీల హాజరు నమోదు సక్రమంగా నిర్వహించి, వేతనాలు సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో మహిళలను ఎక్కువగా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి పనిని ఫోటో క్యాప్చరింగ్ ద్వారా ఎన్ఎమ్ఎస్ యాప్‌లో నమోదు చేయాలని, జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. వేసవి కాలం కావడంతో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు తగిన ఏర్పాట్లు చేయాలని, షేడ్ నెట్లు, తగిన నీడ, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందని, ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెట్‌పల్లి ఆర్‌డీఓ నరసింహ రావు, డీఆర్‌డీఓ రఘువరన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జగదీష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
19 ఏప్రిల్ 2026

# పోలీసు ప్రధాన కార్యాలయంలో క్యాంటీన్ ప్రారంభించిన డీజీపీ బి.శివధర్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం లో సిబ్బంది సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన 'సురుచి' స్టాఫ్ క్యాంటీన్‌ను శనివారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ప్రారంభించారు. పోలీసు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో ఈ క్యాంటీన్‌ను అత్యాధునిక వసతులతో నిర్మించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీజీపీ బి .శివధర్ రెడ్డి రిబ్బన్ కత్తిరించి క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి క్యాంటీన్ ప్రాంగణాన్ని, సిబ్బందికి కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల విభాగం అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్, టీఎస్-ఎల్‌పీఆర్‌బీ ఛైర్మన్ వివి శ్రీనివాసరావు, సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్, వెల్ఫేర్ ఐజీపీ గజరావు భూపాల్, రైల్వే ఐజీపీ రమేష్ నాయుడు, టీజీ పిక్స్ చీఫ్ ఇంజనీర్ డి తులసీదర్ రెడ్డి , వెల్ఫేర్ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డితోపాటు పలువురు పోలీసు అధికారులు, డిజిపి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడ్యుకేషన్ హబ్‌గా ఆందోల్

## రూ. 27.76 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- పాలిటెక్నిక్‌లో రూ.43 లక్షలతో మెకానికల్ వర్క్‌షాప్
- నియోజకవర్గంలో విద్యాసంస్థల విస్తరణకు ప్రాధాన్యం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ఎడ్యుకేషన్ హబ్‌గా ఆందోల్‌ను అభివృద్ధి చేస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. శనివారం అందోల్ నియోజకవర్గంలో నిర్వహించిన సుడిగాలి పర్యటనలో భాగంగా విద్యా అభివృద్ధి, మౌలిక వసతుల పెంపుపై ఆయన దృష్టి సారించారు. శివంపేట పాలిటెక్నిక్ కళాశాలలో న్యూ హాలాండ్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులు రూ. 43 లక్షలతో నిర్మించిన మెకానికల్ వర్క్‌షాప్ షెడ్‌ను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... విద్యతోనే జీవితాల్లో వెలుగులు నిండుతాయని, అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే పాలిటెక్నిక్, జేఎన్టీయూ ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, వ్యవసాయ, మహిళా కళాశాలలతో పాటు మోడల్, రెసిడెన్షియల్, కస్తూర్బా పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాలికల భద్రత, వసతుల విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. సిఎస్ఆర్ నిధులు రూ. 10 కోట్ల తో నియోజకవర్గంలోని విద్యాసంస్థలలో మౌలిక వసతుల మెరుగుదల పనులు చేపడుతున్నట్లు వివరించారు. మంత్రి తన పర్యటనలో భాగంగా రూ. 27.76 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అందోల్‌లో రూ. 1.80 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించగా, చెరువు కట్ట వద్ద రూ. 5 కోట్లతో నిర్మించనున్న పర్యాటక రెస్టారెంట్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 20 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయం పనులను ప్రారంభించారు. రూ. 53 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం మొదటి అంతస్తును ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని సూచించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అదనపు కలెక్టర్ పాండు, ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్,న్యూ లాండ్ ఫౌండేషన్ ప్రతినిధి డి వి రెడ్డి,సర్పంచ్ సంధ్యా రాణి, సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

## రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులు




**టెహ్రాన్, ఏప్రిల్18 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేసింది. తాజాగా హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై కాల్పులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులకు పాల్పడినట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. వాటిల్లో భారత జెండా ఉన్న ట్యాంకర్ ఒకటి ఉన్నట్టు సమాచారం. హోర్ముజ్ జలసంధి గుండా వెళు న్న రెండు వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీకి చెందిన ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరిపాయి. అయితే ఈ దాడిలో ట్యాంకర్లు, వాటిల్లోని సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలో భారత్‌కు చెందిన మరో రెండు నౌకలను దారి మళ్లించినట్టు 'ట్యాంకర్ ట్రాకర్స్' తెలిపింది. ఇరాక్ నుంచి రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్‌కు తీసుకొస్తున్న ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధి నుంచి వెనక్కి మళ్లినట్టు సమాచారం. కాగా, అమెరికాతో చర్చల సందర్భంగా హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు శుక్రవారం ఇరాన్ ప్రకటించింది. అయితే ఇరాన్ ఓడ రేవుల చుట్టు అమెరికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. దీంతో ఇరాన్ తిరిగి హోర్ముజ్ జలసంధిని మూసేసింది. హోర్ముజ్ జలసంధిని మూసేసినట్టు ఇరాన్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ కాల్పులు జరిగాయి.

# కాంగ్రెస్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు

- ఉద్యోగుల జీతభత్యాలు సకాలంలో ఇవ్వడం లేదు
- పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు
- ఐదు డిఎలు పెండింగ్‌లోనే ఉన్నాయి
- ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్




**హైదరాబాద్, ఏప్రిల్18 (జనంసాక్షి) :** తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమిషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.



# నల్ల బ్యాడ్జీలతో ఐటీసీ కార్మికుల నిరసన

**భద్రాచలం, ఏప్రిల్18 (జనంసాక్షి) :** కార్మిక సమస్యలు తక్షణం పరిష్కరించాలని కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఐటీసీ కర్మాగారం అడ్మిన్ బ్లాక్ వద్ద పెద్ద ఎత్తున కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ సమస్యలు పరిష్కరించడం లేదని, 14వ వేతన ఒప్పందం కార్మికులకు ఆమోద యోగ్యంగా రూ.22 వేలకు తగ్గకుండా చేయాలని, కార్మికులందరికీ 100శాతం అన్లిమిటెడ్ మెడికల్ స్కీంను తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అడ్మిన్ బ్లాక్‌లో కార్మికులం తా నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు.జేఏసీ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కొత్త క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని, షటిల్ కోర్టు, జిమ్ ఏసీ, బైక్ స్టాండ్, లాంగ్ సిక్ కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు తదితర సమస్యలు ఐటీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మిక జేఏసీ తీసుకునే వ్యతిరేక నిర్ణయాలకు గుర్తింపు సంఘం, యాజ మాన్యం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుం దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# మేడారం ప్రమాద బాధిత బాలుడికి ప్రభుత్వసాయం

## చెక్కును అందజేసిన మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో, ఏప్రిల్18 (జనం సాక్షి):** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జరిగిన ప్రమాదంలో కాలు దెబ్బతిన్న బాలుడి కుటుంబానికి దేవాదాయ శాఖ ఆర్థిక సహాయం, ఉద్యోగ భరోసా కల్పించారు. శనివారం ములుగు జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా బాధిత బాలుడి కుటుంబానికి దేవాదాయ శాఖ తరుపున చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కార్య నిర్వహణాధికారి ఈఓ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే బాలుడిని తల్లిదండ్రులకు సమాచారం మేరకు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి అత్యంత నాణ్యమైన వైద్యం అందించడం జరిగిందని, వైద్యానికి అయిన ప్రతి ఒక్క రూపాయి ఖర్చును ప్రభుత్వమే పూర్తిగా భరించిందని తెలిపారు. బాలుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాలుడి పేరు మీదనే ఆర్థిక సహాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో బ్యాంకులో జమ చేయడం జరిగిందని,బాలుడి తల్లికి కుటుంబ పోషణార్థం దేవాదాయ శాఖలో, మేడారం వనదేవతల సన్నిధి ప్రాంగణంలోనే అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం కల్పించి నెలకు రూ. 18,000/- వేతనం అందజేయ బడుతుందని పేర్కొన్నారు. బాలుడి గాయం నుంచి పూర్తిగా కోరుకున్న అనంతరం అతనికి నాణ్యమైన కృత్రిమ కాలు అమర్చడంతో పాటు, సౌకర్యార్థం ఒక స్కూటీ కూడా అందజేయడం జరుగుతుందని ఈఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధ బోయిన జగ్గారావు, బాలుడి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# హర్మూజ్‌పై మళ్లీ పీటముడి

- మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన



**టెహ్రాన్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. హోర్ముజ్ జలసంధి తెరుచుకుందనే ఆనందం 24 గంటలు కూడా నిలవలేదు. మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా తమ నౌకలపై విధించిన సముద్ర నిర్బంధం కొనసాగు తుండడమే ఇందుకు కారణమని టెహ్రాన్ పేర్కొంది. హోర్ముజ్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ విధించినట్లు ప్రకటించింది. అమెరికా తన నిర్బంధాన్ని ఎత్తివేయకపోతే జలసంధి పూర్తిగా తెరవబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. హోర్ముజ్‌ను తెరిచినప్పటికీ ఇరాన్ నౌకలపై తమ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడం ఉద్రిక్తతలను పెంచింది. హోర్ముజ్ జలసంధి గురించి, శాంతి ఒప్పందం గురించి ట్రంప్ సోషల్ మీడియాలో చేస్తున్న పోస్ట్‌లన్నీ అబద్ధాలేనని, దౌత్య చర్చలపై ముందుకు సాగుతుండగా ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఇరాన్ అంగీకరించదని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య ఏప్రిల్ 20న రెండో దఫా శాంతి చర్చలు జరగబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగానే ఇవి జరగబోతున్నట్టు ఇరాన్ మీడియా పేర్కొంటోంది. అయితే ఈ శాంతి చర్చలు వేదిక, తేదీ గురించి అమెరికా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ క్రమంలో హర్మూజ్ జలసంధిని తెరుస్తామని ప్రకటించిన ఇరాన్ మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. శనివారం తాజాగా మళ్లీ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బందనం ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధిని మూసివేసి రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందానికి వచ్చే వరకు ఈ జలసంధి దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ హర్మూజ్‌ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. కాగా, ట్రంప్ శనివారం 'కొన్ని మంచి వార్తలున్నాయని చెప్పుకొచ్చారు. బుధవారం లోగా ఒప్పందం కుదరకపోతే యుద్ధంలో కాల్పుల విరమణను పొడిగించకపోవచ్చని ఆయన అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది.

# బర్త్ డే పార్టీలో బాలికపై నలుగురు స్నేహితుల లైంగికదాడి

**రాంచీ (జనంసాక్షి) :** స్నేహితులైన నలుగురు యువకులు ఒక బాలికను పుట్టిన రోజు వేడుకకు పిలిచారు. మద్యం సేవించిన వారు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక ఫిర్యాదుతో నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఈ సంఘటన జరిగింది. మార్చి 31న ఒక యువకుడు పుట్టిన రోజు జరుపుకున్నాడు. ముగ్గురు ఫ్రెండ్స్‌తో పాటు స్నేహితురాలిని బర్త్ డే పార్టీకి ఆహ్వానించాడు. ఈ సందర్భంగా నలుగురు యువకులు మద్యం సేవించారు. 15 ఏళ్ల స్నేహితురాలిపై అత్యాచారానికి పాల్పడ్డారు.

బాధిత బాలిక ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేశారు. ఏప్రిల్ 16న కేసు నమోదు చేశారు. నిందితులైన 15 నుంచి 17 ఏళ్ల వయస్సున్న నలుగురు మైనర్ బాలురను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జువైనల్ హోమ్‌కు వారిని తరలించారు. ఈ సంఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# కర్ణాటకలో బర్డ్ ఫ్లూ కలకలం!

**బెంగళూరు (జనంసాక్షి) :** కర్ణాటకలో ఈ ఏడాది తొలి బర్డ్ ఫ్లూ కేసు నమోదైంది. బెంగళూరు శివారు ప్రాంతమైన హెసరఘట్ట సమీపంలో ముథూర్ గ్రామంలోని ఒక కోళ్ల ఫారమ్‌లో ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (హెచ్5ఎన్1) వైరస్‌ను గుర్తించారు. ఏప్రిల్ 14న ఆ ఫారమ్‌లోని కోళ్లకు నిర్వహించిన ప్రాథమిక పరీక్షల సమయంలో బర్డ్ ఫ్లూ కేసు నిర్ధారణ అయ్యింది. పశుసంవర్ధక, ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించారు. వైరస్ వ్యాప్తి నివారణకు తక్షణ చర్యలు చేపట్టారు. ఏప్రిల్ 15న ఆ ఫారమ్‌లో ఉన్న మొత్తం 7,444 కోళ్లను చంపి పెద్ద గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. 14,788 గుడ్లు, 2,250 కిలోల పౌల్ట్రీ ఫీడ్‌ను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించారు. 10 మంది పౌల్ట్రీ కార్మికులను క్వారంటైన్‌లో ఉంచారు. మరోవైపు ఆ ప్రాంతాన్ని 'ఇన్‌ఫెక్టెడ్ జోన్'గా అధికారులు ప్రకటించారు. సమీప ప్రాంతాల్లోనూ నిఘాను ముమ్మరం చేశారు.

# స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

- పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్18 (జనంసాక్షి) :** ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్,స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. కొన్ని పాన్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వస్తువులను సీజ్ చేశారు పోలీసులు. లోకల్ వస్తువులకు బ్రాండెడ్ ముద్ర వేసి అమ్ముతున్న కొన్నింటిని.. అదే విధంగా ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ హిల్స్ లోని ఓ పాన్ షాపులో ఈ సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370